thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 326 కరీంనగర్ ఆదివారం, 1 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# ఎక్కడి పొత్తులు అక్కడే..

## మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల పొత్తు సిత్రాలు !




హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో 'లోకల్' పొత్తులు పొడుస్తున్నాయి. హైకమాండ్ స్థాయిలో పొత్తులపై ఎటూ తేల్చని ప్రధాన పార్టీలు.. ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ పొత్తులపై నిర్ణయం తీసుకుంటున్నాయి. అధికార పార్టీ కొన్నిచోట్ల సీపీఐతో, ఇంకొన్ని చోట్ల సీపీఎంతో జట్టుకడ్తోంటే, బీఆర్ఎస్ కొన్నిచోట్ల బీజేపీతో, ఇంకొన్ని చోట్ల సీపీఎం, టీడీపీతో పొత్తులు పెట్టుకుంటోంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ , సీపీఎం పార్టీల నడుమ పొత్తు కుదిరింది. చేర్యాల మూడో వార్డును సీపీఎం కు కేటాయించగా, బీఆర్ఎస్ పాలక వర్గం ఏర్పడితే కో ఆప్షన్ పదవిని సీపీఎంకు కేటాయించాలని నిర్ణయించారు. జనగామలో కాంగ్రెస్ తో పొత్తు కుదుర్చుకున్న సీపీఎం, అదే అసెంబ్లీ నియోజకవర్గంలోని చేర్యాల మున్సిపాల్టీ లో మాత్రం బీఆర్ఎస్ తో పొత్తు కుదుర్చుకోవడం విశేషం. ఇక మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్, సీపీఎం మధ్య పొత్తు కుదిరింది. సీపీఐ పార్టీతోనూ చర్చలు కొనసాగుతున్నాయి. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 18 మంది అభ్యర్థుల పేర్లతో జాబితాను రిలీజ్ చేసింది. సీపీఐతో పొత్తు చర్చలు కొలిక్కిరాకపోవడంతో మిగిలిన వార్డులను పెండింగ్ లో పెట్టినట్లు తెలుస్తోంది. ఇదే జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, సీపీఎం నడుమ పొత్తులు ఖరారయ్యాయి. ఒకవేళ సీపీఐ వస్తే కలుపుకోవాలనే ఉద్దేశ్యంతోనే అభ్యర్థులను ప్రకటించడం లేదని సమాచారం. భద్రాద్రికొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్?లో కాంగ్రెస్, సీపీఐ పొత్తులపై రెండు రోజులుగా జరిగిన చర్చలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి.

ఇక్కడ కాంగ్రెస్, సీపీఎం మధ్య పొత్తు ఖరారైంది. ఇదే జిల్లా అశ్వా రావుపేటలో బీఆర్ఎస్, టీడీపీ మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతుండగా, ఇల్లెందు మున్సిపాలిటీలో కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ మధ్య మంతనాలు జరుపుతున్నారు. నల్గొండ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్, సీపీఎం మధ్య పొత్తు ఖరారైంది. బుధవారం 18 మంది అభ్యర్థుల జాబితాను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి విడుదల చేయగా, వీరిలో ఒకరు సీపీఎం అభ్యర్థి ఉండడం గమనార్హం. వనపర్తి మున్సిపాలిటీ లోనూ బీఆర్ఎస్?, సీపీఎంతో పొత్తు పెట్టుకుంది. ఇక్కడ18, 21 వార్డులను సీపీఎంకు ఆ పార్టీ కేటాయించింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ ఎస్, బీజేపీ మధ్య పొత్తు చర్చలు జరుగుతున్నాయి. భూపాలపల్లి లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంల మధ్య పొత్తులు కొలిక్కివచ్చాయి. 24 వార్డుల్లో కాంగ్రెస్, 5 వార్డుల్లో సీపీఐ, సీపీఎంకు ఒక వార్డు కేటాయించారు. మెదక్ మున్సిపాలిటీలో 32 వార్డులు ఉండగా బీజేపీ కి 10 వార్డుల్లో మాత్రమే అభ్యర్థులు ఉన్నారు. దీంతో మిగిలిన వార్డుల్లో బీఆర్ ఎస్ కు లోపాయికారీగా మద్దతివ్వాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, మద్దూరు, మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు బలంగా ఉన్న చోట్ల బీజేపీ నుంచి, బీజేపీ అభ్యర్థులు బలంగా ఉన్న చోట్ల బీఆర్ఎస్ నుంచి బలహీన అభ్యర్థులను నిలిపి సహకరించుకోవాలని, ఎన్నికల తర్వాత చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ స్థానాలు పంచుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఉదయం బీజేపీ, బీఆర్ఎస్ లీడర్లు ఓ ఫాం హౌస్‌లో సమావేశమై చేతులు కలిపారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో(జనవరి 30) ముగిసింది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం.

ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.



### వింగ్స్ ఇండియా ప్రదర్శన.. సందర్శకుల సందడి

హైదరాబాద్: భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా–2026 విమానయాన ప్రదర్శన శనివారం కూడా కొనసాగింది. ఈ నేపథ్యంలో బేగంపేట విమానాశ్రయం లో జరుగు తున్న వింగ్స్ ఇండియా–2026 ప్రదర్శనను తిలకించేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఆకాశంలో విమానాలతో చేసే విన్యాసాలను వీక్షిస్తూ సందడి చేశారు.

### నేటి నుంచి వీటిపై 28 శాతం జీఎస్టీ.. భారీగా పెరగనున్న ధరలు

ప్రతీ ఆదివారం వీకెండ్ వైబ్ లో చిల్ అవుతుంటారు. కానీ ఈ ఆదివారం అలా కాదు. ఫిబ్రవరి 1న కేంద్రం 2026–27 బడ్జెట్ ను పార్లమెంట్లో ప్రవేశపెట్టనుంది. సో ఏమేం తగ్గుతాయి? ఏమేం పెరుగుతాయి? నిత్యావసరాలు, బంగారం, వెండిలపై జీఎస్టీ సంగతేంటి? ఇన్కమ్ ట్యాక్స్ శ్లాబులు మారుతాయా? ఇలా చాలా విషయాలపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బడ్జెట్ లో ప్రస్తావించే అంశాలను పక్కనపెడితే.. బడ్జెట్ రోజు నుంచే కొన్ని కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. వీటిలో మొదటిది ఫాస్టాగ్. దీనికి సంబంధించి కొత్త విధానం ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఇకపై కొత్తగా ఇచ్చే ఫాస్టాగ్లకు know your vehicle విధానాన్ని కేంద్రం రద్దు చేసింది. ఈ విధానం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కేంద్రం దృష్టికి రావడంతో.. ఫిబ్రవరి 1 నుంచి జారీ చేసే ఫాస్టాగ్లకు దీని నుంచి మినహాయింపు ఇచ్చింది. అయితే.. లూజ్ ఫాస్టాగ్, ఫాస్టాగ్ తప్పుగా ఇవ్వడం, దానిని దుర్వినియోగం చేయడం వంటి కంప్లైంట్స్ వస్తే.. సంబంధిత వాహనదారుడికి కేవైవీ వర్తిస్తుందని స్పష్టం చేసింది.

**ICICI కొత్త రూల్...** ఐసీఐసీఐ బ్యాంక్ ఫిబ్రవరి 1 నుంచి కొత్త రూల్ తీసుకురానుంది. ఈ బ్యాంక్ నుంచి ఇన్ స్టంట్ ప్లాటినం చిప్ క్రెడిట్ కార్డు, ప్లాటినమ్ క్రెడిట్ కార్డులు పొందిన కస్టమర్లకు బుక్ మై షోలో ఫ్రీ/ కాంప్లిమెంటరీ మూవీ టికెట్స్ ను అందిస్తోంది. వాటిని ఫిబ్రవరి 1 నుంచి నిలిపివేయనుంది. ఈ రెండు కార్డులు మినహా మిగతా కార్డులకు ఇది కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**ఎల్పీజీ ధరల్లో కీలక మార్పు...** ప్రతినెలా 1వ తేదీన ఎల్పీజీ, విమాన ఇంధన (ATF) ధరలను చమురు కంపెనీలు సవరిస్తుంటాయి. జనవరి 1న కమర్షియల్ సిలిండర్ ధర ఏకంగా రూ.111 పెరగ్గా.. ఏటీఎఫ్ ధర 7 శాతం మేర పెరిగింది. ఈసారి కూడా ఎల్పీజీ ధరలు భారీగా తెరవనున్నట్లు తెలుస్తోంది.

**ఆదివారం స్టాక్ మార్కెట్లు...** స్టాక్ మార్కెట్లు సోమవారం నుంచి శుక్రవారం వరకూ మాత్రమే ఉంటాయి. తప్పనిసరి పరిస్థితుల్లో శని, ఆదివారాలు పనిచేస్తాయి. ఈసారి బడ్జెట్ ఆదివారం జరుగుతుండటంతో.. ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ తెరచుకోనున్నాయి. రోజులాగే కార్యకలాపాలు నిర్వహిస్తాయి. అయితే బ్యాంకులు మాత్రం ఈ రోజున మూతపడి ఉంటాయి.




**వీటిపై 28 శాతం జీఎస్టీ అమలు..** దేశంలో పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడంతో వాటి వాడకాలను అరికట్టేందుకు కేంద్రం 28 శాతం జీఎస్టీ విధించింది. ఇది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఇది అన్ని పొగాకు ఉత్పత్తులైన పాన్ మసాలా, సిగరెట్లు, నమిలో పొగాకు, సిగార్స్, హుక్కా, జర్దా, సెంటెడ్ పొగాకులకు వర్తిస్తుంది. జీఎస్టీతో పాటు వివిధ సెస్ రేట్లు కూడా ఉన్నాయి. మొత్తం 40 శాతం జీఎస్టీ అమల్లోకి రానుండగా.. వాటి రేట్లు భారీగా పెరగనున్నాయి.




# బడ్జెట్‌లో సామాన్యులకు భారీ ఊరట..

## తగ్గనున్న ఈ వస్తువుల ధరలు..?

# నేడే నిర్మలమ్మ 'పొద్దు'

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సర్వేలో మరో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఈ క్రమంలో రేపు ఫిబ్రవరి 1న రానున్న బడ్జెట్ ఎలా ఉంటుందనే దానిపై దేశ ప్రజల్లో అంచనాలు ఆమాంతం పెరిగిపోతున్నాయి. ఈ సారి బడ్జెట్‌పై అనేక రకాల వినిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం క్రమంలో 2026–27 కేంద్ర బడ్జెట్ కీలకంగా మారింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న క్రమంలో బడ్జెట్‌లో పలు పన్ను మినహాయింపులతో పాటు అనేక ఆర్థిక సంస్కరణలు ఉంటాయనే ప్రచారం సాగుతోంది.

**అందరిచూపు వీటిపైనే..** బడ్జెట్ అనగానే అందరిలో మెదిలే ప్రశ్న ఒక్కటే.. ఏయే వస్తువులు పెరుగుతాయి.. ఏయే వస్తువులు తగ్గుతాయి అనేది చూస్తూ ఉంటారు. కేంద్రం బడ్జెట్‌లో తీసుకునే నిర్ణయాలు, ట్యాక్స్ మినహాయింపులు, సుంకాలు, జీఎస్టీ రేట్లల్లో సవరణలు వస్తువుల ధరలపై ప్రభావితం చూపిస్తాయి. దీంతో బడ్జెట్ తర్వాత కొన్ని వస్తువుల ధరలు తగ్గనుండగా.. మరికొన్ని పెరుగుతూ ఉంటాయి. దీంతో ఈ సారి బడ్జెట్ తర్వాత ఏయే వస్తువుల ధరలు పెరుగుతాయి.. ఏవేవీ తగ్గుతాయి అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ విష యంపై అనేక అంచనాలు వెలువడుతున్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబు ల్లో మార్పులు, హోమ్ లోన్ ఈఎంఐ, ఎలక్ట్రిక్ వెహికల్స్, పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభావితం చేసేలా పలు నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో ఉండనున్నాయి.

**ఈ ధరలు తగ్గే అవకాశం** –ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపులు(జీతం తీసుకునేవారికి చేతికి ఎక్కువ సొమ్ము అందే అవకాశం) –హోమ్ లోన్, ఈఎంఐలు(రుణ ఛార్జీలు తగ్గించే అవకాశం)
–ఎలక్ట్రిక్ వెహికల్స్(సబ్సిడీలు మరింత పెంపు) –ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు( దిగుమతులపై సుంకాలు తగ్గించే అవకాశం)

**ఇవి పెరిగే అవకాశం..** –పెట్రోల్,డీజిల్ ధరలు –కార్లు(ట్యాక్స్‌లు పెంచే అవకాశం) క–న్స్యూమర్ ప్రోడక్ట్స్ ఇన్‌కమ్ ట్యాక్స్ రిలీఫ్

ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపులు ఖచ్చితంగా ఉండనున్నాయి. ఉమ్మడి కుటుంబం ఉన్నవారికి రూ.25 లక్షల వరకు ఆదాయం ట్యాక్స్ ఫ్రీ సౌకర్యం అందించనున్నారని వస్తున్నాయి. ప్రస్తుతం ఉద్యోగులకు రూ.15 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి ట్యాక్స్ లేదు. గత బడ్జెట్‌లో ఈ మేరకు ఉద్యోగులకు ప్రభుత్వం ఊరట కలిగించింది. అయితే ఈ సారి అందులో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక వ్యాపారవేత్తలకు ఈ సారి రాయితీలు, ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండనున్నాయి. జీడీపీని వృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా వ్యాపార వర్గాలు సబ్సిడీల కోసం ఎదురుచూస్తున్నాయి.

చురకలు
ఆదివారం 1 ఫిబ్రవరి 2026




హైదరాబాద్: కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఎస్బీఐ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. ఉదయం 7 గంటలకు ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు రిషద్ అనే వ్యక్తి వచ్చాడు.

అతడిని దుండగులు వెంబడించి.. కాల్పులు జరిపారు. రూ. 6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి తూటా గాయమైంది. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. ఘటనాస్థలిలో సీసీటీవీ ఫుటేజీని సుల్తాన్ బజార్ పోలీసులు పరిశీలిస్తున్నారు. బైకుపై వచ్చిన ఇద్దరు దుండుగులు కాల్పులు జరిపి డబ్బు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు రిషద్‌ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా గుర్తించారు. ఘటనాస్థలిని డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు.

క్లూస్ టీమ్స్ ఇప్పటికే ప్రాథమిక వివరాలు సేకరించినట్లు తెలిపారు. "ఉదయం 6:30 నుంచి 7 గంటల మధ్య ఘటన జరిగినట్లు మాకు సమాచారం అందింది. కాల్పులు జరిగిన వెంటనే అలర్ట్ అయ్యాం. నిందితుల కోసం ఐదు బృందాలు గాలిస్తున్నాయి.

రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలా జరగడం దురదృష్టకరం. నిందితులు తప్పించుకోలేరు" అని అన్నారు.




## వేసక్టమీ రివర్సల్ ఆపరేషన్స్ కోసం క్యూకడుతున్న మాజీ నక్సల్స్

ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. పోరుబాటను వీడి సామాన్య జీవితాలను గడుపుతున్నారు. ఈ క్రమంలో కొందరు తమకంటూ కుటుంబం, సంతానం ఉండాలని తాపత్రయ పడుతున్నారు. అడవుల్లో ఉండగా వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్న వారు ప్రస్తుతం రివర్సల్ ఆపరేషన్స్ కోసం అధికారుల సాయం కోరుతున్నారు. 10–15 ఏళ్ల క్రితం ఈ ఆపరేషన్స్ చేయించుకున్న కొందరు తమకు అసలు సంతాన భాగ్యం ఉందా? అని ఆందోళన చెందుతున్నారు. మావోయిస్టుల మధ్య వివాహాలకు అనుమతి ఉన్నా సంతానం కనేందుకు అనుమతి లేదని మాజీ నక్సల్స్ చెబుతున్నారు. వివాహాలు చేసుకున్న నక్సల్స్‌కు సుశిక్షితులైన డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపుల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతాయని చెప్పారు. 'అడవుల్లో నక్సల్స్ మధ్య పెళ్లిళ్ల తీరుతెన్నులు భిన్నంగా ఉంటాయి. మావోయిస్టుల మధ్య పెళ్లిళ్లకు అనుమతి ఉంది. కానీ కొన్ని రోజులు కలిసున్నాక భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో విధులకు వెళ్లాల్సి ఉంటుంది. మళ్లీ కలిసే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఒకే క్యాంప్‌లో కొన్ని రోజుల పాటు కలిసి పని చేయాలంటే ముందుగా క్యాడర్ నాయకుల నుంచి అనుమతి తీసుకోవాలి' అని ఒక మావోయిస్టు తెలిపారు. 'అడవుల్లోనూ డాక్టర్లు ఉంటారు. ప్రేమలో పడ్డ క్యాడర్ పెళ్లి చేసుకోవాలని భావించినప్పుడు ముందుగా పైఅధికారులకు సమాచారం అందించాలి. ఆ తరువాత వారు మళ్లీ ఎంక్వైరీ చేస్తారు. ఎలాంటి అభ్యంతరాలు లేవని రూఢీ పరుచుకున్నాక పెళ్లికి అనుమతిస్తారు. ఆ తరువాత పురుష మావోయిస్టులు అడవుల్లోని ప్రత్యేక క్యాంపుల్లో ఆపరేషన్ చేయించుకుంటారు. కొందరు ఆసుపత్రుల్లో కూడా చేయించుకున్నారు. ఆ తరువాత కొన్ని రోజులు రెస్టు తీసుకున్నాక మళ్లీ తమ కార్యకలాపాల్లో నిమగ్నమవుతారు' అని మరో మావోయిస్టు తెలిపారు. 'మాలో కొందరు 40వ పడిలో ఉన్నారు. సుమారు 10 –15 ఏళ్ల క్రితం మేము కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించుకున్నాము. జీవితమంతా అడవుల్లోనే గడిచిపోతుందని అప్పట్లో మేము అనుకునేవాళ్లం' అని వేసక్టమీ రివర్సల్ ఆపరేషన్ కోసం ఎదురుచూస్తున్న మరో మాజీ మావోయిస్టు తెలిపారు. గతేడాది దేశవ్యాప్తంగా 2,167మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో చాలా మంది ప్రస్తుతం తమకు సంతానం ఉండాలని కోరుకుంటున్నారు. వైద్య సాయం కావాలని ప్రభుత్వ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో గత ఆరు నెలల్లో సుమారు 50 మంది రివర్సల్ ఆపరేషన్స్ చేయించుకున్నారు. అధిక శాతం మంది మాత్రం వైద్య సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వేసక్టమీ రివర్సల్ ఆపరేషన్ కోరే వారి సంఖ్య ఎక్కువగా ఉందని బస్తర్ జోన్ ఐజీ పి.సుందర్ రాజ్ తెలిపారు. 'ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. చాలా మంది తమ జీవితంలో తొలిసారిగా అడవిని దాటి బయటకు వచ్చారు. వారు ప్రశాంత జీవనం గడిపేందుకు కావాల్సిన వైద్య సాయం, కౌన్సెలింగ్ అందిస్తాము' అని ఆయన తెలిపారు. పురుషుల్లో వీర్యం ప్రయాణించే వేస్ డిఫెరెన్స్ అనే నాళాలను ముడివేయం లేదా కత్తిరించడం ద్వారా వేసక్టమీ చేస్తారు. ఫలితంగా శుక్రకణాలకు మార్గం లేక సంతానం కలగదు. మహిళల్లో చేసే ఇదే తరహా ఆపరేషన్లను ట్యూబెక్టమీ అని అంటారు. ఇక వేసక్టమీ రివర్సల్ ఆపరేషన్‌లో మునుపటి నాళాలను మళ్లీ అనుసంధానిస్తారు. ఈ రెండు శస్త్రచికిత్సలూ పూర్తి సురక్షితమైనవని వైద్యులు చెబుతున్నారు.




హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే.

రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి" అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు.

## చట్ట ప్రకారం నోటీసు ఇవ్వలేదు.. జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ



హైదరాబాద్: భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కేసీఆర్‌ను హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో విచారించాలని సిట్ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుపై కేసీఆర్ స్పందించారు. చట్ట ప్రకారం నోటీసు ఇవ్వలేదని, నోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని లేఖలో పేర్కొన్నారు. "నందినగర్‌లోని నా నివాసానికి నోటీసులు అంటించడం చెల్లదు. రాజ్యాంగం ప్రకారం నోటీసులు అంటించడం అక్రమం. 160పీఆర్‌సీ ప్రకారం నాకు నోటీసులు ఇచ్చే పరిధి ఏసీపీకి లేదు. నేను ఉండే ఎర్రవల్లిలో నా స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుంది. మాజీ సీఎంగా, ప్రతిపక్ష నేతగా సిట్ విచారణకు సహకరిస్తా. రేపు మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులో ఉంటా. ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా నా ఇంటిని పరిగిణనలోకి తీసుకుంటాం అనడం సరికాదు. హరీశ్‌రావు అఫిడవిట్‌లో సిద్దిపేట అడ్రస్ ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో నోటీసులు ఇచ్చారు. చట్ట ప్రకారమైతే నేను నందినగర్‌లో విచారణకు అందుబాటులో ఉండాల్సిన అవసరం లేదు. నిన్న రాత్రి 9గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నా ఇంటికి నోటీసులు అంటించారు" అని కేసీఆర్ అభ్యంతరం తెలిపారు. కేసీఆర్ లేఖ నేపథ్యంలో సిట్ అధికారులు మరోసారి సమావేశమయ్యారు.

## సిట్ నోటీసులపై నేతలు, న్యాయవాదులతో కేసీఆర్ సమాలోచనలు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. నేతలు, న్యాయవాదులతో ఎర్రవల్లిలో సమాలోచనలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు నిన్నటి నుంచి ఎర్రవల్లిలోనే ఉన్నారు. రేపటి సిట్ విచారణ అంశంపై చర్చిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో తాను ఉంటున్న ఇంటికే వచ్చి విచారించాలన్న కేసీఆర్ విజ్ఞప్తిని సిట్ తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అక్కడకు రాలేమని చెబుతూ హైదరాబాద్‌లోనే విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉండాలని పేర్కొంది.

## తెలంగాణపై ప్రధానికి చిన్నచూపు.. ఈసారైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి: పొన్నం



హైదరాబాద్: బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్ర భాజపా ఎంపీలు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఏం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణపై ప్రధాని మోదీ చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పుట్టుకనే ప్రధాని మోదీ అవమానించారని విమర్శించారు. ఆర్ఆర్ఆర్, మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. "కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారంగా మాట్లాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రంతో సయోధ్య కోరుకుంటోంది. బడ్జెట్‌లో మా ప్రతిపాదనలను కేంద్రం అంగీకరించాల్సిందే. తెలంగాణ ఎంపీలు రాష్ట్రం కోసం పోరాడాలి. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలి. రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలి" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.




## రైలుకింద పడి కుటుంబం ఆత్మహత్య

హైదరాబాద్ : నగరంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. రైలుకింద పడి ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. శనివారం తెల్లవారుజామున చర్లపల్లి – ఘట్కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. ఎంఎంటీఎస్ డౌన్‌లైన్‌లో తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నట్టుగా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతులు బోడుప్పల్ హరితహారం కాలనీకి చెందిన పిన్నింటి విజయశాంతి రెడ్డి, విశాల్ రెడ్డి, చైతన్య రెడ్డిగా తెలుస్తోంది. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందిన వెంటనే రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్లు, విలువైన వస్తువులు లేవని జీఆర్‌పీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు జీఆర్‌పీ క్రైమ్ నంబర్ 57/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబం ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి? ఆర్థికపరమైన ఇబ్బందులేమైనా ఉన్నాయా? ఇంకా ఇతర కారణాలా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కుటుంబం ఆత్మహత్యతో బోడుప్పల్ హరితహారం కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందారు: కేటీఆర్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. "తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం.

ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు.




**అమెరికా ప్రభుత్వం మరోసారి షట్‌డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగిసింది. దాంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్‌లో ఇటీవల ఇద్దరు ఆందోళనకారులు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారుల కాల్పుల్లో మరణించడంతో సెనెట్ డెమోక్రాట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు "చట్టాన్ని అమలుచేసే అధికారులకు అమెరికా ప్రజలు మద్దతిస్తారు. సరిహద్దు భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తారు. కానీ వీధుల్లో భయభ్రాంతులకు గురిచేసే, అమెరికా పౌరులను చంపే ఐసీఈ అధికారులను ఉపేక్షించబోరు" అని తీవ్రంగా స్పందించారు. దానిని సంస్కరించకపోతే నిధుల విడుదల బిల్లుకు అవసరమైన ఓట్లు వేయబోమంటూ వారు హెచ్చరించారు. దీంతో హోంలాండ్ భద్రత, ఇతర విభాగాలకు నిధులు నిలిచిపోనున్నాయి. అయితే ఇది పాక్షికమేనని వచ్చేవారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని చట్టసభ సభ్యులు పేర్కొన్నారు. గతేడాది అక్టోబర్ 1న కూడా అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. ఆ దేశ చరిత్రలో సుదీర్ఘకాలం (43 రోజులు)పాటు కొనసాగింది. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. 1981 నుంచి యూఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 2018–19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.**

# ప్రజల ఆర్థిక భద్రతకు ఒక నూతన అధ్యాయం

## - ఫిబ్రవరి 1...భారతీయ తపాలా బీమా దినం




భారతీయ తపాలా బీమా దినం భారతదేశంలో తపాలా బీమా సేవల ప్రాముఖ్యతను ప్రజలకు పరిచయం చేయడానికి, ఆర్థిక భద్రతపై అవగాహన పెంచడానికి జరుపుకునే ప్రత్యేకమైన రోజు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 1న జరుపుకునే ఈ దినం, తపాలా బీమా సేవల చరిత్ర, వాటి ప్రాముఖ్యత, ప్రజల జీవితాల్లో వాటి ప్రభావం గురించి మనకు గర్వంగా గుర్తు చేస్తుంది. తపాలా బీమా అనేది భారతీయ తపాలా శాఖ ద్వారా అందించబడే బీమా సేవ, 1884లో ప్రారంభమైంది. ప్రపంచంలోనే మొట్టమొదటి తపాలా బీమా వ్యవస్థగా ఇది ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఇది ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించబడింది, కానీ క్రమంగా దీనిని అన్ని వర్గాల ప్రజలకు విస్తరించారు. తపాలా బీమా ద్వారా తక్కువ ప్రీమియంతో అధిక రక్షణ పొందడం సాధ్యమవుతుంది, ముఖ్యంగా గ్రామీణ మరియు మధ్యతరగతి వర్గాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారింది. 1884లో తపాలా బీమా సేవ , తొలుత ప్రభుత్వ ఉద్యోగుల కోసం మాత్రమే ప్రారంభించ బడింది. 1894లో గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకంగా గ్రామీణ తపాలా బీమా అందుబాటులోకి వచ్చింది. 1900ల తర్వాత: బీమా సేవలను మరింత విస్తరించి, వివిధ వర్గాల ప్రజలకు రాకను సులభతరం చేశారు. తపాలా బీమా ముఖ్య ఉద్దేశాలు...ప్రతి భారతీయుడికి బీమా రక్షణను అందించడం, గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు బీమా సేవలను చేరవేయడం, అన్ని ప్రాంతాల్లో బీమా సేవలను సమానంగా విస్తరించడం, ప్రజల ఆర్థిక భద్రత అవసరంపై అవగాహన పెంచడం. ఇతర ప్రైవేట్ బీమా సంస్థలతో పోలిస్తే తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ రక్షణ పొందవచ్చు. తపాలా కార్యాలయాలు దేశంలోని ప్రతి మూలకు విస్తరించి ఉండటంతో, తపాలా బీమా సేవలు అందరికీ సులభంగా అందుబాటులో ఉంటాయి. భారత తపాలా శాఖ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం వల్ల దీని పథకాలపై ప్రజలకు నమ్మకం ఎక్కువ. వ్యక్తిగత అవసరాలకు తగిన విధంగా అనేక రకాల పథకాలను అందించడం. భారతీయ తపాలా బీమా వివిధ రకాల పాలసీలను అందిస్తోంది, వాటిలో ముఖ్యమైనవి...ఎండోమెంట్ అస్యూరెన్స్ పాలసీ కాలపరిమితి ముగిసినప్పుడు లేదా పాలసీదారు మరణించినప్పుడు ఆర్థిక భద్రతను అందిస్తుంది. హోల్డ్ లైఫ్ అస్యూరెన్స్ జీవితాంతం రక్షణను అందిస్తూ, కుటుంబ భద్రతకు ఉపకరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన పథకం. పిల్లల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన పథకాలు. హోల్డ్ లైఫ్ పాలసీని ఎండోమెంట్ పాలసీగా మార్పు చేసే సౌలభ్యం కల్పిస్తుంది. తపాలా బీమా సేవల ప్రయోజనాలు... అతి తక్కువ వ్యయంతో వ్యక్తిగత జీవితానికి భద్రత, పట్టణ, గ్రామీణ ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చడంలో సమానత్వం. తపాలా కార్యాలయాల ద్వారా దేశవ్యాప్తంగా అందుబాటు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడడం వల్ల ఈ సేవలపై నమ్మకం పెరిగింది. తపాలా బీమా దినం ప్రాముఖ్యత... తపాలా బీమా సేవల ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియ జేయడం, ఇంకా ఎక్కువ ప్రజలను ఈ పథకాల వైపు ఆకర్షించడం. తపాలా బీమా సేవలతో ప్రజల ఆర్థిక భద్రతను బలపరచడం. భారత తపాలా బీమా భవిష్యత్తు లక్ష్యాలు...బీమా సేవలను సాంకేతిక పరిజ్ఞానంతో మరింత సమర్థంగా అందించడం, ఇంకా ఎక్కువ గ్రామీణ ప్రాంతాల్లో బీమా సేవలను అందుబాటులోకి తేవడం. వివిధ వర్గాల ప్రజల అవసరాలను తీర్చే విధంగా కొత్త పాలసీలను రూపొందించడం, నిరుపేద వర్గాలకు బీమా రక్షణ మరింతగా అందించడం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా

## - ఫిబ్రవరి 1... కల్పనా చావ్లా వర్ధంతి



కల్పనాచావ్లా... భారతదేశ గర్వించ దగ్గ వ్యోమగామి. ప్రపంచ వ్యాప్తం గాఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహిళ. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ, అంతేకాక ఇండో – అమెరికన్ మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా. పట్టుదల, కృషి, అంకితభావం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదని ఆమె నిరూపిం చారు. ఎందరో యువతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. కల్పనా చావ్లా, భారత దేశం లో హర్యానా లోని కర్నాల్ అనే ఊరులో సంప్రదాయ శాఖాహార ఒక పంజాబీ కుటుంబం లో మార్చి17, 1962 లో పుట్టారు. తండ్రి బనారసీ లాల్ చావ్లా. సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమా నాల బొమ్మలుంచేవాడు. అవి కల్ప నలో స్ఫూర్తిని రగిలించాయి. కల్ప నా చావ్లా ముందుగా, కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1982లో అమెరికాకు వలస వెళ్లారు. 1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ "ఏరోస్పేస్ ఇంజనీరిం గ్" లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్ లో ఉన్న టెక్సాస్ విశ్వ విద్యాలయం నుంచి 1984 లో పొందారు. 1986 లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో పిహెచ్డి ని బౌల్డర్ లో ఉన్న కోలోరాడో విశ్వ విద్యాలయం నుంచి పొందారు. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు మరియు విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్–పియర్ హారిసన్ ను వివాహం చేసు కున్నారు. భారత దేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి. టాటా యే తనకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ ను కెరీర్ గా తీసుకున్నానని చెపుతుండే వారు. లింగ వివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహా. చిన్న నాటి నుంచే ఆకాశంలో విహరిం చాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. 1988లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఏమ్స్ రిసెర్చ్ సెంటర్లో ఉద్యోగంలో చేరారు. ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటే షనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్–ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్–ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. 1991లో ఆమెకు అమెరికా పౌరసత్వం లభించింది. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. తన మొదటి స్పేస్ మిషన్‌లో భాగంగా కొలంబి యా ఋూ–87 అంతరిక్ష నౌకలో ప్రయాణించే టప్పుడు ఆమెఅప్పటి భారత ప్రధాని ఐకే గుజ్రాల్‌తో మాట్లాడారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి తీసిన హిమాల యాల ఫోటోలను గుజ్రాల్‌కు చూపించారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించారు. భారత మూలాలు ఉన్న కల్పన 40 ఏళ్ల వయసులో, 2003లో చని పోయారు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ ఆమె ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక భూమి వాతావరణం లోకి ప్రవేశిస్తు న్నప్పుడు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో కల్పనతో పాటు ఆమె తో కలిసి ప్రయాణిస్తున్న మరో ఆరుగురు సిబ్బంది కూడా మరణిం చారు. కొలంబియా అంతరిక్ష నౌక షెడ్యూల్ ల్యాండింగ్‌కు 16 నిమిషాల ముందు అమెరికాలోని టెక్సాస్ ప్రాంతంలో కూలిపోయింది. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కా రాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోం ది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అంద జేస్తుంది. కల్పన గౌరవార్థం దేశం లోని ఎన్నో విద్యాసంస్థలకు, అవార్డులకు ఆమె పేరు పెట్టారు. యువ మహిళా శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభు త్వం 2004లో కల్పనా చావ్లా అవార్డును ఏర్పాటు చేసింది. భార తీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి. కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగి, పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రాన్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బుకోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రేకారణం. "పరిస్థితులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకు పోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు. ఏదో ఒకటి చేయండి, కానీ దాన్ని మీరు మనఃస్ఫూర్తిగా చేయాలను కోవాలి. ఎందుకంటె ఏదైనా పనిని కేవలం ఒక లక్ష్యం కోసం చేయడం కాక,... దానిలో లీనమై అనుభవిం చాలి" అని యువతులకు సందేశం ఇచ్చేవారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# స్మగ్లింగ్ నిరోధంలో తీర రక్షణ దళం పాత్ర కీలకం

## ఫిబ్రవరి 1...భారతీయ తీర రక్షణ దళం అమలు దినం





1977 ఫిబ్రవరి 1వ తేదీ భారత తీర రక్షణ దళం ఉనికిలోకి వచ్చిన దినం. భారత తీర రక్షణ దళం... నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాల సహాకారంతో పని చేస్తుంది. 1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్టమ్స్ శాఖ వారికి... తీర గస్తీకి నౌక దళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పెట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికాదళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదించింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికాదళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971 లో, భారతదేశం లోని విస్తారమైన తీర ప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్ధవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది సంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది. 1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక మరియు చట్ట అమలు పనుల కోసం భారత నావికా దళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు. రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, దాని స్థాపనలో నేవీ సహాయాన్ని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అడ్మిరల్ కోహ్లీ సిఫారసుపై, రక్షణ కార్యదర్శి 1974 ఆగస్టు 31 న కేబినెట్ కార్యదర్శికి నోట్ సమర్పించారు. పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తొంజీ అధ్యక్షతన రుస్తొంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత మరియు చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికి భారత నావికాదళం, కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాలు, బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు మరియు రక్షణ సేవ యొక్క అవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31 జూలై 1975 న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పుపట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద ఉంచడానికి రుస్తొంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించు కున్నారు. 1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలు లోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు మరియు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి. కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణ దళం విధులు అధికారికంగా నిర్వచించ బడ్డాయి, దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978 న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి. ఎ. కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్ ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు, కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేర లేదు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978 న భారత పార్లమెంట్ యొక్క కోస్ట్ గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించ బడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీ చట్టం కలిగి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐ.సి.జి) ప్రపంచం లోని ఇతర కోస్ట్ గార్డ్‌తో కలిసి సమన్వయంతో పని చేస్తుంది. మే 2005 లో, పాకిస్తాన్ మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పిఎంఎస్ఎ) తో సంబంధాలు ఏర్పరచు కోవడానికి ఐసిజి అంగీకరించింది. 2006 లో, ఇండియన్ కోస్ట్ గార్డ్ తన జపనీస్, కొరియన్ సహచరులతో కలిసి కార్యకలాపాలు నిర్వహించింది. 2008 ముంబై దాడుల తరువాత, భారత ప్రభుత్వం ఐసిజి ఫోర్స్, ఆస్తులు, మౌలిక సదుపాయాలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ కోస్టల్ కమాండ్ తీర భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర మరియు రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయానికి బాధ్యత వహిస్తారు. కృత్రిమ ద్వీపాల రక్షణ, సముద్రంలో మత్స్యకారులు, నావికులకు రక్షణ, సహాయం, కాలుష్య నియంత్రణతో సహా సముద్ర పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, తీరం గురించి శాస్త్రీయ సమాచార సేకరణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలలో కస్టమ్స్ శాఖ, ఇతర అధికారులకు సహాయం, రక్షణ, ప్రాదేశిక మరియు అంతర్జాతీయ జలాల్లో చట్ట అమలు, తదితర కార్యమాలను నిర్వహిస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



# స్వయంగా పింఛన్లు అందజేసిన సీఎం చంద్రబాబు

కుప్పం : ఏపీ రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటిస్తూ పేదల సంక్షేమం పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా నేడు కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి మండలం బెగ్గిలి పల్లె గ్రామంలో జరిగిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్నతాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, అలాగే వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛనును ఆయన స్వయంగా అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను ఈ సందర్భంగా అడిగారు. అదే విధంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం స్వయంగా తమ గడప వద్దకు వచ్చి పింఛను అందించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆయన కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం కాకుండా, 5,555 ఈ–సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.

# అంబటి రాంబాబు వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గం: మంత్రి పార్థసారథి



అమరావతి: వైకాపా నేత అంబటి రాంబాబుపై మంత్రి పార్థసారథి, తెదేపా సీనియర్ నేత వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తండ్రిని ఉద్దేశించి అంబటి చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని పార్థసారథి విమర్శించారు. "అంబటి రాంబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి ఏర్పడింది. బేషరతుగా క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

**వారు కూడా ఛీకొడతారు: వర్ల...** అంబటి రాంబాబు చరిత్ర ప్రజలకు తెలుసని, సభ్య సమాజం సిగ్గుపడేలా చంద్రబాబు గురించి అంబటి మాట్లాడారని వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి అసభ్య వ్యాఖ్యలు చంద్రబాబు ఔన్నత్యాన్ని ఏమాత్రం తాకలేవని వర్ల అన్నారు. అంబటి మాటలు వింటే అతడికి సభ్యత, సంస్కారాలు లేవని అర్థమవుతుందని విమర్శించారు. అంబటి పదజాలాన్ని అతడి భార్యాబిడ్డలు కూడా ఛీకొడతారని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. భారతి గురించి మాట్లాడిన నేతను అరెస్ట్ చేయించి రిమాండ్‌కు పంపామని.. ఇప్పుడు అంబటిపై ఏం చర్యలు తీసుకుంటారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా రాజకీయ పార్టీనా? రౌడీల పార్టీనా? అసాంఘిక శక్తులకు అడ్డానా? అని వర్ల రామయ్య తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

చురకలు

## సంపాదకీయం

# గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్...

## ఆ మూడు రాష్ట్రాల్లో ఏమి జరుగుతుంది!

గత కొంతకాలంగా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో.. గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ అనే ఘటన లు తెరపైకి వస్తోన్న సంగతి తెలిసిందే. గతంలో తెలం గాణలో బీఆరెస్ ప్రభుత్వంలో ఈ సమస్య కనిపించినా.. తర్వాత కాస్త సద్దుమణిగింది! అయితే మరో మూడు దక్షిణా ది రాష్ట్రాల్లో మాత్రం ఇది రోజు రోజుకీ తీవ్రమవుతుందనే చర్చ మదలైంది. దీంతో.. ఈ వ్యవహారం రకరకాల అభిప్రా యాలు తెరపైకి వస్తున్నాయి. "రబ్బర్ స్టాంప్" అనే టాపిక్ మరోసారి చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. అవును... తమిళనాడు, కేరళ, తాజాగా కర్నాటక రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ అంశం తీవ్ర చర్చనీయాం శంగా మారింది. తమిళనాడులో గవర్నర్ ఆర్.ఎన్. రవి – సీఎం స్టాలిన్.. కేరళలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ – సిఎం పినరయి విజయన్.. తాజాగా కర్నాటకలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ – సీఎం సిద్ధరామయ్య వ్యవహారాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా రాజ్యాంగ సంక్షోభం టాపిక్ తెరపైకి వచ్చింది.

**తమిళనాడు గవర్నర్ వాకౌట్!:** ఇటీవల తమిళనాడులో ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి గవర్నర్ ఆర్.ఎన్. రవి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ప్లే చేయ కుండా అవమాన పరిచారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే అదే అసలు కారణం కాదని.. ప్రసంగంలోని కొన్ని పేరాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండటం తో.. వాటిని చదవడం ఇష్టం లేక వెళ్లిపోయారనే ప్రచార మూ జరిగింది. సంప్రదాయం ప్రకారమే రాష్ట్ర గీతాన్ని తొలుత ప్లే చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఏది ఏమైనా ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**మరో అడుగు ముందుకేసిన కేరళ గవర్నర్!:** ఈ సమయం లో.. కేరళ విషయానికొస్తే ఇది మరింత హీటెక్కించే విష యంగా మారింది. ఇందులో భాగంగా.. ప్రసంగంలోని కొన్ని పారాగ్రాఫ్ లను తనకు నచ్చినట్లు మార్చేశారు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. దీంతో.. అనూహ్య నిర్ణయం తీసుకున్న సీఎం పినరయి విజయన్.. క్యాబినెట్ ఆమోదిం చిన ప్రసంగాన్ని అసెంబ్లీ రికార్డ్ చేసేందుకు.. ప్రసంగ ప్రతులను స్వయంగా ఆయనే చదివి వినిపించారు. ఈ వ్యవహారం తాజాగా మరింత వేడెక్కిన పరిస్థితి. ఎందుకం టే... తన ప్రసంగానికి సంబంధించిన వీడియో ఫుటేజ్, తన ప్రకటన, సీఎం ప్రకటన ఆమోదానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ని షేర్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ ను గవర్నర్ లేఖలో కోరారు. అయితే... స్పీకర్ కార్యాలయం నుంచి ఎలాంటి రిప్లై రాలేదని తెలుస్తోంది. దీంతో.. ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.

**కర్నాటక గవర్నరూ తగ్గలేదు!:** తమిళనాడు, కేరళ గవర్నర్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య పరిస్థితి ఆ విధంగా ఉండగా.. కర్ణాటకలోనూ సేం సీన్ రిపీట్ అయ్యింది! ఇందులో భాగం గా... గతవారం జరిగిన అసెంబ్లీ జాయింట్ సెషన్ లో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి, సమావేశం నుంచి వెళ్లిపోయారు. తన ప్రసంగంలోని 11 పారాగ్రాఫ్ లను తీసేయాలంటూ తాను చేసిన డిమాండ్ ను కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ పట్టించుకోకపోవడమే అందుకు కారణమని చెబుతున్నారు!

**అసలు ఏమిటీ సమస్య..?:** రాష్ట్ర ఏదైనా, గవర్నర్ పేరు ఇంకేదైనా... మూడు రాష్ట్రాల్లోనీ ఈ తరహా పరిస్థితికి కారణం.. తమ తమ ప్రసంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడమే అని అంటున్నారు. ఇందుకు తాజా ప్రధాన అంశం... మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ) స్థానంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (రూరల్) (వీబీ – జీ రామ్ జీ) తీసుకురావడమే అని చెబుతున్నారు. ఈ అంశంపైనే తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వమైనా, కేరళలోని ఎల్.డీ.ఎఫ్. ప్రభుత్వమైనా, కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ అయినా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని చెబుతున్నారు. అయితే ఈ అభ్యంతరాలు, వ్యతిరేకత కేవలం ప్రాథమిక నిర్మాణంలో మార్పుల పైనే కాదని.. ఈ మార్పుల వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై అదనంగా ఆర్థిక భారం పడుతుందని చెబుతున్నారు. ఈ విషయంలోనే ఈ మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని అంటున్నారు.

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 (1) రాష్ట్రాల వెర్షన్!:** ఈ వరిణామాల నేపథ్యంలో రాజ్యాంగ నిపుణులు స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా.. ప్రసంగంలోని భాషను మార్చమని సూచించే హక్కు గవర్నర్ కు ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కర్ణాటక ప్రభుత్వం రెండు పారాగ్రాఫ్ లను సవరించిందని చెబుతున్నారు. అయితే.. ఒక పర్టిక్యులర్ విషయానికి సంబంధించిన మొత్తం పారాగ్రాఫ్ లనే తొలగించాలనే గవర్నర్ ల డిమాండ్ లను మాత్రం మూడు రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించాయని చెబుతున్నారు! ఈ నేపథ్యంలోనే... రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 (1)ను రాష్ట్రాలు ఉదహరిస్తున్నాయని తెలుస్తోంది. ఇందులో భాగంగా.. ఒకవేళ గవర్నర్ సూచనలతో ప్రభు త్వం ఏకీభవించకపోతే.. గవర్నర్ కు మరో దారి ఉ ండదని.. ఆయన తప్పనిసరిగా ప్రసంగాన్ని చదవాల్సిం దేనని.. మారో పరిష్కారం లేదని అంటున్నారు! మరోవైపు.. గవర్నర్ పదవి రాజకీయం కావడం చాలా కాలం క్రితమే మొదలైందని పలువురు అభిప్రాయపడుతున్నారు!

# తొలిమహిళా న్యూస్ రీడర్ ఆంధ్రా నైటింగేల్ మంగమ్మ - ఫిబ్రవరి 1...జోలెపాళ్యం మంగమ్మ వర్ధంతి



జోలెపాళ్యం మంగమ్మ. అలనాటి రేడియో శ్రోతలకు సుపరిచితమైన పేరు. నేడు ఆకాశవాణి ప్రపంచము లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. భారత ప్రభుత్వ సమాచార , ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యములో పని చేస్తుంది. రేడియో వార్తలు నిబద్ధతకు, విశ్వసనీయతకు తొలినాళ్ళ నుండి పేరు పొందాయి. సమాచార వ్యవస్థ పటిష్ఠంగా లేని రోజుల్లో రేడియో వార్తల కోసం జనం ఆసక్తిగా ఎదిరి చూసే వారు. ఒకప్పుడు రేడియో మాత్రమే ఒక సమాచార సాధనంగా ఉన్న పాతకాలపు మ రచి పోలేని రోజులలో, ప్రజలకు వార్తలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ప్రజలలో ఒకరిగా, అందరికీ ఆత్మీయులుగా వార్తా చదువరులు తమ తమ శైలులలో సుస్థిర స్థానం సంపాయించు కొన్నారు. ఆకాశవాణిలో వార్తా చదువరులుగా , ఎంతగానో ప్రాచుర్యం పొందిన వారిలో న్యూస్ రీడర్సుది ప్రధమ స్థానం. ఆ విధంగా తెలుగులో ఇటు ప్రాంతీయ కేంద్రాలైన విజయవాడ, హైద్రాబాదు నుండి వచ్చే ప్రాంతీయ వార్తలు, అటు హస్తిన నుండి వచ్చే జాతీయ వార్తలు ప్రజలకు కావలిసిన విశేషాలను నిర్ణీత సమయ సారిణి ప్రకారం తెలియ చెప్పేవి. ఆ రోజుల్లో ఢిల్లీ నుంచి తెలుగు వార్తలు చదివే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాణీ. ఎవరి స్టైల్ వారిదే. ప్రముఖ సినీ నటుడు కొంగర జగ్గయ్య,కపిల, కాశీపతి, శ్రీ వాత్సవ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, పన్యాల రంగనాధరావు, వనమాలి ప్రసాద్, జోలిపాళ మంగమ్మ, కందుకూరి సూర్యనారా యణ, తిరుమలశెట్టి ?శ్రీరాములు, అద్దంకి మన్నార్, వావిలాల రాజ్యలక్ష్మి, దుగ్గిరాల పూర్ణయ్య, ఏడిద గోపాలరావు వార్తలు చదవడంతో తెలుగువారి హృదయాలకు సన్నిహితులయ్యారు. ఇలా ఎందరో మహానుభావులు. ఎవరికి ఎవరు తీసిపోరు. వార్తలు మధ్య నుంచి విన్నా చదువు తున్నది పలానా అని చెప్ప గలిగేలా తమదయిన తరహాలో వార్తలు చదివే వాళ్ళు. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్ రీడర్గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగంలో దశాబ్ద కాలానికి పైగా సేవలందించిన మంగమ్మ తెలుగు రేడియో శ్రోతలకు చిర పరిచయస్థురాలు. "ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది జోలిపాళ్యం మంగమ్మ" అంటూ తెలుగు శ్రోతలకు వార్తలు వినిపించిన చిరపరిచిత స్వరం ఆమెది. జోలిపాళ్యం మంగమ్మతో పాటు , విభాగ అధిపతి దుగ్గిరాల పూర్ణయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మీ, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాలరావు, అద్దంకి మన్నార్ తదితరులు ఆమె సహచరులు. జోలెపాళ్యం మంగమ్మ తెలుగు రచయిత్రి, రేడియో వార్తా చదువరి. మంగమ్మ ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్గా ప్రసిద్ధురాలుగా పేరెన్నిక గన్నారు . ఆమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1925, సెప్టెంబరు 12న జన్మించారు. ఎం.ఎ., బి.ఎడ్ చదివారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈమెకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఎస్పరాంటో, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో 10 సంవత్సరాలు ఎడిటర్గా, న్యూస్ రీడర్గా విధులు నిర్వర్తించారు. 1962 నుండి నేషనల్ ఆర్కీవ్స్, ఢిల్లీలో పరిశోధనలు చేశారు. బోధనా రంగంలో సుమారు పాతిక సంవత్సరాల అనుభవం సంపాదించారు. ఈమె కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలు. ఇంకా ఈమె అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించారు. ఆమె ఇంగ్లీషు, తెలుగు భాషలలో పలు పుస్తకాలను రచించారు. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించారు. "ఆంధ్రానైటింగేల్" అనే బిరుదును పొందారు. తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు (1746–1856), ఆంధ్రదేశంలో క్రైస్తవ మిషనరీల సేవ, ఇండియన్ పార్లమెంట్, శ్రీ అరబిందో, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, అనిబీసెంట్ పుస్తకాలను ఆమె తెలుగులో వెలువరించారు. అలాగే ప్రింటింగ్ ఇండియా, అల్లూరి సీతా రామరాజు, లాస్ట్ పాలెగార్ ఎన్కౌంటర్ విత్ ది బ్రిటిష్ ఇన్ ది సీడెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1846–1847, ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి పుస్తకాలను ఆంగ్లంలో రచించారు. మదన పల్లెలోని తన స్వగృహంలో 2017, ఫిబ్రవరి 1వ తేదీన తన 92వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సాహితీ వట వృక్షం జువ్వాడి గౌతమరావు - ఫిబ్రవరి 1...జువ్వాడి గౌతమరావు జయంతి



ఆయన ఒక సాహితీ వట వృక్షం. స్వయంగా కవి మాత్రమే కాకుండా, ఎందరో సాహితీ వేత్తలకు ఆశ్రయ దాత. దివంగత ప్రధాని పీ.వి. నరసింహా రావు, కాళోజీ నారాయణరావు, కోవెల సుప్రసన్న, సంపత్ కుమార ఆచార్య, సామల సదాశివ లాంటి సాహితీ దురంధరులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నవారు. ప్రధానంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు గల అనుబంధం, విశ్వనాథను కరీంనగర్ రప్పించి, అక్కడి డిగ్రీ కళాశాల ప్రాచార్యునిగా విధులు నిర్వహించేలా చేసింది. తద్వారా ఉత్తర తెలంగాణకు చెందిన సాహితీవేత్తల సంగమానికి వేదికను ఏర్పరచి, సాహిత్య సుసంపన్నానికి కార్య క్షేత్రాన్ని సిద్ధం చేసింది. ఇలా కరీంనగర్ లో సాహితీ సౌరభాలు గుబాలించ డానికి అహరహం శ్రమించిన సాహితీ ప్రియుడు జువ్వాడి గౌతమరావు. గౌతమ రావు సాహితీ వేత్త నే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో యోధుడు. సోషలిస్టు భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఔరంగాబాద్ జైలు గోడలను ఛేదించుకొని వచ్చిన ధైర్యశాలి. పార్టీ పక్షాన 1977లో పోటీ చేసి ఓటమి చెందాడు. జువ్వాడి గౌతమరావు (ఫిబ్రవరి 1, 1929 – 2012) కరీంనగర్ మండలం ఇరుకుళ్ళ గ్రామంలో 1929, ఫిబ్రవరి 1 న జువ్వాడి గౌతమరావు జన్మించాడు. కరీంనగర్లో విద్యాభ్యాసం సాగించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్ఎల్బీ పట్టా పుచ్చుకున్నాడు. పీవీ నరసింహారావు, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య వంటి సాహితీ మిత్రులతో ఆయనకు చాలా సాన్నిహిత్యం ఉన్నది. కరీంనగర్ సాహిత్య చైతన్య కేంద్రంగా భాసిల్లడంలో గౌతంరావు పాత్ర అసామాన్యం, అద్వితీయం. కరీంనగర్లో తెనుగు ఉనికిని కాపాడుతూ, అనేక కవితా గోష్ఠులలో పాల్గొంటూ నిరంతర సాహిత్య సేవ చేసిన భాషాభిమాని జువ్వాడి. ఆధునిక కాలంలో అడుగంటి పోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటు పడ్డాడు. వరంగల్లో కాళోజీ, ఆదిలాబాదులో సామల సదాశివ మాదిరిగా కరీంనగర్లో జువ్వాడి గౌతంరావు సాహితీ వటవృక్షంగా వేలాది మంది సాహితీ కారులకు ఆశ్రయ మిచ్చాడు. ప్రగతి గామిగా ఉంటూనే విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి, విశ్వనాథకు భక్తుడిగా మారాడు. ప్రేమతో విశ్వనాథుని తన హృదయంలో దాచుకొన్నాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు జువ్వాడి అత్యంత ఆత్మీయుడు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యమైన కంఠంతో తమదైన శైలిలో అంతరార్థాలను విశదీకరిస్తూ రసికులకు వినిపించ గలిగి, అయన మూర్తి తత్వాన్ని ఆవిష్కరించాడు. తానే రచించాడా అన్నంతగా ప్రజల్లోకి రామాయణ కల్పవృక్షాన్ని తీసుకెళ్లాడు. జువ్వాడి ప్రోద్బలంతోనే విశ్వనాథ సత్య నారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్గా పని చేశారు. విశ్వనాథ 'భక్తియోగ' అనే పద్యకావ్య సంపుటిని జువ్వాడి కోసం రాసి అంకితం ఇచ్చారు. 'కల్పవృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' వంటి జువ్వాడి సాహిత్య వ్యాసాలు సాహిత్యలోకంలో సంచలనాలు సృష్టించాయి. నవ్య సాహిత్యోద్యమ కాలంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కొంతకాలం పాటు "జయంతి" అనే సాహిత్య పత్రిక నడిపాడు. తర్వాత దానికి జువ్వాడి సారథ్యం వహించాడు. వివిధ పత్రికల్లో జువ్వాడి రాసిన వ్యాసాలన్నింటినీ సంకలనం చేసి తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ వెలిచాల కొండలరావు 'సాహిత్య ధార' పేరుతో ఒక పుస్తకాన్ని ముద్రించాడు. జువ్వాడి సాహిత్య కృషికి గాని, సంపాదకత్వం వహించినప్పటి జయంతి పత్రికకు గాని రావాల్సిన కీర్తి ప్రతిష్ఠలు రాలేదు. అయినా జయంతి సంపాదకుడిగా ఆయన సంపాదకత్వం పత్రికా రంగానికే వన్నె తెచ్చింది. నాడు ఇంటర్ చివరి సంవత్సరం చదువుతున్న సి.నారాయణరెడ్డి తొలి కవిత అచ్చయింది ఆ పత్రికలోనే. జీవితమంతా సాహితీ అధ్యయనం తోను, విశ్వనాథ కల్పవృక్ష గానంతోను గడిపాడు. ఇటీవలే విశ్వనాథ ప్రత్యేక సంచికను సాహిత్యపీఠం ఆయనకు అంకితం చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అనంత మహిమాన్వితం మహామాఘి


నక్షత్ర మండల మార్గాన్ని అనుసరించి చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఆ మార్గంలో లెక్కలేనన్ని నక్షత్రాలు ఉ న్నాయి. సదరు మార్గాన్ని మన పూర్వీకులు ఇరవై ఏడు భాగాలుగా విభజించారు. అవి దాదాపు సమా నంగా ఉంటాయి. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క పేరు పెట్టారు. ఆ భాగంలో ఎక్కువ కాంతి వంతంగా ఉండే నక్షత్రాన్ని బట్టి ఆ భాగానికి పేరు పెట్టారు. ఇరవై ఏడు నక్షత్రాలలో మఘ ఒకటి. అందులో ఐదు ప్రముఖ నక్షత్రాలు పల్లకి ఆకా రంలో చెదరి ఉంటాయి. మాసానికి ఒక సారి చంద్రుడు ఆ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. కాని ఏడాదిలో ఒకేసారి చంద్రుడు పదహారు కళలతో ఒప్పుతూ మఘ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అదే మాఘ పూర్ణిమ. దానినే "మహామాఘి" అంటారు. చంద్రుడు కాంతి నిస్తంద్రుడై ప్రకాశించే దినాలు ఏడాదికి పన్నెండు ఉంటాయి. అవే పద హారు కళలతో ఒప్పుతూ చంద్రుడుండే రోజులు. పన్నెండు పౌర్ణమిలలో ఒక్కొక్క నక్షత్రంతో చంద్రుడు కూడి ఉంటాడు. ఆయా నక్షత్రాలను బట్టి ఆపౌర్ణమిని పిలుస్తారు. మాఘ నక్షత్ర యుక్త పూర్ణిమను మాఘీయని, అలాగే ఫాల్గుణీ, చైత్రీ, వైశాఖీ, జ్యేష్ఠీ, ఆషాడీ, శ్రావణీ, భాద్రపదీ, ఆశ్వ యుజీ, కార్తీకీ, మార్గశీర్షీ అనే పేర్లతో పిలువబడేవి హిందువులకు పన్నెండు పర్వాలు. భోగ్య అర్హమైన శుక్లపక్షం వెన్నెల ఊరికే పోకుండా మన పెద్దలు శుక్ల పక్షంలోనే పండువలు అధికంగా ఏర్పరి చారు. దశావతారాల్లో ఒకటైన కూర్మావతారం, మహా భక్తుడైన హన్మంతుడు, మానవ ప్రపంచంలో మహనీయుడైన గౌతమ బుద్ధుడు పౌర్ణమిల యందే జన్మించారు. ఇక మాఘ పూర్ణమి విషయానికి వస్తే...మఘ నక్షత్రంలో చంద్రుడు పదహారు కళలతో ప్రకాశించే దినమే మాఘ పౌర్ణమి. దీనిని మహామాఘి అని పంచాంగ కర్తలు అంటారు. పార్వతీ దేవి ఈదినముననే ప్రాదుర్భవించినదని పురాణాధారం. దక్షప్రజాపతికి దక్షిణావర్తపు శంభాకారపు పద్మ ఆకారాన్ని ధరించిన సతీదేవి హస్తస్పర్శతో కన్యగా మారిన రోజే మాఘ పౌర్ణిమ. కావేరీ ఉత్తరాన స్వామిమలపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి, తెలియని విషయాన్ని విద్యా వేత్తయైన తన తండ్రికి చెప్పిన దినమైనందున అక్కడ ఈరోజు ఉ త్సవం జరుగుతుంది. మాహామాఘి.నాడే జగద్గురువు ఆదిశంకరులు పంచాయతన పూజావిధిని ప్రారంభించారంటారు. మహా మాఘి అనబడే ఈ పర్వం పేరిటనే కుంభకోణంలో దాదాపు ఇరవై ఎకరాల వైశాల్యం కలిగిన ఒక కోనేరు ఉంది. తంజావూరు తెలుగు నాయక రాజులు ఆ కోనేటి చుట్టూ రాతి పావంచాలు, గట్టు చుట్టూ నలువైపులా పదహారు దేవళాలు కట్టించారు. అందులో విశ్వనాథ దేవాలయం ఒకటి. అది కోనేరు ఉత్తరాన ఉంది. ఆ ఆలయంలో శిలలపై గల శిల్పచిత్రాకృతులు ఉండగా, మాఘ పూర్ణిమ నాడు నవ నదులకు గొప్ప అర్చన జరు గుతుంది. మాఘపూర్ణిమ నాడు... కుంభకోణం లోని కోనేరులో గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, కావేరి, కృష్ణ కుమారి, పయోషిణి అనే నవ నదులు ప్రవేశిస్తాయని, అందుకే పౌర్ధిమ నాడు సదరు కోనేట్లో తైర్ధికులు స్నానాలాచరించడం పరిపాటి. మఘ నక్షత్రాధిపతియైన బృహ స్పతిని ఈనాడు పూజించాలని చెపుతారు. మాఘ పౌర్ణమి ద్వాపర యుగాది యని కొన్ని గ్రంథాలు చెపుతున్నాయి. ఈ పర్వదినం నాడు అరుణోదయ స్నానం, తిలపాత్ర కంచుక కంబళాది దానాలు చేయాలని, తిల హోమం, తిల దానం, తిలభక్షణం చేయాలని శాస్త్ర వచనం. అన్ని పౌర్ణమిల్లో కల్లా మహా మాఘి చాలా విశిష్టమైనది. మాఘ మాసంలో దేవతలు తమ సర్వ శక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. అందువల్ల మాఘ స్నానం చాలా గొప్పది. నది దగ్గరలో లేని వారు కనీసం చెరువులో గానీ, కొలనులోగానీ, లేక బావి దగ్గర గానీ స్నానం ఆచరించాలి. మాఘ



స్నానం ప్రవాహ జలంలో చేస్తే అధిక ఫలితం. స్నానానంతరం సమస్త జీవరాశికి ఆధారమైన సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దాన ధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేష ఫలం లభిస్తుంది. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతోన్న పాపాలు, దోషాలు నశించి, అశ్వమేథ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని సాక్షాత్తు శ్రీ కృష్ణుడే ధర్మరాజులు వివరించినట్లు పురాణ కథనం. మాఘ పౌర్ణమి రోజున చేసే స్నానం, పూజలు, దానాలు వల్ల వ్యాధులు, చికాకుల నుంచి విముక్తి కలుగుతుంది. ఆ పుణ్య ఫలాల విశేషం కారణంగా ఉన్నత జీవితం లభిస్తుంది. మరణం అనంతరం కోరుకునే శాశ్వత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు" అనే శ్లోకం పఠిస్తూ స్నానం ఆచరించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పిలిస్తే పలికే దేవుడు...హంసల దీవి శ్రీ వేణుగోపాలుడు - మాఘ పూర్ణిమ... హంసల దీవి శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం





ఆంధ్ర ప్రదేశ్ లోని కృష్ణా జిల్లా హంసల దీవిలో వెలసిన శ్రీవేణు గోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా మాఘ శుద్ధ నవమి నుండి బహుళ పాడ్యమి వరకూ నిర్వహిస్తారు. అందులో భాగంగా స్వామివారి కళ్యాణోత్సవం మాఘ పూర్ణిమ రోజున ఘనంగా నిర్వహిస్తారు. కృష్ణానది సముద్రంలో కలిసే పవిత్ర సంగమ ప్రదేశం హంసల దీవి. దాదాపు వెయ్యేళ్ల క్రితం నిర్మించిన కృష్ణా జిల్లా కోడూరు మండలం హంసల దీవి గ్రామంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి నిత్య పూజలందుకుంటు, భక్తులను అనుగ్రహిస్తున్న వేణు గోపాల స్వామి దేవాలయం ప్రత్యేకతను సంతరించుకుంది. వేణుగోపాల స్వామికి నెలవై, పవిత్రమైన పుణ్య క్షేత్రంగా, పవిత్ర స్థలంగా భావించ బడుతున్న ఆలయాన్ని దగ్గరలో ఉన్న సాగరంలో కృష్ణా నది క్షేత్రంలో స్నానం ఆచరించి న అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించు కుంటారు. హంసల దీవికి సంబంధించి ఓ పురాణ కథనం ప్రచారంలో ఉంది. పాపులకు సంబంధిం చిన పాపాలను ప్రక్షాళన చేస్తున్న కారణంగా గంగానది మలినమై పోయి, తన దుస్థితిని శ్రీహరికి విన్నవించు కోగా, విష్ణుమూర్తి గంగాదేవిని కాకి రూపంలో సకల పుణ్య తీర్థాలలో స్నానమాచరించ మనీ, ఏ క్షేత్రంలో తను హంసగా మారుతుందో అది మహోన్నతమైన దివ్యక్షేత్రమై అలరారుతుందని, హంసగా మారాక తిరిగి ఎప్పటిలానే పవిత్రతతో ప్రవహించమని వైకుంఠ నాథుడు చెప్పినట్లు పురాణ కథనం. సకల పుణ్య తీరాలలో స్నానం చేస్తూ వెళుతున్న కాకి కృష్ణవేణి సాగర సంగమం చేసే ప్రదేశంలో మునిగి లేవగానే హంసగా మారి పోయింది. అందుకే ఇది హంసల దీవిగా పేరుపొందిం దని స్థలపురాణం ద్వారా తెలుస్తోంది. అద్భుత శిల్పకళకు అద్దం పడుతున్న వేణు గోపాలస్వామి ఆలయాన్ని సముద్రపు ఆటు పోట్లు తట్టుకునే విధంగా నిర్మించారు. శ్రీవేణు గోపాల స్వామి ఆలయాన్ని దేవతలు నిర్మించారని స్థల పురాణం ఆధారం. ఒక్క రాత్రిలోనే నిర్మాణం పూర్తిచేసే సంకల్పం తో, నిర్మాణం చేపట్టి గోపురం నిర్మిస్తుండగా తెల్ల వారడం వలన దేవతలు వెళ్లి పోయా రని, అందుకే గాలిగోపురం కాలేదని చెపుతారు. తరువాత ఇక్కడ అయిదు అంతస్తుల గాలి గోపురం నిర్మించారు. పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే 1977లో అది ప్రారంభించ బడింది. శ్రీవేణుగోపాలస్వామి ఆలయం మౌర్య చక్రవర్తుల పాలనా కాలంలో నిర్మాణం పూర్తయి ఉండవచ్చని చరిత్రకారుల భావన. ఆలయ ముఖ మండప స్తంభాల మీద అనేక శాసనాలు ఉన్నాయి. ఇక్కడ మాఘ పౌర్ణమి నాడు ప్రత్యేకమైన పూజలు, మహోత్సవాలు, అన్నదా న కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఆలయంలోని శ్రీవేణు గోపాల స్వామి పిలిస్తే పలుకు తాడని భక్తులు విశ్వసిస్తారు. కాకర పర్తి గ్రామంలో బయటపడిన శ్రీవేణుగోపాల స్వామిని హంసల దీవికి తెచ్చి ప్రతిష్ఠించారు. అయితే ప్రపంచంలో ఎక్కడా కనిపించని విధంగా ఈ విగ్రహం నీలమేఘ ఛాయలో ఉ ండడం విశేషం. దేవాలయ కుడ్యాలపై అందంగా చెక్కిన రామాయణ సంబంధ ఘట్టాలు భక్తులను ఆకట్టు కుంటాయి. కళ్యాణోత్సవం ముందు రోజు ఉదయం స్వామి వారిని శాస్త్రోక్త పద్ధతిలో పెళ్ళి కుమారుని చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెల్ల వారి ఉదయం శ్రీ రాజ్యలక్ష్మి అమ్మ వారికి కుంకుమ పూజను, రాత్రికి స్వామి వారి కళ్యాణం నిర్వ హిస్తారు. పౌర్ణమినాడు రథోత్సవం మరునాడు చక్రస్నానం ఆదిగా సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సామాజిక బాధ్యత.. అబివృద్ధికి బాసట

భద్రాచలం : కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ శాఖలకు సహకారం అందించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. మన్యంలోని విద్య, వైద్య విభాగాలకు ప్రాధాన్యం కల్పించేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గిరిజన సంక్షేమం, అభ్యున్నతికి చేయూత లభించనుందని భావిస్తున్నారు. 20 సంస్థల ప్రతినిధులతో ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఇటీవల నిర్వహించిన సమావేశం విజయవంతమైంది. సంస్థల నిర్వాహకులు హాజరై తాము సైతం సమాజాభివృద్ధిలో భాగమవుతామని హామీ ఇచ్చారు. మన్యంలోని పరిస్థితులను ఐటీడీఏ పీఓ రాహుల్ విశ్లేషించారు.

**ముఖ్యమైన ప్రతిపాదనలు**

మహిళాశిశు అభివృద్ధికి రూ.12.97 కోట్లు, వైద్యారోగ్యశాఖకు రూ.24.03 కోట్లు, విద్యాశాఖకు సుమారు రూ.70 కోట్లు, వ్యవసాయం-ఉద్యానవన శాఖలకు రూ.37.78లక్షలు, పశు సంపదకు రూ.19.60 లక్షలు, జీవనోపాధికి రూ.7.52కోట్లు, నీటి పారుదల రంగానికి రూ.6.80 లక్షలు, క్రీడలకు రూ.90 లక్షలు, పారిశుద్ధ్యానికి రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ఈ నిధులు సీఎస్ఆర్ ద్వారా మంజూరైతే ప్రధాన శాఖలకు కళ రానుంది.

**పర్యాటక సొబగులు.. పరిశ్రమలు..**

సీఎస్ఆర్ సమావేశంలో భద్రాచలం పుణ్యక్షేత్రానికి ప్రాధాన్యం కల్పించారు. పర్ణశాల ఆలయ చరిత్రను ప్రత్యేక పుస్తకంలో పొందుపర్చారు. ఏరు మహోత్సవం గురించి వివరించారు. దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కిన్నెరసాని, పాల్వంచ, చంద్రుగొండ మండలంలోని కనకగిరి గుట్టల చిత్రాలను



ముద్రించారు. ఐటీసీ పీఎస్‌పీడీ, సింగరేణి, బీటీపీఎస్, కేటీపీఎస్, భారజల ప్లాంట్, నవభారత్ వంటి సంస్థల ప్రాథమిక సమాచారాన్ని అందుబాటులో ఉంచారు.

**జిల్లా స్వరూపం ఇలా..**


భౌగోళిక విస్తీర్ణం: 7,483 చ.కి.మీ.
అటవీ విస్తీర్ణం: 4,101 చ.కి.మీ.
అటవీ విస్తీర్ణ శాతం: 54
మొత్తం జనాభా: 10.69 లక్షలు
రిజన జనాభా: 3.92 లక్షలు
అక్షరాస్యత శాతం: 66
సగటు వర్షపాతం: 1,199.5 మి.మీ,
వాస్తవ వర్షపాతం: 1,351.4 మి.మీ

# జల విహారం.. ప్రతిపాదనలకే పరిమితం

ముథోల్ : బాసరకొచ్చే పర్యాటకులను ఆకట్టుకునే ఎస్సారెస్పీ బాసర బోటు విహారం ప్రతిపాదన దశలోనే నిలిచిపోయింది. రానున్న పుష్కరాల సందర్భంగా నిధులు మంజూరైతే గోదావరి పరీవాహక ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారనున్నాయి. ఈ సారి ప్రభుత్వం బాసర నుంచి భద్రాచలం వరకు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించింది. ఇందులో అభివృద్ధి జరిగేనా అన్నది వేచి చూడాలి. బాసర నుంచి ఎస్సారెస్పీ వరకు బోటు నడపాలనే యోచన చాలాకాలంగా ఉంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం శంకుస్థాపనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం అంశాన్ని ప్రస్తావించారు. పథకం పూర్తయితే కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీ నిండాక బాసర -ఎస్సారెస్పీ మధ్య పడవలో వెళ్లవచ్చని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో సాగునీటి, పర్యాటకశాఖ అధికారులు బోటింగ్‌పై దృష్టి సారించారు. 2019లో ప్రయోగాత్మకంగా నడిపారు. త్వరలో సర్వీసులు ప్రారంభిస్తామని పర్యాటక శాఖ పేర్కొన్నా ఆ దిశగా కార్యాచరణకు నోచుకోలేదు.

**భక్తులకు ఆహ్లాదం**

ఆహ్లాదం, మధురానుభూతిని కలిగించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు సాకారమైతే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎస్సారెస్పీకి చేరుకొని అక్కడి నుంచి బాసరకు, బాసర నుంచి తిరిగి



శ్రీరామసాగర్‌కు పడవల ద్వారా ప్రయాణించే అవకాశం లభిస్తుంది. ఎస్సారెస్పీని ఆనుకుని ఉన్న నిజామాబాద్ జిల్లాలోని బస్వాపూర్, నాగాపూర్ గ్రామాల దగ్గర బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి బాసర వరకు పడవలను నడపాలని గతంలో అధికారులు నిర్ణయించారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

**అనుకూలతలు అనేకం**

పర్యాటకశాఖ చొరవ చూపి గోదావరిలో బోటు ప్రయాణాలను ప్రారంభిస్తే ఇరువైపులా రెండున్నర గంటల వ్యవధిలో గమ్యం చేరుకోవచ్చు. సుమారు 60 కిలోమీటర్ల మేర ఈ ప్రయాణం సాగుతుంది. మధ్యలో బ్రహ్మేశ్వరం, నిజామాబాద్ జిల్లాలోని ఉమ్మెడ, తుంగేన, తదితర పర్యాటక ప్రాంతాల వద్ద బోట్లు నిలిపినా మూడు గంటల్లో బాసరకు చేరుకోవచ్చు. వేసవి మినహా 8 నెలల పాటు పడవలను నడుపుకోవచ్చు.

# నాడు 12 ఆవులు.. నేడు 170 గేదెలు



సారంగాపూర్ : వ్యవసాయం చేయడానికి యువత వెనుకాడుతున్న ఈ రోజుల్లో పాడి పరిశ్రమతో లాభాల బాటలో నడుస్తున్నారా సోదరులు. మొదట్లో నష్టాలు వచ్చినా కుంగిపోకుండా పట్టుదలతో శ్రమించి అభివృద్ధి చేసుకున్నారు సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన అయిలేని రాజేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి. 16 ఏళ్లుగా పాడిని నమ్ముకోవడంతో 12 ఆవులతో మొదలైన వారి ప్రస్థానం నేడు 170 గేదెలకు చేరింది. తాము పని చేస్తూనే మరో 20 మందికి పైగా ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**అలుపెరగని కష్టంతో..**

2009లో గ్రామంలో ఒకరిద్దరు ఆవులు పెంచడం చూసిన సోదరులు తామెందుకు ఈ రంగంలోకి అడుగుపెట్టవద్దని ఆలోచించారు. రూ.80 వేలకు ఒకటి చొప్పున 12 ఆవులు కొనుగోలు చేశారు. ప్రత్యేకంగా రూ.5 లక్షలతో షెడ్డు వేశారు. ఆవు పాలతో ఆదాయం అంతగా రాకపోవడంతో వాటిని విక్రయించి రాజేందర్‌రెడ్డి ఉపాధి కోసం పరాయి దేశం వెళ్లారు. పాడి పరిశ్రమపై ఆసక్తి తరగని శ్రీధర్‌రెడ్డి 2011లో 40 గేదెలను కొనుగోలు చేసి డెయిరీ ప్రారంభించారు. పాలను నేరుగా జగిత్యాల పట్టణానికి తీసుకెళ్లి విక్రయించడం ప్రారంభించారు. కొన్ని గేదెలున్నా పూర్తి సమయం కేటాయించాల్సి వస్తుందని మరిన్నింటిని కొనుగోలు చేయడం ద్వారా ఆదాయం రెట్టింపు చేసుకోవచ్చని భావించారు. శ్రీధర్‌రెడ్డి తన ఆలోచనను సోదరుడితో పంచుకోవడంతో రాజేందర్‌రెడ్డి స్వగ్రామానికి చేరుకున్నారు. ఇద్దరూ కలిసి 2018లో రూ.40 లక్షలతో ప్రత్యేకంగా రెండు షెడ్లు నిర్మించి 170 గేదెలు కొనుగోలు చేశారు. సోదరులిద్దరూ నిత్యం డెయిరీ ఫాంలోనే ఉంటూ పని చేయడంతో ఆదాయం పెరిగింది.

**ప్రతి రోజూ 600 లీటర్ల విక్రయం**

పాలను ఇతర డెయిరీల్లో విక్రయిస్తే ఆదాయం అంతగా రాదని జగిత్యాల పట్టణలోని మూడు ప్రాంతాల్లో పాలు, పెరుగు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిత్యం 600 లీటర్ల నాణ్యమైన పాలను ఉదయం, సాయంత్రం లీటరుకు రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ రూ.42 వేల చొప్పున నెలకు దాదాపు రూ.13 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇందులో 20 మంది కూలీలు, దాణా, ఇతర ఖర్చులు రూ.10.50 లక్షలు ఖర్చు పోగా రూ.2 లక్షలకు పైగా రాబడి వస్తోంది. ఈ సోదరులు తమకున్న భూములతో పాటు మరో 20 ఎకరాలు లీజుకు తీసుకొని సాగులోనూ రాణిస్తున్నారు. ఏ రంగంలోనైనా నష్టాలు ఉంటాయని, కష్టపడి పని చేస్తే లాభాలు పొందవచ్చని చెబుతున్నారు.

# పట్టణ రోడ్లు.. నడ్డి విరుస్తున్నాయ్



సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పరిధిలోని పలు రహదారులు గుంతలమయం అయ్యాయి. దీనికితోడు మిషన్ భగీరథ పైప్‌లైన్, కేబుల్ వైర్ల తవ్వకాలతో ఏర్పడిన గుంతలతో పట్టణ ప్రజల గుండెల్లో వణుకు పుట్టిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో రహదారులు తవ్వారు. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు కాకుండా వార్డుల్లో వేసిన సీసీ, బీటీ రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఇలా చాలాచోట్ల గుంతలను అలాగే వదిలేశారు.

**ప్రధానంగా ఎక్కడెక్కడంటే..**

పట్టణంలోని గాంధీనగర్ కూరగాయాల మార్కెట్ లోపలికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంతలు పడి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో.. రైతులు, వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


**కేబుల్ తీగల కోసం..**

పలు టెలికాం సంస్థలు ప్రభుత్వ అనుమతులు తీసుకొని రహదారులను ఇష్టానుసారంగా తవ్వి కేబుల్ తీగలు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎంత జాగ్రత్తగా ప్రయాణించినా కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడక తప్పడంలేదు. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పెద్దబజార్ నుంచి విమల్ థియేటర్‌కు వెళ్లే రోడ్డు ఏళ్లుగా గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళ గుంతలు కనిపించపోవడంతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులకు గాయాలవుతున్నాయి. బాగు చేయాలని పలుసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు.

కోనరావుపేట ప్రధాన చౌరస్తా వద్ద, అంబేద్కర్ కూడలి నుంచి కొత్త బస్టాండ్ ప్రధాన రహదారికి ఇరువైపులా, గీతానగర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఎల్లమ్మ కూడలి వరకు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఆసుపత్రికి వెళ్లాల్సిందే అనేలా ఉన్నాయి.

# కుంగిపోకు.. ఒక్క క్షణం ఆగి చూడు



ధర్మపురి : యువత, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నా యి. చిన్న వయసులోనే భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోతుండటం కలవరపెట్టే అంశమని మానసిక నిపుణులు చెబుతున్నారు.

**పరిధికి మించి ఆలోచనలు**

ఉమ్మడి జిల్లాలో ఏదో ఒకచోట ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తామేం అడిగినా తల్లిదండ్రులు వద్దనరనే భావన పిల్లల్లో పెరుగుతోంది. మరోవైపు విద్యార్థులపై సామాజిక మాధ్యమాలు ప్రభావం చూపుతున్నాయి. మార్కెట్లోకి కొత్తగా వచ్చే వస్తువులు, ద్విచక్ర వాహనాలపై మోజు పెంచుకుంటున్నారు. ఖరీదైన వస్తువులు కొనివ్వాలని కోరినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఉన్న తల్లిదండ్రులు ససేమిరా అంటున్నారు. తాహతుకు మించిన ఆలోచనలు చేయడం, అవి తీరకపోతే క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు.

**చదువులో ఒత్తిడి**

కొన్నిసార్లు చదువులో ఒత్తిడి, విద్యార్థుల తల్లిదండ్రులు రూ.లక్షల ఫీజులు చెల్లించి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిపిస్తే ఆశించిన మేర మార్కులు సాధించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు లోనవుతున్నారు. కొందరు తల్లిదండ్రులతో ఎక్కువ సమయం గడపకపోవడమూ ఒత్తిడికి కారణమవుతోంది. దీంతో తమను ఎవరూ పట్టించుకోవడం లేదనే భావన వారిలో పెరుగుతోంది.

**ఇటీవలి కొన్ని ఘటనలు..**

జగిత్యాలలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన యువకుడు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం కొనివ్వలేదని క్షణికావేశంలో ఉరి వేసుకున్నారు.

ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని తనను జాతర వెళ్లేందుకు అనుమతివ్వలేదని ఆత్మహత్య చేసుకున్నారు.

ఆరెపల్లిలో తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల డిగ్రీ విద్యార్థి తనువు చాలించారు.

పాఠశాల స్థాయిలోనే చైతన్యం కలిగించాలి

సెకండరీ పాఠశాల విద్యకు చేరిన నాటినుంచే పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని తల్లిదండ్రులు కలిగించాలి. భావోద్వేగాల నియంత్రణపై ఎప్పటికప్పుడు దృష్టి నిలిపేలా చొరవ తీసుకోవాలి. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించాలి.డా.సాకేత్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణులు

ఉమ్మడి జిల్లాలో యువత ఆత్మహత్యలు
2022: 18
2023: 14
2024: 12
2025: 16

# చలికాలం.. దోమలతో సమరం

ఖమ్మం : జనవరిలో చలి ఉన్నా.. దోమల జోరు తగ్గకపోవటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. నిరంతరం కాళ్లు ఆడిస్తూ ఉండటం.. చేతులతో గాలిని కొట్టుకోవటం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంట్లో కూర్చున్నా, హాయిగా గాలి పీల్చుకుందామని బయటికి వచ్చినా దోమల భయంతో వెనక్కి పరుగులు తీయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. శబ్దంతో పాటు కుట్టినప్పుడు వచ్చే దురదతో చికాకు, మానసిక అశాంతి పెరుగుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాటి తాకిడి ఎక్కువగా ఉండటం సహజం. ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతమూ వాటి ఉద్ధృతి తగ్గకపోగా మరింత పెరిగింది. పార్కులు, బహిరంగ ప్రదేశాలు, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ప్రకృతిని ఆస్వాదించడం కంటే దోమలతో యుద్ధం చేయటానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. మురుగు కాల్వల్లో అపరిశుభ్రత, పగటిపూట ఎండ, రాత్రిపూట చలి వంటివి.. దోమల గుడ్లు పొదగడానికి అనుకూల వాతావరణాన్ని కలిస్తున్నాయి.

మురుగుకాల్వల్లో పూడిక తీయకపోవటం వల్ల నీటి నిల్వలతో క్యూలెక్స్ వంటి దోమలు విజృంభిస్తున్నాయి. దోమల రకాన్ని బట్టి అవి కుట్టే సమయాలు మారుతుంటాయి. డెంగీ కారక ఈడిస్ ఈజిప్టి దోమలు సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి ముందు కుడతాయి. క్యూలెక్స్, అనాఫిలిస్ దోమలు చీకటి పడినప్పటి నుంచి రాత్రంతా చురుగ్గా ఉ



ంటాయి. మున్సిపాలిటీలు, పంచాయతీలు దోమల నివారణపై శ్రద్ధ చూపటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగు కాల్వల్లో నీరు నిలవకుండా పూడిక తీయించాలి. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి. నీటి నిల్వలు ఉన్నచోట దోమల గుడ్లను నిర్మూలించే మందులను చల్లాలి. క్షేత్రస్థాయిలో ఇవేమీ కొనసాగటం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. నివారణ అనేది ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సామూహిక ప్రయత్నం అనే విషయాన్ని గుర్తించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రక్తం పోటెత్తుతోంది.. క్యాన్సర్ కలవరపెడుతోంది!

మంచిర్యాల : రక్తం పోటెత్తుతోంది. మధుమేహం పెరిగిపోతోంది. క్యాన్సర్ కంగారు పడేలా చేస్తోంది. జిల్లాను ఈ దీర్ఘకాలిక వ్యాధులు భయపెడుతున్నాయి. అయిదేళ్ల నుంచి బాధితుల సంఖ్య బాగా పెరుగుతోంది. జిల్లా ప్రధాన ఆసుపత్రి అయిన జీజీహెచ్‌లోనే ఏటా వీరిసంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. వయసుతో సంబంధం లేకుండా ఇబ్బంది పడుతున్నారు.

**తరచూ పరీక్షించుకోవాలి**

ఆహార అలవాట్లు, ఎలాంటి వ్యాయామం చేయకపోవడం ఈ దీర్ఘకాలిక వ్యాధులు వచ్చేందుకు ఒక కారణమైతే పనిభారం, ఒత్తిడికి గురికావడం ప్రస్తుత పరిస్థితిలో ప్రధానంగా మారింది. పాతికేళ్ల వయసుకు రాగానే



తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. అలసట, అస్వస్థత, తలతిప్పటం తదితర కారణాలు ఉంటే వెంటనే రక్తపోటు పరిస్థితిని తెలుసుకోవాలి. వైద్యుడి సూచన మేరకు మాత్రలు వేసుకోవడం అలవాటు చేసుకోవాలి. కనీసం ఆరునెలలకు ఒకసారైనా మధుమేహం పరీక్ష చేయించుకోవాలి. మాత్రలతో పాటు నిత్యం వ్యాయామం చేయాలి. కనీసం గంటపాటైనా నడక, యోగా, ధ్యానం చేయాలి. డా.అభినవ్, సహాయ ఆచార్యుడు(జనరల్ మెడిసిన్)

# క్షేత్ర పర్యటనలు.. పథకాల పరిశీలనలు

మంచిర్యాల : వారంతా అఖిల భారత ఇంజినీరింగ్ సర్వీసెస్ శిక్షణ అధికారులు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన యూపీఎస్సీ ఉద్యోగులు.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎంఎల్ఆర్‌హెచ్‌డీలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం అందుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటిస్తున్నారు. ఈ నెల 24న నిఖిల్ శ్రీవాస్తవ, ఉత్కర్ష్ శ్రీవాస్తవ, ఆకాష్ తన్వర్, అంకిత్ ఆనంద్, ఖుషిరాంలతో కూడిన బృందం జిల్లాకు చేరుకుంది. వారికి నజ్రుల్‌నగర్‌లో స్థానిక అధికారులు వసతి సౌకర్యం కల్పించారు. ఈ బృందం నిత్యం వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఉపాధి హామీ పనులు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వయం సహాయక సంఘాల పనితీరును పరిశీలిస్తూ నివేదికలు రూపొందిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం, నజ్రూల్‌నగర్ పంచాయతీలలో పర్యటించగా, సిర్పూర్(టి) మండలంలో పరిశీలిస్తున్నారు. పర్యటనలో గుర్తించిన అంశాలను నివేదక రూపొందించి శిక్షణ పొందుతున్న సంస్థకు అందజేయనున్నారు. తొలుత నివేదికపై జిల్లా కలెక్టర్‌కు సూచించి ఆయా పనుల తీరుతెన్నులపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఐఈఎస్ అధికారులు తమ అనుభవాలనుతో పంచుకున్నారు.

ప్రజల్లో అవగాహన కొరవడింది – నిఖిల్ శ్రీవాస్తవ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడేలా రూపొందించారు. కానీ క్షేత్ర స్థాయిలో అర్హులు అవగాహన లేమితో పూర్తి స్థాయిలో పొందలేకపోతున్నారు. ప్రధానంగా సంక్షేమ పథకాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించాం. పథకాల అమలు తీరుపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. తమకు తెలిసిన మేరకు అర్హులు పొందుతుండగా అమాయకులకు మాత్రం అందడం లేదు.

ఇదో మంచి అనుభవం – ఉత్కర్ష్ శ్రీవాస్తవ

పట్టణాలకే పరిమితమైన తాము ఈ శిక్షణతో గ్రామీణ సమాజంపై ఎంతో అవగాహన పొందాం. ఇంకా ఎంతో మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలే అత్యధికంగా ఉన్నాయి. వాస్తవ పేదలకు కొన్ని పథకాలు అందడంలేదని పరిశీలనలో దృష్టికి వచ్చింది. సంక్షేమ పథకాల్లో కొన్నిచోట్ల పారదర్శకత కనిపించడం లేదు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాల అమలులో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనర్హులకు అందకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# వీధికుక్కల కట్టడికే.. ఓటర్ల మద్దతు

సూర్యాపేట: ఫిబ్రవరి 11న జరిగే పుర ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్, కార్పొరేటర్ పదవులకు బరిలో దిగుతున్న అభ్యర్థులెవరైనా సరే..తమ వార్డుల్లో, బస్తీల్లో నెలకొన్న తీవ్రమైన సమస్యలను పరిష్కరిస్తామన్న వారికే మద్దతు ఇస్తామని.. స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కల బెడదను నియంత్రించి, ప్రజలకు భద్రత కల్పించే వారినే ఎన్నుకుంటామని మున్సిపల్ ఓటర్లు చెబుతున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎన్నికలు జరిగే నల్గొండ నగరపాలక సంస్థతో పాటు 17 మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లో పర్యటించింది. ప్రధానంగా జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను తిరగనివ్వొద్దని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు..తీవ్రమైన ఈ సమస్యను ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల దృష్టికి తీసుకెళ్లాలనుకుంటున్నారా.. అంటూ ఓటర్లతో మాట్లాడగా పలువురు తమ ఇబ్బందులను వివరించారు.

ఉమ్మడి జిల్లాలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. అధికారుల లెక్కల ప్రకారం అత్యధికంగా నల్గొండ పట్టణంలో 9,706, సూర్యాపేటలో 1,200 చొప్పున వీధి కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సంఖ్య ఎక్కువగా ఉండొచ్చు. గుంపులుగా తిరుగుతుండటంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఉదయం నడకకు వెళ్లాలన్నా, పిల్లలను బడికి పంపాలన్నా వణుకుపుడుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల కుక్కల దాడుల్లో గాయపడిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళ ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వెంటపడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నల్గొండ, సూర్యాపేట, భువనగిరి పట్టణాల్లో రూ.లక్షల వెచ్చించి యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కేంద్రాలు నిర్మించారు. మిగిలిన పురపాలికల్లో లేవు. మిర్యాలగూడలో స్థలం కేటాయించిన అధికారులు నేటికీ నిర్మాణం చేపట్టలేదు. ఉన్నవాటిలో కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఏబీసీ శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలకు ఏటా కేటాయిస్తున్న రూ.లక్షల బడ్జెట్ పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా శునకాల సంతతి పెరిగిపోయి..వాటి బెడద మరింత తీవ్రమవుతోందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వీధి కుక్కల బెడద తీవ్రమైందని.. ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దతు కోరేందుకు అభ్యర్థులు తమ ఇంటికి వచ్చినప్పుడు ముందుగా ఈ సమస్యనే వారి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ఎక్కువ మంది చెప్పుకొచ్చారు.

ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రజలు (2011 జనాభా లెక్కల ప్రకారం): 6,62,507 వీధి కుక్కలు (అధికారుల లెక్కల ప్రకారం సుమారు): 30,000

# చేయాల్సింది నలుగురు.. చేస్తోంది ఒక్కరే

ఆలేరు : వీబీ జీరామ్‌జీ (ఉపాధిహామీ) పథకంలో క్షేత్ర సహాయకులపై పనిభారం బాగా పెరిగింది. నూతన విధానాల అమలు, మారుతున్న పరిస్థితుల కారణం కాగా, కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో క్షేత్రసహాయకుల నియామకం లేకపోవడం మరో కారణం. ప్రతి గ్రామ పంచాయతీని యూనిట్‌గా తీసుకుని ఉపాధి పనిని గుర్తించాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున క్షేత్రసహాయకులు ఉండాల్సిన పరిస్థితి అనివార్యంగా మారింది. దీనికి తోడు నూతన గ్రామ పంచాయతీల్లోనూ కొత్తవారి నియామకం చేపట్టకపోవడంతో పథకం నిర్వహణ సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. ఒక్కొక్కరు రెండు, మూడు గ్రామాల చొప్పున బాధ్యతలు చేపడుతున్న కారణంగా పనుల పర్యవేక్షణ భారంగా మారింది.

**వేసవిలో జోరందుకోనున్న పనులు**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన సాఫ్ట్‌వేర్ వినియోగం, క్షేత్రసహాయకులకు ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం ముఖ హాజరు లాంటి విధానాలతో ఇబ్బందులు తప్పడం లేదు. కూలీల హాజరు నమోదు, క్షేత్రస్థాయిలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం, పనుల



పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుంది. వేతనాలు కూడా నెలనెలా అందని పరిస్థితి నెలకొందంటున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మూడు నెలలపాటు ఉపాధి పనులు జోరందుకోనున్నాయి. పనిదినాలు, టార్గెట్ పూర్తి చేయకపోవడం, ఇతర కారణాల వల్ల కొందరు క్షేత్రసహాయకులను గతంలో ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. వారి స్థానంలో స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు తరచుగా కారోబార్‌లు, ఇతర సిబ్బందిపైన ఆధార పడుతూ విధులు చేపడుతుండటం గమనార్హం.

**పనిభారం బాగా పెరిగింది –బబ్బూరి శంకర్, క్షేత్రసహాయకుల సంఘం, జిల్లా అధ్యక్షుడు**

పథకం అమలులో భాగంగా పనిభారం బాగా పెరిగింది. నలుగురు చేసే పనిని ఒక్కరమే చేస్తున్నాం. కూలీల ఫొటోలను ఒకసారి అప్‌లోడ్ చేసిన తర్వాత నాలుగు గంటల విరామం ఇచ్చి మళ్లీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఖాళీలను భర్తీ చేయడంతో పాటు నూతన పంచాయతీల్లో నియామకాలు చేపడితే పథకం అమలుకు పూర్తిస్థాయిలో ఇబ్బందులు తొలగుతాయి.జిల్లా సమాచారం.. పంచాయతీలు : 427

క్షేత్రసహాయకులు : 262జాబ్‌కార్డుల సంఖ్య : 1,43,090

కూలీల వివరాలు : 2,63,466

# ఐడీపీఎల్ ఇవ్వలేదు.. టీజీఐఐసీ తీసుకోలేదు




హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలు ఐడీపీఎల్, నైపర్‌లపై టీజీఐఐసీ అధికారులు పోలీసులకు సమర్పించిన ఫిర్యాదు వెనుక భారీ తతంగమే నడిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఐడీపీఎల్, నైపర్ సంస్థల భూములు, హెచ్ఎంటీ భూములకు మధ్యలో ప్రైవేటు వ్యక్తులు కొన్ని పత్రాలు సృష్టించి 14 ఎకరాలు ఆక్రమించి లే–అవుట్లు వేస్తుండగా.. టీజీఐఐసీ అధికారులు ఈ నెల 17న బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐడీపీఎల్ అధికారులు సహకరిస్తున్నారని, వాస్తవానికి ఐడీపీఎల్‌కు ఇచ్చిన 891 ఎకరాల భూములు తమవేనని ఆధారాలు సమర్పించారు. మరోవైపు ఐడీపీఎల్ భూములను ఆ సంస్థ అధికారులు తమ వద్దే ఉంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. టీజీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో ఇప్పటివరకూ తాత్సారం ప్రదర్శిస్తున్నారు.

**ఉచితంగా ఇచ్చినందుకే.. తిరిగి ఇవ్వాలంటూ..**

ఐడీపీఎల్ సంస్థకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1961లో రైతులు, ప్రైవేటు పట్టాలున్న వారి నుంచి 891 ఎకరాలు సేకరించి ఇచ్చింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు బాలానగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి బల్క్ డ్రగ్ పరిశ్రమకు అనువుగా ఉంటాయని భావించి 891 ఎకరాలు ఐడీపీఎల్ సంస్థకు స్వాధీనం చేశారు. భూములు అప్పగించేప్పుడు కన్వేయన్స్ డీడ్‌లో ఐడీపీఎల్ పరిశ్రమను మరోచోటికి తరలించినా... నిర్వహణ లోపాలు తలెత్తి సంస్థను ఖాయిలాపడ్డ పరిశ్రమగా గుర్తించినా భూములను వెనక్కి ఇవ్వాలనే షరతు విధించారు. 2003లో ఐడీపీఎల్ సంస్థ పడింది. భూములు వెనక్కి ఇవ్వకపోగా అమ్ముకునే ప్రయత్నాలు 2006లో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నిరభ్యంతర పత్రం ఇవ్వక ఆగిపోయాయి.

**సరిహద్దు కంచె వేసుకోని టీజీఐఐసీ**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భూములు టీజీఐఐసీ పరిధిలోకి వచ్చాయి. 2015లో టీజీఐఐసీ అధికారులు ఈ భూములను పరిశీలించినా.. కనీసం సరిహద్దు కంచె వేసుకునేందుకు కూడా ప్రయత్నించలేదు. ఐడీపీఎల్ భూములు ఖాళీగా ఉండడంతో.. కొందరు వ్యక్తులు తప్పుడు సర్వే నంబర్లు సృష్టించి వాటిని ఆక్రమించుకోవడంపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే 14 ఎకరాల ఆక్రమణ తెరపైకి వచ్చింది.

# రూ.వేల కోట్ల ప్రాజెక్టులకు నిధులెలా?!



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో.. రూ.వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులకు నిధుల గండం పొంచి ఉంది. హెచ్ఎండీఏకు శివార్లలోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు(యూఎల్‌బీలు) నుంచి అధిక శాతం ఆదాయం సమకూరుతోంది. అక్కడ 5 అంతస్తులకు మించి భవనాలు, భూవినియోగ మార్పిడి, ఎన్‌వోసీలు ఇతర అనుమతుల కోసం ఫీజులు వసూలు చేస్తోంది. ఏటా రూ.1200 కోట్ల ఆదాయంలో 90 శాతం శివారు మున్సిపాలిటీల నుంచే సమకూరుతోంది. తాజాగా వీటిని జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. బహుళ అంతస్తుల భవనాల అనుమతులనూ జీహెచ్ఎంసీకు దాఖలు పరిస్తే... హెచ్ఎండీఏ పూర్తిస్థాయిలో ఆదాయం కోల్పోనుంది. ఫలితంగా పురోగతిలో ఉన్న ప్రాజెక్టులపై ఆ ప్రభావం కన్పించనుంది. శివార్లలో 5 లేదా 10 అంతస్తులకు దాటిన భవనాల అనుమతులు హెచ్ఎండీఏ వద్దే ఉంచేలా ప్రభుత్వం యోచిస్తున్నట్లు వినిపిస్తున్నా స్పష్టత మాత్రం లేదు.

**ఆదాయ మార్గాలు మూసుకుపోతే కష్టమే..**

శివారు యూఎల్‌బీలు జీహెచ్ఎంసీలో విలీనమైనా.. ఆయా ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలకు ఇప్పటికీ హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేస్తోంది. ప్రభుత్వం నుంచి లిఖితపూర్వకంగా ఆదేశాలు లేకపోవడంతో పాత దరఖాస్తుల పరిష్కారంతోపాటు కొత్తగా అర్జీలనూ స్వీకరిస్తోంది. ఎన్‌వోసీలు, భూ వినియోగ మార్పిడి దరఖాస్తులను సైతం హెచ్ఎండీఏ పరిష్కరిస్తోంది. ప్రస్తుతం పలు అభివృద్ధి ప్రాజెక్టులకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఒక్కసారి ఈ ప్రక్రియ ఆగితే నిధుల కోసం దిక్కులు చూడాల్సిందే. నగరం నుంచి అవుటర్ రింగ్‌రోడ్డు వరకు ప్రత్యేక కారిడార్లను నిర్మిస్తోంది. అవుటర్ రింగ్‌రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు రెండు గ్రీన్‌ఫీల్డ్ రహదారులకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ రెండు ప్రాజెక్టులకే రూ.15 వేల కోట్లు అవసరం. నగరంలో వివిధ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, అర్బన్ పార్కుల నిర్మాణం కూడా చేపడుతోంది. దీనికోసం హెచ్ఎండీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల ద్వారా నిధులను సమకూర్చుకోవడానికి సమాయత్తమవుతోంది. మొత్తం రూ.30 వేల కోట్లు సేకరించడానికి పలు రుణ సంస్థలతో సంప్రదింపులు చేస్తోంది. ఇందుకు హెచ్ఎండీఏకు వచ్చే ఆదాయాన్ని గ్యారంటీగా చూపుతోంది. ఈ నేపథ్యంలో ఆదాయ మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

# బడి పిల్లల రవాణా... ప్రమాదాలతో హైరానా



హైదరాబాద్ : బడి పిల్లల రవాణాపై తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. స్కూల్ బస్సుల వాహనాల నిర్వహణ, ఫిట్‌నెస్‌లో నిర్లక్ష్యం, అధిక వేతనాలు ఇవ్వలేక అర్హత లేని వ్యక్తులకు డ్రైవింగ్ అప్పగించడం, ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు ప్రైవేటు వాహనాల్లో బడికి పంపడం.. వెరసి మహానగరంలో బడిపిల్లలు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. బుధవారం ఒక్కరోజే నగరంలో రెండు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకోవటం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. రెండు ఘటనల్లో విద్యార్థులంతా స్వల్పగాయాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

**12వేల వాహనాలు**

జీహెచ్ఎంసీ పరిధిలో దాదాపు 12,200 స్కూల్ బస్సులు నడుస్తున్నాయి. ఆటోలు, వ్యాన్లు, ఇతర వాహనాలు లక్షలాది విద్యార్థులను తరలిస్తున్నాయి. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడంలో నిర్లక్ష్యం జరుగుతుంటే.. ఆటోలు, ప్రైవేటు వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత రెండేళ్లలో స్కూల్ బస్సులు, ఆటోడ్రైవర్లు వందలాది మంది మద్యం మత్తులో పోలీసులకు చిక్కడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో రవాణా శాఖ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల సీనియారిటీ తదితరాలను తనిఖీ చేస్తున్నా.. తర్వాత పట్టించుకోవడం లేదు.

**అమలు కాని నిబంధనలు..**

త్రీ సీటర్ ఆటోలో 12ఏళ్లలోపు విద్యార్థులు ఆరుగురినే తరలించాలి. 4 సీటర్ ఆటోలో 8 మంది చిన్నారుల్ని తీసుకెళ్లాలి. కానీ 12 నుంచి 18 మంది వరకు తరలిస్తున్నారు.

స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ తప్పనిసరి. ప్రాథమిక చికిత్స కిట్ ఉండాలి. సీటింగ్ పరిమితికి మించి విద్యార్థులను తరలించొద్దు. డ్రైవరుకు వాహనం నడపడంలో ఐదేళ్ల అనుభవం ఉండాలి. వయసు 60 ఏళ్లు దాటొద్దు. నిబంధనలు ఉల్లంఘించినట్లు రికార్డు ఉండే అనర్హుడు. అనర్హులతోనే బస్సులు నడుపుతున్నారు.ఆటోల అంచున, డ్రైవరు పక్కనే కూర్చుబెట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ఆటోడ్రైవర్లు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సఫర్ కార్యక్రమం కింద ఆర్థిక సహకారం అందిస్తున్నా పాఠశాలలు స్కూల్ బస్సు డ్రైవర్లకు శిక్షణ నిర్వహించటం లేదు.

# రైల్వే టికెట్ రద్దు చేసుకుంటే..?

కాచిగూడ ; ఖరారైన రైల్వే టికెట్ రిజర్వేషన్ రద్దు చేసుకుంటే ఏ నిబంధనలు వర్తిస్తాయో మీకు తెలుసా..? రైలు బయలుదేరే సమయానికి 48 గంటల ముందు టికెట్‌ను రద్దు చేసుకుంటే (కనీస రద్దు ఛార్జీ) ఫస్ట్ ఏసీ, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కు రూ.240, ఏసీ సెకండ్ క్లాస్‌కు రూ 200, థర్డ్ ఏసీ, ఏసీ ఛైర్‌కార్, థర్డ్ ఏసీ ఎకానమి రూ.180, స్లీపర్ క్లాస్ రూ.120, సెకండ్ క్లాస్ సిట్టింగ్‌కు రూ.60 డబ్బులను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని వెనక్కి ఇస్తారు. 48 నుంచి 12 గంటల మధ్యన టికెట్ ఛార్జీ మొత్తంలో 25 శాతం మేరకు (కనీస రద్దు ఛార్జీ) డబ్బులు కట్ అవుతాయి. 12 నుంచి 4 గంటల మధ్య 50 శాతం డబ్బులను (కనీస రద్దు ఛార్జీ) మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని వెనక్కి చెల్లిస్తారు. 4 గంటల తర్వాత రద్దు చేసుకుంటే టిక్కెట్ డబ్బులు తిరిగి ఇవ్వరు.. ఆర్ఏసీ, వెయిటింగ్‌లిస్ట్ టిక్కెట్లు రద్దు చేసుకుంటే అరగంట లోపు రూ. 60 మినహాయించుకుంటారు. తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వరు.

# నిర్లక్ష్యం.. 24/7

భువనగిరి : ఆత్మకూరు(ఎం) పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి అయినప్పటికి ఒకే పోస్టు మంజూరు ఉంది. ఇద్దరు వైద్యులు ఉండాలి, కాని పాతికేళ్లుగా ఒకే డాక్టర్ విధులు నిర్వహిసున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహిస్తారు. ఆ తర్వాత స్టాఫ్ నర్సు వైద్యమే దిక్కు. సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రమాదాలు జరిగినా, అత్యవసర వైద్య సేవలు అవసరమైతే జిల్లా కేంద్రం, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది.గ్రామీణ ప్రాంత ప్రజలకు పగలు, రాత్రి తేడా లేకుండా వైద్య సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కొనసాగిస్తోంది. అత్యవసర వైద్య సేవలు అందించాల్సి ఉండగా సిబ్బంది లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

జిల్లాలో 31 పీహెచ్‌సీలు, ఒక అర్బన్ సెంటర్ ఉన్నాయి. 11 పీహెచ్‌సీలను 24 గంటలు సేవలు అందించే ఆసుపత్రులుగా మార్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీటిల్లో ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒకరు సమావేశాలు, ఇతర పర్యటనలకు వెళ్లినా మరొకరు ఆరోగ్య కేంద్రంలోనే అందుబాటులో ఉండి రోగులను పరీక్షించాలి.

జిల్లాలో 24 గంటల పీహెచ్‌సీలు.. యాదగిరిగుట్ట, రాజపేట, వలిగొండ, మోత్కూరు, ఆత్మకూరు(ఎం) బీబీనగర్, బొమ్మలరామారం, తుర్కపల్లి, పోచంపల్లి, నారాయణపురం, మోటకొండూరు.

**క్షేత్రంలో ఇలా..**

రాజపేట పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులుండాల్సి ఉంది. ఒకే డాక్టర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఫలితంగా రాత్రివేళ స్టాఫ్‌నర్స్ మాత్రమే సేవలందిస్తారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు, కుక్కకాటు, తేలుకాటు ఘటనలు రోజు జరుగుతుంటాయి. మందులు అందుబాటు



లో ఉన్నప్పటికీ వైద్యులు లేనికారణంగా రోగి పరిస్థితి ఏ మాత్రం తీవ్రంగా ఉన్నా భువనగిరిలోని జనరల్ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఆసుపత్రిని పరిశీలించిన క్రమంలో కేవలం స్టాఫ్‌నర్స్, ఆయా, వాచ్‌మెన్‌లు మాత్రమే ఉన్నారు.


తుర్కపల్లిలోని ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందించాల్సి ఉండగా.. ఒకే డాక్టర్ ఉన్నారు. రాత్రి పూట సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఇటీవల ఓ గర్భిణి తెల్లవారుజామున కడుపునొప్పితో ఆసుపత్రికి రాగా వైద్య సేవలు అందించలేదు. ఆమె ఫిర్యాదుతో డీఎంహెచ్‌వో విచారణ కూడా జరిపారు.

**సేవలు మెరుగుపరుస్తాం**

డాక్టర్ ఎం.మనోహర్, జిల్లా వైద్యాధికారి వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్యుల కొరత ఉంది. పూర్తిస్థాయిలో నియమిస్తాం. రాత్రి పూట స్టాఫ్ నర్సు, ఆయా, వాచ్‌మెన్ అందుబాటులో ఉంటున్నారు. ప్రథమ చికిత్స, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు కాల్ డ్యూటీలో అందుబాటులో ఉండి సేవలు అందిస్తారు.

# విభజన జరిగేనా?

ఖమ్మం : ప్రజలకు మెరుగైన, వేగవంతమైన పౌరసేవలు అందించే లక్ష్యంతో మండల వ్యవస్థ ఏర్పాటైంది. గతంలో 50వేల జనాభాకు ఒక తహసీల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. ఖమ్మం అర్బన్ మండలంలో పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. నగరంలో జనాభా 5 లక్షలకు చేరువైంది. రెండు దశాబ్దాల కాలంలో అనూహ్యంగా విస్తరించింది. విద్య, వైద్యరంగాల్లో హైదరాబాద్, వరంగల్ తరువాత స్థానంలో ఖమ్మం ఉంది. సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు సరిహద్దులోని ఏపీకి చెందిన వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఖమ్మంలో స్థిరపడుతున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఖమ్మం అర్బన్ మండలంలోకి వస్తుంది. అయినా అర్బన్ తహసీల్ కార్యాలయం ఒకటే ఉంది. ట్రాఫిక్‌తో కలిపి నగరంలో ఐదు ఠాణాలు సైతం అర్బన్ మండలంలోకి వస్తాయి. ఖమ్మంలోని పౌరులకు తహసీల్ కార్యాలయం నుంచి పౌరసేవల్లో జాప్యం నెలకొంటోంది. కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు జారీ, ఫ్యామిలీ మెంబర్, సాగుభూముల క్రయవిక్రయాలు, సహా ప్రభుత్వ



స్థలాల సంరక్షణ తదితరాలకు అర్బన్ తహసీల్ కార్యాలయమే దిక్కు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోయే మంత్రులు, న్యాయమూర్తులు, ఇతర వీవీఐపీలకు సంబంధించి ప్రోటోకాల్ ఏర్పాట్లు అక్కడే చూడాలి. కార్యాలయంలో మాత్రం సిబ్బంది సంఖ్య పెరగలేదు. డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు రెవెన్యూ ఇనస్పెక్టర్లు, జూనియర్, సీనియర్ సహాయకులు, రికార్డ్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మండల పరిధిలో 10 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇటీవల 14 మంది జీపీఓలను కేటాయించారు.ఖమ్మంఅర్బన్ మండలాన్ని జనాభా ఆధారంగా పది మండలాలుగా విభజించాలి. కనీసం రెండుగా అయినా విభజించాలనే ప్రజలు విన్నపాలు కొన్నేళ్లుగా బుట్టదాఖలు అవుతున్నాయి. ప్రతి ఠాణా పరిధికి ఒక రెవెన్యూ మండలం చొప్పున విభజిస్తే.. వేగంగా సేవలు అందించవచ్చునని పలువురు సూచిస్తున్నారు. జిల్లాలు, మండలాలను పునర్వ్యవస్థీకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈసారైనా ఖమ్మం అర్బన్ మండలం విభజన జరుగుతుందా..లేదా వేచిచూడాల్సిందే.

## నగరంలో బాహుబలి పీటీఆర్‌లు

హైదరాబాద్ : నగరంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్... కొత్త విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి స్థలాల కొరత కారణంగా ప్రస్తుతం ఉన్న కేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) సామర్థ్యం పెంచే చర్యలను దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) చేపట్టింది. తెలంగాణ డిస్కంల పరిధిలోని 33/11కేవీ ఉపకేంద్రాల్లో ఇప్పటివరకు 5 ఎంవీఏ, 8 ఎంవీఏ, గరిష్ఠంగా 12.5 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పీటీఆర్‌లు మాత్రమే ఉన్నాయి. మొదటిసారిగా 16 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. దేశంలోనే తమిళనాడు విద్యుత్తు బోర్డు తర్వాత ఈ స్థాయి పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసిన రెండో డిస్కం మనదని విద్యుత్తు అధికారులు తెలిపారు.



ఎక్కడెక్కడ..: ఈఎస్ఐ, రవీందర్ సొసైటీ, సరోజినిదేవి ఆసుపత్రి, అల్లూరి సీతారామనగర్, ప్రకాశ్‌నగర్, మల్లేపల్లి, నాంపల్లి, మోతీమహల్, జూబ్లీహిల్స్, ఎల్వీ ప్రసాద్, గంధంగూడ, చాంద్రాయణగుట్ట, సీతాఫల్‌మండి తదితర ఉపకేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.95 కోట్ల వరకు ఉందని వెల్లడించారు. 16 ఎంవీఏ అంటే 16వేల కేవీఏతో సమానం. ఒక ఇంటికి ఒక కిలోవాట్ కన్షెడ్ లోడ్ అనుకుంటే 16వేల కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా చేయవచ్చు.


## మురుగునీటి శుద్ధికి.. భూసేకరణే అడ్డంకి..!

ఖమ్మం : ఖమ్మం నగర రహదారులపై వృథనీరు నిలవకుండా, చెరువుల్లోకి చేరకుండా దూరం తరలించటానికి చేపట్టిన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(యూజీడీ) పనులకు భూసేకరణ ప్రక్రియ అడ్డంకిగా మారింది. అమృత్ పథకంలో తొలివిడతలో మంజూరైన రూ.239కోట్లతో భూగర్భంలో పైపులైన్లు వేయాలి. వీటిద్వారా వచ్చే వృథజలాలను శుద్ధిచేయటానికి పుట్టకోట, ధంసలాపురంలో రెండు మురుగునీటి శుద్ధికేంద్రాలు (ఎస్‌టీపీలు) నిర్మించాలి. ఖమ్మం నగరంలోని 60శాతం మురుగు జలాలను శుద్ధిచేయటానికి ధంసలాపురంలో 44 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే) ఎస్‌టీపీ ఏర్పాటుకు నగరపాలక సంస్థ సంకల్పించింది. ఏడున్నరెకరాల భూమి అవసరమని రెవెన్యూ అధికారులను కోరింది. ఇందులో ప్రభుత్వ భూమి రెండెకరాలు పోను మిగిలిన ఐదున్నరెకరాలు సేకరించాలి. ఏఏ సర్వేనంబర్లలో ఎంతెంత భూమి సేకరించాల్సి ఉందో తెలుసుకోవటానికి అధికారులు సర్వేకు ప్రయత్నించగా స్థానిక రైతులు సహకరించలేదు. భూములివ్వటానికి ఆసక్తి చూపలేదు. ప్రజావసరాలకు భూమి సేకరిస్తామని సర్వేనంబర్లతో రెవెన్యూ అధికారులు ప్రిలిమినరీ నోటిఫికేషన్(పీఎన్) ఇచ్చారు. 60రోజుల తరువాత ప్రిలిమినరీ డిక్లరేషన్(పీడీ) ఇవ్వాలి. ఇందుకోసం రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సమర్పించినట్లు తెలిసింది. వీటిని కలెక్టర్ పరిశీలించి గెజిట్ జారీచేస్తారు. నెలరోజుల్లో అవార్డు ప్రతిని ప్రచురిస్తారు. గత మూడేళ్లలో.. పరిసరాల్లో జరిగిన క్రయవిక్రయాల ఆధారంగా పరిహారం నిర్ణయిస్తారు. స్థానికంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు సుమారు రూ.60లక్షల పరిహారమిచ్చారు. ఈలెక్కన ఇక్కడా పరిహారం నిర్ణయించే అవకాశముంది. 'రైతులు ముందుకు రానందున పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తాం' అని ఆర్డీఓ నరసింహారావు తెలిపారు.

## నీలగిరి.. మహానగరి..!

నల్గొండ : నీలగిరికి మహర్దశ వచ్చింది. పురపాలిక ప్రజల చిరకాల స్వప్నం ఫలించింది. మహా నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలిలో కార్పొరేషన్ హోదా పెంచుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బిల్లుపై చర్చించి ప్రభుత్వం ఆమోదించింది. అధికారికంగా గెజిట్ (ఉత్తర్వులు) వెలువడాల్సి ఉంది.ః రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొత్తగా పురపాలికలు, నగరపాలక సంస్థలు ఏర్పాటు ప్రక్రియ చేపట్టడంతో.. నల్గొండను మహానగరం (కార్పొరేషన్)గా ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో కలిసి ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. సమీప గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ లేకుండానే ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ పరిధితోనే కొత్తగా నగరపాలక సంస్థ ఏర్పాటుకు అంగీకరించింది.

ప్రయోజనాలు ఇలా..మహానగర పాలక సంస్థగా ఆవిర్భవించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.వందల కోట్ల నిధులు దండిగా రానున్నాయి. మౌలిక సౌకర్యాల అభివృద్ధి, మానవ ఆర్థిక



సూచీ ఎగువకు పాకనుంది. ఉద్యోగుల పోస్టుల సంఖ్య పెరగడంతో పాటు వారి స్థాయికి తగ్గట్టు హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు, వేతనాలు అందనున్నాయి.

48 డివిజన్లతోనే ఏర్పాటు...!

నల్గొండ పురపాలికలో 48 వార్డులు ఉండగా వాటిని పునర్విభజన చేయకుండానే మహానగర పాలక సంస్థగా ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి సూచన మేరకు కార్పొరేషన్ ఏర్పాటుకు కావాల్సిన పూర్తి సమగ్ర వివరాలు సేకరించి ప్రతిపాదనల రూపంలో గతేడాది నవంబరులో అందజేశారు. డివిజన్ల విభజన లేకుండానే పురపోరుతో పాటే యథవిధిగా ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## క్లిక్ చేయొద్దు.. చేతులు కాల్చుకోవద్దు



హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ సంస్థల(ఎన్‌బీఎఫ్‌సీ) పేర్లతో బోల్తా కొట్టించి డబ్బు కాజేయడం ఇప్పటివరకూ చూశాం.. ఇప్పుడు మరో ముందడుగు వేసి కొత్త మోసానికి తెరలేపారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) పేరుతో డబ్బు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఆర్బీఐ తీసుకొచ్చిన ఉద్గం పథకాన్ని అవకాశంగా మార్చుకుని డబ్బు కొట్టేస్తున్నారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసమంటూ వివరాలు సేకరిస్తూ మోసగిస్తున్నారు. కొందరు కేటుగాళ్లు ఆర్బీఐ తరపున మాట్లాడుతున్నా మని.. అనుమానాస్పద లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతాలన్నీ స్తంభింపచేస్తున్నామని బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఈ తరహా మోసాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఆర్బీఐ అధికారులు కాల్స్ చేసి ఎలాంటి వివరాలు సేకరించరనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేస్తున్నారు.

**ఉద్గం స్కీమ్ అంటే..?**

రెండు నుంచి పదేళ్ల వరకూ ఉపయోగంలో లేని బ్యాంకు ఖాతాల్లోని డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి ఆర్బీఐ ఈ పథకాన్ని ప్రారంభించింది. సంబధిత శాఖకు వెళ్లి కేవైసీ పత్రాలు అందజేసి తీసుకోవచ్చు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై అవగాహన కోసం ఆర్బీఐ సందేశాలు పంపిస్తోంది. పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తోంది.మోసాలు చేస్తున్నారిలా..

ఆర్బీఐ లాగే సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్, వాట్సప్‌లో మోసపూరిత లింకులతో సందేశాలు పంపిస్తున్నారు.

పొరపాటున క్లిక్ చేస్తే నకిలీ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత వివరాలతోపాటు యాక్టివ్‌లో ఉన్న ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు.

ఈ వివరాల ఆధారంగా ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ.. ఖాతాల యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అడిగి డబ్బంతా కాజేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డు లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని, మోసాలకు ఉపయోగిస్తున్నట్లు ఆధారాలున్నాయని, మరో రెండు గంటల్లో మీ పేరుతో ఉండే అన్ని బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.

మరిన్ని వివరాల కోసం 9 ప్రెస్ చేయాలని వాయిస్ కాల్ వస్తోంది. పొరపాటున ఈ నంబరు ప్రెస్ చేస్తే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చి వేర్వేరు కారణాలతో డబ్బు కొట్టేస్తున్నారు.

**ఫిర్యాదు చేయండిలా..**

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసం వెబ్‌సైట్లను నమ్మకుండా నేరుగా సంబంధిత బ్రాంచిలకువెళ్లి ఆరా తీయాలి.

ఒకవేళ సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ, %www.cybercrime.gov.in% ద్వారా ఫిర్యాదు చేయాలి.

## ఖాళీ కుర్చీలు.. కానరాని ఔషధాలు



హైదరాబాద్ :గ్రేటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అరకొరగా అందుతున్నాయి. రోగాల్లో 80 శాతం వరకు ప్రాథమిక ఆరోగ్య సమస్యలే. వీటిలో సరైన సేవలందిస్తే పెద్ద ఆసుపత్రులకు వెళ్లే అవసరం తప్పుతుంది. మొత్తం 200 బస్తీ దవాఖానాలు, మరో 95కుపైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, శివార్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుంటే పర్యవేక్షణ లేదు. వాటిల్లో రోగులకందుతున్న సేవలపై పరిశీలించగా పలు లోపాలు బయటపడ్డాయి. కొన్నిచోట్ల వైద్యులు, సిబ్బంది లేరు. చాలావాటిల్లో ఉదయం 10 తర్వాతే విధులకు వస్తున్నారు. ఉదంతాలివిగో..: ఖైరతాబాద్‌లో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గతంలో గైనిక్ విభాగంలోనే ఆరుగురు శాశ్వత వైద్యులుంటే ప్రస్తుతం ఒకరు అదీ అమీర్‌పేట నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఎక్స్‌రే, స్కానింగ్ లేదు, ఈసీజీ పనిచేయడంలేదు.

ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌ను నిమ్స్‌లో విలీనం చేసిన తర్వాత వైద్యుల కొరత తీరినా మందుల కొరత పీడిస్తోంది. 3 నెలలుగా మధుమేహం, బీపీకి చెందిన ఔషధాలు అందుబాటులో లేవన్న ఆరోపణలున్నాయి.

మలక్‌పేట ఫర్హత్‌నగర్‌లో రెఫరల్ ఆసుపత్రి కొత్తగా నిర్మిస్తుండటంతో ప్రస్తుతం ఆజంపురాలోని వార్డు కార్యాలయంలోకి తరలించారు. ఏడుగురు సిబ్బందిలో ఇద్దరే సేవలందిస్తున్నారు. కాంట్రాక్టు వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు.

కార్వాన్ పానీపురా పట్టణ ఆరోగ్య కేంద్రంలో మరుగుదొడ్లు లేవు. అఫ్జల్‌సాగర్ యూపీహెచ్‌సీలో కూడా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది.

అమీర్‌పేట్‌లోని ఈఎస్ఐ యూపీహెచ్‌సీకు సొంత భవనం లేదు. ఒకే గదిలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది, ఫార్మాసిస్టు, ఔషధాల నిల్వతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ 100 మంది రోగులొస్తున్నారు.

ఉప్పల్ పరిధిలోని లక్ష్మనారాయణ కాలనీ బస్తీ దవాఖానాలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. రోగులు ఎదురు చూసి తిరిగి వెనుదిరుగుతున్నారు.

శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రం పరిసరాలు చెత్తతో నిండిపోయాయి. బోరు పనిచేయడం లేదు. మరుగుదొడ్లు దారుణంగా ఉన్నాయి.

ఎల్బీనగర్ పరిధి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త నమూనాల సేకరణ ఇతర పరీక్షలకు ఇబ్బందులు తప్పడం లేదు.

## అర చేతిలో 'స్త్రీనిధి' సమాచారం

పెద్దపల్లి : వడ్డీ వ్యాపారుల నుంచి రక్షంచేందుకు ప్రభుత్వం మహిళలకు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేస్తోంది. వ్యాపారాలు చేసుకోవడానికి ఆర్థిక చేయూత అందిస్తోంది. అయితే కొందరు కిస్తీల డబ్బులను సకాలంలో చెల్లించకుండా సొంతానికి వాడుకుంటున్నారు. సిబ్బంది సభ్యుల ఇళ్లకు వెళ్లి బకాయిలు అడిగే వరకు వాస్తవాలు వెలుగులోకి రావడం లేదు. ఇలాంటి పొరపాట్లను అధిగమించేందుకు ప్రభుత్వం 'మన స్త్రీని' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అతివలు అరచేతిలో నుంచే రుణ వాయిదాలు ఖాతాల్లో జమ చేశారా? లేదా దీని ద్వారా సులువుగా పరిశీలించుకోవచ్చు.

**సర్వం నిక్షప్తం..**

స్త్రీనిధి రుణాలు పొందిన సమస్త సమాచారం యాప్‌లో నమోదై ఉంటాయి. రుణాలు తీసుకున్నది ఎంత? చెల్లించిన వాయిదాలెన్ని? ఇంకా బకాయిలెన్ని ఉన్నాయనేది పొందుపరిచారు. పాత రుణాలు ఎంత చెల్లించారనేది స్పష్టంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. సహచర మహిళలు, బ్యాంక్ మిత్ర ఇలా ఎవరికి రుణ వాయిదా డబ్బులు ఇవ్వకుండా ఇంటి నుంచే చెల్లించే అవకాశం ఉంది. స్త్రీనిధి వాయిదా సొమ్మును కొందరు లీడర్లు సభ్యులకు తెలియకుండా వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. ఈ యాప్ ద్వారా ఇలాంటి అక్రమాలకు చెక్‌పడనుంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

స్మార్ట్‌ఫోన్ ఉన్న సభ్యులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఫోన్ నెంబరు నమోదు చేస్తే గ్రూప్, ఇతర వివరాలు రుణాలు కనిపిస్తాయి.సభ్యులకు ఫోన్ నెంబర్ లేకుంటే వారి బంధువులు, పిల్లల నెంబర్లతో కూడా చూసుకోవచ్చు. **నమోదులో అగ్రపథం**స్త్రీనిధి యాప్ నమోదులో ఉమ్మడి జిల్లా అగ్రపథంలో కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 19,895 సంఘాలు రుణాలు తీసుకోగా వీటిలో 33,399 మంది మహిళలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. స్త్రీనిధి అధికారులు సంఘాల సమావేశాల్లో యాప్ డౌన్‌లోడ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. **అవగాహన కల్పిస్తున్నాం**స్త్రీనిధి రుణాల పంపిణీలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ఉండేందుకు యాప్ ఉపయోగపడనుంది. సభ్యుల రుణ కిస్తీలు, ఇతర వివరాలు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు.

## నిధుల లేమి.. ఖాళీల భర్తీకేదీ హామీ!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జనరల్ పుస్తకాలు, కొత్త కొత్త నవలలు కొనుగోళు నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా పోస్టులు భర్తీ కాకపోవడంతో మండల స్థాయిలో గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇన్‌ఛార్జిలతో కాలం వెళ్లదీస్తుండటంతోపాటు సకాలంలో గ్రంథాలయ సెస్ రాకపోవడంతో ఉన్న నిధులతో నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో నాలుగు కేంద్ర గ్రంథాలయాలతోపాటు శాఖ గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రతి రోజు 600-750 మంది, జగిత్యాలలో 100-150 మంది, రాజన్న సిరిసిల్లలో 100-200 మంది, పెద్దపల్లిలో 60-80 మంది వస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో డైరెక్టరేట్ గ్రంథాలయంలో కమిటీ తీర్మానం మేరకు పుస్తకాలు కొనుగోలు చేస్తారు. సామాజిక చైతన్యం, సాహిత్య పుస్తకాలు, నవలలను కమిటీ తీర్మానం మేరకు కొనుగోలు చేస్తారు. దాదాపు పదేళ్ల నుంచి ఇలాంటి పుస్తకాలు కొనుగోళ్లు నిలిచిపోయాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో నిరుద్యోగులు కోరిన ఆన్ డిమాండ్ పుస్తకాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గ్రంథపాలకుల పోస్టుల భర్తీ పదేళ్లుగా చేపట్టడం లేదు. ఈ పదేళ్లలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫలితంగా శాఖ గ్రంథాలయాలు ఇన్‌ఛార్జిల పాలనలో నడుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 శాఖ గ్రంథాలయాల పాలకుల పోస్టులు 36 ఉండగా 8 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీలు ఉండగా ఔట్ సోర్సింగ్ కింద ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయాల్లో 66 పోస్టులకు 27 మంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేడ్-1, గ్రేడ్, అటెండర్, తదితర పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంకు ఒక్క కార్యదర్శి పోస్టు ఉంది.


ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు

ఎ.సరిత, కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

సాధారణ, జనరల్ పుస్తకాలు కొనుగోలు ఇటీవల కాలంలో చేయడం లేదు. రాష్ట్ర కమిటీ ఈ పుస్తకాలు కొనుగోలు చేయాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం నిరుద్యోగ అభ్యర్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆన్ డిమాండ్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాం. పోస్టుల భర్తీ ప్రభుత్వ పరిధిలో ఉంది. ఉన్నవారితోనే విధులు నిర్వహించుకునేలా ప్రణాళిక చేసుకుంటున్నాం.

## నీలగిరి.. మహానగరి..!

నల్గొండ : నీలగిరికి మహర్దశ వచ్చింది. పురపాలిక ప్రజల చిరకాల స్వప్నం ఫలించింది. మహా నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలిలో కార్పొరేషన్ హోదా పెంచుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బిల్లుపై చర్చించి ప్రభుత్వం ఆమోదించింది. అధికారికంగా గెజిట్ (ఉత్తర్వులు) వెలువడాల్సి ఉంది.ః రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొత్తగా పురపాలికలు, నగరపాలక సంస్థలు ఏర్పాటు ప్రక్రియ చేపట్టడంతో.. నల్గొండను మహానగరం (కార్పొరేషన్)గా ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో కలిసి ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. సమీప గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ లేకుండానే ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ పరిధితోనే కొత్తగా నగరపాలక సంస్థ ఏర్పాటుకు అంగీకరించింది.



ప్రయోజనాలు ఇలా..

మహానగర పాలక సంస్థగా ఆవిర్భవించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.వందల కోట్ల నిధులు దండిగా రానున్నాయి. మౌలిక సౌకర్యాల అభివృద్ధి, మానవ ఆర్థిక సూచీ ఎగువకు పాకనుంది. ఉద్యోగుల పోస్టుల సంఖ్య పెరగడంతో పాటు వారి స్థాయికి తగ్గట్టు హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు, వేతనాలు అందనున్నాయి.

**48 డివిజన్లతోనే ఏర్పాటు...!**

నల్గొండ పురపాలికలో 48 వార్డులు ఉండగా వాటిని పునర్విభజన చేయకుండానే మహానగర పాలక సంస్థగా ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి సూచన మేరకు కార్పొరేషన్ ఏర్పాటుకు కావాల్సిన పూర్తి సమగ్ర వివరాలు సేకరించి ప్రతిపాదనల రూపంలో గతేడాది నవంబరులో అందజేశారు. డివిజన్ల విభజన లేకుండానే పురపోరుతో పాటే యథవిధిగా ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## తూమును మూసేసి.. అలుగును మింగేసి

హైదరాబాద్: ఖాజాగూడ పెద్దచెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఇప్పటికే తూము, అలుగును మింగేశారు. తూము పక్కనున్న వెయ్యి గజాలకుపైగా స్థలంలో రెండు గదులను నిర్మించారు. బహిరంగ మార్కెట్లో ఆ భూమి విలువ రూ.40 కోట్లని అంచనా. జీహెచ్‌ఎంసీ అధికారులు.. గదులకేగాక, పక్కనున్న ఖాళీ స్థలానికీ ఇంటి నంబర్లు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

**కాలువను మలుపు తిప్పి**

గచ్చిబౌలి చౌరస్తా, డైమండ్‌హిల్స్, ఐకియా ప్రాంతాల్లో కురిసే వర్షపు



నీరంతా ఈ తటాకంలోకి చేరుతుంది. గచ్చిబౌలిలోని ఓ కుంటకు ఇది గొలుసుకట్టు చెరువు. ఇందులోని నీరు.. కట్ట మధ్యలోని తూము, ఐబీఎం ఐటీ కంపెనీ వైపు అంచున ఉండే అలుగు నుంచి దిగువకు వెళ్లేది. ఖాజాగూడ చెరువుపై 2010లోనే ఆక్రమణదారులు కన్నేశారు. సర్వే.నం.27, 28 పరిధిలో బండరాళ్లతో తూము వద్దనున్న గుంతలను పూడ్చారు. ఆ తర్వాత అలుగు నుంచి ఖాజాగూడ ప్రధాన రహదారి వరకు ఉండే వరద కాలువను 2018లో కబ్జా చేశారు. ఆ మార్గంలో వెళ్లాల్సిన నీటిని తూము దిగువన ఉండే కాలువకు 90 డిగ్రీల కోణంలో మలుపు తిప్పారు. అదనపు నీటిని దిగువకు తీస్కుళ్లే వరద కాలువ ఆక్రమణతో.. భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారీ బయోడైవర్సిటీ చౌరస్తా మునుగుతోంది. 2017లో మనిషి లోతున కూడలిలో వరద నిలిచింది. తాజాగా తూము స్థానంలో నిర్మాణాలు వచ్చాయి. వాటిని అధికారులు తొలగించకుండా ఆ గదులకు, పక్కనున్న ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించారు. దీంతో స్థానికులు హైడ్రాను ఆశ్రయించి ఖాళీ స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

ఇదీ తటాకం లెక్క

ఎఫ్‌టీఎల్ పరిధి.. 37ఎకరాలు

ప్రస్తుతం ఉన్నది.. 29 ఎకరాలు

## నెలకో గుంత.. నవ్వుతోంది నత్త

హైదరాబాద్ : ఈ చిత్రం పరిశీలించారా..? ఇది ఉప్పల్ కూడలి వద్ద పైవంతెన కోసం నిర్మిస్తున్న 148వ పిల్లర్. మొదటి పిల్లర్‌కు పునాది పడింది 2018మే నెలలో. దాదాపు 92 నెలల తర్వాత చివరి పిల్లర్ కోసం జనవరి 1న రాత్రి గుంత తవ్వారు. అంటే నెలకు ఒకటిన్నర పిల్లర్ల చొప్పున నిర్మిస్తున్నారు. ఇంకా పీర్జాదీగూడ నుంచి ఉప్పల్‌వైపు అయిదు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది.

... ఇదీ వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల సంస్థ చేపట్టిన పైవంతెన నిర్మాణం తీరు. ఏడున్నర సంవత్సరాలు దాటినా.. 60శాతం పురోగతి లేని ప్రాజెక్టు ఇది.

వరంగల్‌కు వేగంగా అనుసంధానం కోసం, రోడ్డు ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు పైవంతెన ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. పలు అభ్యర్థనల తర్వాత ఎట్టకేలకు ఉప్పల్ కూడలి నుంచి నారపల్లి వరకు 6.250 కిలోమీటర్ల దూరం పైవంతెన నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. 2018లో కేంద్ర మంత్రి గడ్కరీ పనులకు శంకుస్థాపన చేశారు. గాయత్రి సంస్థ టెండర్ దక్కించుకుంది. రూ.670 కోట్లతో ఆరు లేన్లతో నిర్మించాల్సి ఉంది. భూసేకరణ, నిధుల లేమి, గుత్తేదారు సంస్థ సమస్యలతో తీవ్ర జాప్యం నెలకొంది. ఎన్నోసార్లు సదరు సంస్థకు నోటీసులు ఇచ్చినా లెక్క చేయలేదు. నెలకో గుంత తీస్తూ.. రెండు నెలలకు ఒక కాంక్రీట్ వేస్తూ గుత్తేదారు సంస్థ ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది.

నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి ప్రాంతాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి.

పనుల్లో జాప్యంపై ఉన్నత స్థాయిలో పలుమార్లు సమీక్షలు జరిగాయి. వేరే సంస్థలకు కాంట్రాక్టు అప్పగించే ప్రయత్నాలను గుత్తేదారు సంస్థ అడ్డుకుంది.

రామంతాపూర్ వైపు మరొకటి..

ఉప్పల్ పైవంతెనకు అనుబంధంగా రామంతాపూర్ వైపు మరో పైవంతెనను జీహెచ్‌ఎంసీ నిర్మిస్తోంది. ఉప్పల్ మెట్రో కూడలి వద్ద ఎత్తు పెంచాల్సి రావడం, భూసేకరణలో జాప్యంతో ఆగిపోయింది. ఇటీవల తిరిగి పనులు ప్రారంభించామని చెబుతున్నారు. ఉప్పల్ పైవంతెన ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెబుతున్నారు.

# మెరిసేదెంతో తెలుసుకో!

భీమవరం : బంగారం, బంగారు ఆభరణాల విక్రయాల్లో మోసాలను అరికట్టేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) చర్యలు చేపట్టినా కొందరు అడ్డదారులు తొక్కుతూనే ఉన్నారు. బంగారం ధర పెరగడం, కొనుగోళ్లు తగ్గిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు నాణ్యతలోనే కాదు తూకాల్లోనూ మోసాలకు దిగుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 800 దుకాణాలు ఉన్నాయి. వాటిలో సాధారణ రోజుల్లో రూ.15 కోట్ల వరకు క్రయ, విక్రయాలు జరిగితే సీజన్లో రెండింతలు ఉంటుంది. గతంలో తణుకు పట్టణంలో బంగారు దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించంగా 25 మంది మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నరసాపురంలో పట్టణంలో ఓ మహిళ బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. రెండు నెలల తర్వాత తనఖా పెట్టేందుకు



వెళ్లగా నిర్ణీత బరువు కంటే తక్కువగా ఉంది వ్యాపారి వద్దకెళ్లినా మోసం లేదంటూ వాటిపైన ఉన్న గుర్తులను చూపించారు. ఇలాంటివి నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

**ఇవి తప్పనిసరి**

నగల దుకాణాల్లో విక్రయించే గోల్డ్ జ్యూయలరీపై ఆరు డిజిట్ల హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్(హెచ్‌యూఐడీ) నంబరుతో పాటు బీఐఎస్, బంగారం స్వచ్ఛత(కేడీఎం) ఉండాలి. విక్రయదారులు విధిగా వీటిని ముద్రించాలి. ఇవి ప్రతి నగపై వేర్వేరుగా ఉంటాయి. నగలకు సంబంధించి బంగారం స్వచ్ఛత, హాల్ మార్కింగ్‌పై ఖాతాదారులు ఏవైనా ఫిర్యాదులు లేవనెత్తితే పరిష్కరించేందుకు ఈ కోడ్ ఉపయోగపడుతుంది. నగలు ఎక్కడ తయారు చేశారు, హాల్‌మార్క్ ఎక్కడ వేశారు, స్వచ్ఛత వంటి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

అవగాహన లేక: వినియోగదారుల రక్షణకు బీఐఎస్ కేర్ యాప్, వెబ్‌సైటు అందుబాటులో ఉన్నాయి. వాటిపై అవగాహన లేకపోవడంతో ఎవరూ ఉపయోగించడం లేదు.

# పొరుగు అరుగులే దిక్కు!

పెనుగొండ : పెనుమంట్ర మండలం నెగ్గిపూడిలో తొమ్మిదేళ్ల కిందట చేపట్టిన గ్రామ సమాఖ్య భవన నిర్మాణం ఇలా పునాదుల దశలోనే ఆగిపోయింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ పనులను పూర్తిగా గాలికి వదిలేయడంతో బేస్‌మెంట్‌తో పాటు పిల్లర్లు సైతం దెబ్బతిన్నాయి. సత్యవరం గ్రామంలోనూ గ్రామ సమాఖ్య భవనానికి శ్లాబు వేయకుండా వదిలేయడంతో ఎక్కడిక్కడ దెబ్బతింది.

వీరవాసరం మండలం వడ్డిగూడెంలోని గ్రామ సమాఖ్య భవనం ఇది. కొద్దిపాటి పనులు చేస్తే దీనిని వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా నిర్మాణం క్రమంగా దెబ్బతింటుంది. ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిలా మారింది. గ్రామాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల కార్యకలాపాల నిర్వహణకు సొంత భవనాలు లేకపోవడంతో సభ్యులతో పాటు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల కోసం గ్రామ, మండల సమాఖ్య వ్యవస్థను తీసుకొచ్చింది. అప్పట్లో మండల కేంద్రాల్లో సమాఖ్య కార్యాలయాలు నిర్మించి సభ్యులు ప్రతి నెలా సమావేశాల నిర్వహణ, సమస్యలను చర్చించుకోవడం, శిక్షణ తరగతులకు ఉపయోగించేవారు. ఇవి సత్ఫలితాలనివ్వడంతో అప్పట్లో తెదేపా ప్రభుత్వం గ్రామ స్థాయిలోనూ సమాఖ్య భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2017లో ఉపాధి హామీ పథకం నుంచి రూ.7 లక్షలు, డీఆర్‌డీఏ ద్వారా రూ.6 లక్షల చొప్పున కేటాయించి వీటిని నిర్మించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఈ నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురాగా.. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలాయి. వైకాపా ప్రభుత్వం ఈ నిర్మాణాలను పూర్తిగా గాలికి వదిలేయడంతో క్రమంగా శిథిలావస్థకు చేరాయి.

**ఉన్నవీ ఇతర అవసరాలకు**


వైకాపా ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలు పూర్తయిన మహిళా సమాఖ్య



భవనాలను కూడా సచివాలయాలు, ఆర్‌ఎస్‌కేలకు కేటాయించారు. దీంతో డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశాల నిర్వహణకు సమీప ఆలయాలు, మండపాలు, పాఠశాలలను ఆశ్రయిస్తున్నాయి. ఈ భవనాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించామని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

జిల్లాలో మంజూరైన భవనాలు 372
నిర్మాణం పూర్తయినవి 144
గ్రామ సమాఖ్యలకు అప్పగించినవి 81
ఇతర శాఖలు వినియోగిస్తున్నవి 43
ఇంకా ప్రారంభం కానివి 20
వివిధ దశల్లో ఉన్నవి 228

# మాయమాటలు.. మారుబేరాలు!



అనకాపల్లి : ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని తులసీనగర్లో పేదల పేరుతో ఇచ్చిన జగనన్న కాలనీ స్థలాలు చేతులు మారాయి. ఇక్కడ 93 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వగా వీటిలో 90 మంది ఇతరులకు విక్రయించేశారు. లబ్ధిదారుల్లో చాలామంది వైకాపా నాయకుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గానికి చెందిన వారుకావడం వారందరికీ సొంత ఇళ్లు ఉండటంతో వీటిని ఇతరులకు అమ్మేసుకున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ. 8 నుంచి రూ. 10 లక్షల చొప్పున విక్రయించారు.పాయకరావుపేట మండలం పి.ఎల్.పురంలో జగనన్న లేఅవుట్ వేశారు. 1200 మందికి స్థలాలు ఇచ్చారు. ఇందులో చాలావరకు నిర్మాణాలు చేపట్టలేదు. దీంట్లో 80 వరకు ఇళ్లు, స్థలాలు చేతులు మారాయి. ఇంటి స్థలం రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు అమ్ముకున్నారు. నిర్మించిన ఇళ్లు రూ. 8 లక్షలకు పైనే అమ్మకాలు చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో ఇళ్లు కాదు..** ఊళ్లే నిర్మిస్తామని అప్పటి పాలకులు ఊదరగొట్టారు. శివారులో, జనావాసం లేని ప్రాంతాల్లో ఇంటి స్థలాలిచ్చారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. అప్పట్లో లబ్ధిదారుల ముసుగులో ఆ పార్టీ నేతల అనుచరులకు స్థలాలు, ఇళ్లు కట్టబెట్టారు. వాటిని ఇప్పుడు అమ్మి రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. కొనుగోలుదారులకు స్టాంపు పేపర్లపై ఒప్పంద పత్రాలు ఇస్తూ అందినకాడికి తీసుకుంటున్నారు. ఈ క్రయవిక్రయాలు చేసేందుకు స్థానికంగా స్థిరాస్తి వ్యాపారులు చాపకింద నీరుగా విస్తరించి లబ్ధిదారులతో మంతనాలు చేస్తున్నారు.

**అనుచరులకే కీలక ప్రాంతాల్లో స్థలాలు..**

జిల్లాలోని చోడవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, అనకాపల్లి మండలాల్లోని ప్రధాన రహదారులకు సమీపంలో లేఅవుట్లు వేశారు. గత పాలకులు, వారి అనుచరులకు కీలక ప్రాంతాల్లో స్థలాలు, ఇళ్లు పొందారు. వారి అనుచరులు అధికంగా లబ్ధి పొందారు. వాటిని ఇప్పుడు అమ్మకానికి పెట్టారు. అనకాపల్లి గ్రామీణ ప్రాంతంలోని సంపతిపురంలో ఏకంగా స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడే నకిలీ పట్టాలు సృష్టించి 60 వరకు పట్టాలు అమ్మేశారు. ఇప్పుడు ఖాళీ ఇంటిస్థలాలపై కన్నేశారు. కుంచంగి రెవెన్యూ పరిధిలో వేసిన భారీ లేఅవుట్లో విశాఖవాసులకే అధికంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందులో 30 శాతానికి పైగా స్థలాలు చేతులు మారినట్లు తెలుస్తోంది. చోడవరం నుంచి చీడికాడ వెళ్లే రహదారి పక్కన నర్సయ్యపేట రెవెన్యూ భూమిలో మూడు లేఅవుట్లు వేశారు. ఇందులో 528 మందికి ఇళ్లు కేటాయించారు. ఇందులో దాదాపు 264 ఇంటి స్థలాలు ఇప్పటికే చేతులు మారిపోయాయి. మరికొన్నింటికి బేరాలు సాగుతున్నాయి. ఇక్కడ ఇంటిస్థలం రూ. 1.5 నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

**విక్రయిస్తే చర్యలు**గత ప్రభుత్వంలో మంజూరు చేసిన స్థలాలు, ఇళ్లకు సంబంధించి విక్రయాలు అధికారికంగా చెల్లవు. ఆ స్థలాలను లబ్ధిదారులకు గతంలో రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందించారు. భవిష్యత్తులో గృహ పథకానికి సంబంధించి అర్హత ఉండదు. మాకు ఇప్పటివరకు దీనిపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఆధారాలతో ఫిర్యాదులు చేస్తే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
శ్రీనివాస్, గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి, అనకాపల్లి

# కెమెరా నిఘా.. డ్రోన్ నీడ



తిరుపతి : శేషాచలం అడవులపై మూడో కన్ను నిఘా పెట్టింది. ఎర్రచందనం చెట్ల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్మగ్లర్లకు అడ్డుకట్ట వేయడంతోపాటు.. ఎర్రచందనం చెట్ల నరికివేతను జీరో ఫెల్లింగ్ స్థాయికి తీసుకొచ్చేందుకు అటవీ శాఖ, ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు నిరంతరం శ్రమిస్తున్నాయి.

**సిబ్బందికి శిక్షణ**

శేషాచలం అడవుల రక్షణ, భద్రత వ్యవస్థల నిర్వహణ, వన్యప్రాణుల కదలికలపై నిఘా ఏర్పాటు చేయడానికి డ్రోన్ల ప్రయోగాన్ని అటవీశాఖ కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. డ్రోన్ సాంకేతికత వినియోగానికి ఇతరులపై ఆధారపడకుండా, అధికారులు, సిబ్బందికే శిక్షణ ఇప్పించింది. స్మగ్లర్లు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**జీపీఎస్‌తో పని చేసేలా..**

200 కి.మీ.ల పరిధిలోని 35 పాయింట్లలో జీపీఎస్‌తో పనిచేసే 40 కెమెరాలను ఏర్పాటు చేశారు.వన్యప్రాణుల గుర్తింపు, లెక్కింపు కోసం మరో 70 లైవ్ కెమెరాలు అమర్చారు.

రాత్రిళ్లు చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి ప్రమాదకర జంతువులు జనావాసాల్లోకి రావడాన్ని గుర్తించేలా థర్మల్ కెమెరాలు పెట్టారు.

5 మైక్రో డ్రోన్లు, ఒక థర్మల్ డ్రోన్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ డ్రోన్ 400 మీటర్ల ఎత్తులో 1 నుంచి 5 కి.మీ.ల వరకు అటవీ పరిధిని కవర్ చేస్తుంది.

తిరుపతి, తిరుమలలోని బేస్ కేంద్రాల ద్వారా డ్రోన్లు, లైవ్ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తారు.

స్మగ్లర్లు కనిపించినా, అడవుల్లోకి అన్యులు ప్రవేశిస్తున్నా బేస్ స్టేషన్ నుంచి తక్షణమే అటవీ, టాస్క్‌ఫోర్స్ బలగాలకు సమాచారం వెళ్తోంది.


**సిద్ధమవుతున్న ప్రతిపాదనలు**

తిరుపతి డివిజన్‌లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలోనూ ఈ సాంకేతికతను వినియోగించుకోవాల్సి ఉంది. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ల ప్రయోగాలు నిర్వహించాలి. ఇందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.
సాయిబాబా, తిరుపతి జిల్లా అటవీఅధికారి

# అమ్మకానికి జగనన్న ఇంటి స్థలాలు..!

అమలాపురం : అల్లవరం మండలం బోడసకుర్రులో సుమారు 8.5 ఎకరాల్లో జగనన్న లే అవుట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 308 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. సుమారు 100 మంది నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో 90 వరకు స్థలాలు చేతులు మారినట్లు సమాచారం. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో 334 మందికి సెంటన్నర చొప్పున స్థలాలు కేటాయించారు. ఒక్క ఇంటినీ నిర్మించలేదు. సుమారు 20 శాతం మంది స్థలాలను తనఖా పెట్టినట్లు సమాచారం. మరి కొంతమంది విక్రయించారు.గ్రామాల్లో ఇళ్లు కాదు.. ఊళ్లనే నిర్మిస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం అమలులో విఫలమైంది. గతేడాది జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలపై సర్వే నిర్వహించారు. 1062 మంది అనర్హులు ఉన్నట్లు తేల్చారు. ఇప్పటి వరకు వీరిపై చర్యలు లేవు.

దళారుల దందా.. : ప్రాంతాల వారీగా జగనన్న లేఅవుట్లను కొంత మంది నాయకుల చేతుల్లో పెట్టుకున్నారు. కొంత మంది వడ్డీ వ్యాపారులు తమపేరిట రాయించుకుని స్థలాలపై అప్పులు ఇస్తున్నారు.



**ఫిర్యాదుల ఆధారంగా చర్యలు: కె.మాధవి, డీఆర్వో**

జగనన్న లేఔట్లలో ఇంటి స్థలాల మ్యాపింగ్ ప్రక్రియ చేస్తున్నాం. లబ్ధిదారులు కాకుండా ఇతరులు ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటాం. ఇంటి స్థలాల అమ్మకాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# ఉగాదికి అడుగుపెట్టేలా?

ఒంగోలు : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పక్కా గృహ నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పలు దశల్లో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు అదనపు సాయం అందిస్తోంది. ఇందుకు సకాలంలో బిల్లులు విడుదల చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. ఒక్కో ఇంటికి గత ప్రభుత్వ హయాంలో రూ.1.80 లక్షల చొప్పున ఇవ్వగా, తాజాగా కూటమి ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు; ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అందిస్తోంది. నిర్మాణ దశల ఆధారంగా లబ్ధిదారుల ఖాతాలకు నిధులు జమ చేస్తోంది. గతేడాది నవంబరులో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించింది. తాజాగా మార్చి 19న ఉగాదిని



పురస్కరించుకుని మరో విడత గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మొత్తం 11,099 పక్కాగృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసేవిధంగా క్షేత్రస్థాయిలో గృహనిర్మాణశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# ఇటు చూడట్లేదు.. ఇటుకలు పేర్చట్లేదు

లావేరు: వైకాపా పాలనలో పేదల సొంతింటి కల నెరవేరుస్తామని చేతులెత్తేశారు. ఇష్టానుసారం ఇళ్ల స్థలాలు కేటాయించడం..సకాలంలో బిల్లులు అందక లబ్ధిదారులు పునాదులకే పరిమితం చేయడంతో ఎక్కడికక్కడ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఆయా నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయించి గృహ ప్రవేశాలు చేసేలా పర్యవేక్షించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. లేఅవుట్లలో మౌలిక వసతులు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

**ఇదీ పరిస్థితి** ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి 112 లేఅవుట్లలో 4,310 స్థలాలు కేటాయించగా 2,375 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 1,213 మంది ఇళ్లు నిర్మించారు. చాలాచోట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. లావేరు, తామాడ పంచాతీయలకు సంబంధించి ఒక్క పునాదీ వేయని పరిస్థితి నెలకొంది.

పాతపట్నం నియోజకవర్గ పరిధి 92 లేఅవుట్లలో 2,936 స్థలాలు కేటాయించారు. 1,398 మందికి ఇళ్లు మంజూరు చేయగా 534 మంది నిర్మించారు. టెక్కలి నియోజకవర్గంలోని 110 లేఅవుట్లలో 4,913 స్థలాలు కేటాయించగా 2,146 మందికి ఇళ్లు మంజూరు చేశారు. 839 మంది మాత్రమే నిర్మించారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 3,597 మందికి ఇళ్లు మంజూరు చేయగా 1,470 పూర్తయ్యాయి.

కొండలు, గుట్టల వద్ద స్థలాలు కేటాయించడంతో లబ్ధిదారులు సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుకలు ఇతర సామగ్రి తరలించడానికి సరైన రోడ్డు లేదు. బొడ్డపాడు, బెజ్జిపురం, బుడుమూరు తదితర లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించలేదు.

**13.35 కోట్ల అదనపు సాయం**

లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందించింది. బీసీ, ఎస్సీ, మైనార్టీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు మంజూరు చేసింది. జిల్లాలో అదనపు సాయానికి 17,086 మంది ఎంపిక కాగా 5,761 మందికి రూ.13.35 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 2,591 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 11,325 మంది బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావాలి. 10,218 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాడు గృహ ప్రవేశం చేసేలా పర్యవేక్షిస్తున్నామని గృహ నిర్మాణ సంస్థ పీడీ డి.రమాకాంతరావు తెలిపారు.

జిల్లాలో లేఅవుట్లు : 690
నివాస స్థలాలు: 47,304
మంజూరైన ఇళ్లు : 23,322
పూర్తయినవి :12,448

# కొబ్బరి సీమకు ఊపిరి..!

కవిటి : ఉద్యాన శాఖ – కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) సంయుక్తంగా అమలు చేస్తున్న పునరుద్ధరణ పథకం రైతులకు మేలు చేస్తోంది. ఉద్దానంలో పైలాన్, తిత్లీ తుపాన్ల సమయంలో తోటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. పిడుగుపాటు, చీడపీడలు ఆశించి మరికొన్ని చెట్లు చనిపోయాయి. ఎక్కువ తోటల్లో దశాబ్దాల కిందట నాటినవి ఉన్నాయి. ఏటా కనీసం 10 కాయలు కూడా దిగుబడి ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో కొత్త కళ తీసుకురావడానికి ఉద్యాన శాఖ కార్యాచరణ చేపట్టింది.

**రైతులకు మేలు**

రైతులు పాత చెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు వేయడం లేదు. తోటలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొనడంతో 2016లో తెదేపా ప్రభుత్వం కొత్త మొక్కలు నాటుకోవడానికి, నాణ్యమైన దిగుబడులు సాధించడానికి ఉద్యాన శాఖ– కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా పునరుద్ధరణ పథకాన్ని తీసుకొచ్చింది.

**11,500 ఎకరాల్లో అమలు**

పునరుద్ధరణ పథకాన్ని ఉద్దానం ప్రాంతంలో 7 మండలాల పరిధి 11,500 ఎకరాల్లో అమలు చేస్తున్నారు.

రైతులు హెక్టారుకు గరిష్ఠంగా 30 చెట్లు తొలగించుకోవచ్చు. ఒక్కో చెట్టు తొలగింపునకు ప్రభుత్వం రూ.వెయ్యి అందజేస్తుంది.

మొక్కలు నాటిన తర్వాత వాటికి, మిగతా తోట అభివృద్ధికి మందులు, పొటాష్, యూరియా వేయడానికి, చీడపీడలు తొలగించడానికి హెక్టారుకు రూ.8,750 చొప్పున రెండేళ్ల పాటు సమకూరుస్తుంది.

పథకం ప్రారంభించినప్పటి నుంచి 1.50 లక్షల చెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటించారు.

ఉద్దానంలో కొబ్బరి తోటలు పరిశీలించి కాలం చెల్లిన, పాడైన చెట్లు తొలగించి పునరుద్ధరణ పథకం కింద మొక్కలు పంపిణీ చేశామని ఉద్యాన శాఖ కవిటి మండల అధికారిణి పి.మాధవీలత తెలిపారు. వాటి సంరక్షణకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# గుట్టుగా తవ్వేసి.. గుట్టలు కరిగించి

గాండ్లపెంట : జిల్లాలో మట్టి దందా ఆగడం లేదు. అక్రమార్కులు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. కొండలు, గుట్టలు, చెరువులను లక్ష్యంగా చేసుకొని భారీగా తవ్వేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అధికార యంత్రాంగానికి తెలిసినా కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. గాండ్లపెంట మండలంలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారి నుంచి వద్దిరెడ్డిపల్లి మీదుగా బోగాదమ్మ కనుమకు 2 కిలోమీటర్ల మేర రూ.కోటితో రోడ్డు పనులు ప్రారంభించారు. ఇందుకోసం గుత్తేదారుడు కదిరి–రాయచోటి ప్రధాన రహదారిలో ఉ




న్న గుట్టలను నిత్యం పొక్లెయిన్లతో తవ్వి మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. తవ్వకాలతో గుట్టలు కాస్త కనుమరుగై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై పీఆర్ జేఈ రెడ్డివరప్రసాద్ను అడగగా మండల అధికారుల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రహదారి పనుల్లో కొంత సొమ్ము మైనింగ్ అనుమతులకు తీసుకోవడం జరుగుతుందన్నారు. విషయాన్ని తహసీల్దార్ బాబురావు దృష్టికి తీసుకెళ్లగా ఎవరు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, సిబ్బందిని పంపి నిలిపి వేయిస్తామని చెప్పారు. అనుమతి పొందిన తర్వాతే మట్టి తరలింపు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# గుట్ట..గట్టు.. కనిపిస్తే ఒట్టు..!

ధవళేశ్వరం : ప్రభుత్వ స్థలాలు.. కాలువలు.. చెరువులు.. ఏమైనా సరే.. లెక్కేలేదు. తాత్కాలిక నిర్మాణాలతో పాగా వేస్తున్నారు. ఆ తర్వాత శాశ్వత నిర్మాణాలతో ఆక్రమించేస్తున్నారు. వారికి కొంతమంది నాయకుల అండదండలు ఉండటంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల సర్కారు స్థలాల ఆక్రమణలపై పరిశీలన కథనం.

**100 ఎకరాల చెరువు సైతం..**

రాజానగరం మండలం నందరాడలో 366 ఎకరాల్లోని అడుసుమిల్లి వెంకయ్య చెరువు (ఏవీ ట్యాంకు) ఆక్రమణకు గురవుతోంది. దీని పరిధిలో సుమారు 500 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఆక్రమణలపై రెండు గ్రామాల ప్రజలు అప్పటి కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి సర్వే చేశారు. సుమారు 100 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు.

**సర్కారు భూమిలో సాగు..**

కోరుకొండ మండలంలోని బూరుగుపూడి సమీపంలోని గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలుగా సేకరించిన వందల ఎకరాలు పరాయిపంచన ఉన్నాయి. బూరుగుపూడి– గుమ్ములూరు ప్రాంతాల మధ్య ఇళ్ల స్థలాలకు కేటాయించిన సుమారు 200 ఎకరాల భూమిలో ఆక్రమించి వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటితో రూ.లక్షల ఆదాయం ఆర్జిస్తున్నారు. ః కోరుకొండ– శ్రీరంగపట్నం రహదారికి



ఆనుకుని సుమారు 7 ఎకరాల భూమి ఆక్రమణలో ఉంది. కోరుకొండ గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తుందని, ఆక్రమణకు గురైందని ఫిర్యాదులు వచ్చినా నాయకుల అండదండలతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూమిని పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

**హెచ్చరికలు జారీ చేసినా..**

ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో సచివాలయం పక్కన ఖాళీ స్థలాన్ని ఓ వైకాపా నాయకుడి అండతో 70 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు నిర్మాణాలకు అనుమతులు సైతం మంజూరు చేశారు. గతేడాది రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి నిర్మాణాన్ని అడ్డుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేదు.

ధవళేశ్వరం పరిధిలోని కొత్తపేటలో ప్రభుత్వ స్థలాన్ని రాఖీ ఛానల్ను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. వీటిపై రాజమహేంద్రవరం గ్రామీణం తహసీల్దారు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

# ఉగ్గబట్టుకుంటేనే.. ఆత్మగౌరవం నిలిచేది!

కైకలూరు : స్వచ్ఛ భారత్ కల సాకారానికి, అతివల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కోచోట రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లు తాళాలతోనే దర్శనమిస్తున్నాయి. నూరు శాతం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా ప్రకటించిన పల్లెల్లో సైతం నేడు రోడ్లు, కాలువ గట్లపై బహిరంగ మల, మూత్ర విసర్జన పరిపాటిగా మారింది.

**నిర్వహణే అసలు సమస్య** సామూహిక మరుగు దొడ్ల నిర్వహణే అసలు సమస్యగా మారింది. శుభ్రపరచక పోవడం, చిన్నపాటి మరమ్మతులను నెలల తరబడి చేయక పోవడంతో వాడేందుకు వీలు లేకుండా పోతున్నాయి. శౌచాలయాలకు తాళాలు వేసి ఉండటంతో మహిళలు ఉగ్గబట్టుకోవాల్సి వస్తోంది. మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు ముందుకు సాగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ముదినేపల్లి వైవాక, వాడవల్లి, శ్రీహరిపురం నిర్మాణాలు పూర్తి చేసినా తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. పేయ్యేరులో చెత్త సంపద కేంద్రం సమీపంలోని మరుగుదొడ్డి అసంపూర్తిగా ఉంది.మండవల్లి ఎస్సీ బాలికల వసతి గృహాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు అక్కడ చిన్నారులు ఉపయోగించుకుంటున్నారు. కానీ సమీప నిర్వాసితులు వెళ్లేందుకు వీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలిదిండి గ్రామ సచివాలయంలో మరుగుదొడ్డి పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. కనీసం సచివాలయంలోని సిబ్బంది వినియోగించుకునే వీలు లేకుండా పోయింది.నూజివీడు నియోజక వర్గంలో అన్ని గ్రామ సచివాలయాల వద్ద సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఇవి గ్రామస్థుల కోసమే ఏర్పాటు చేసినట్లు వారికి తెలియకపోవడం గమనార్హం.

**అపరిశుభ్రం చేస్తున్నారు..**తాళాలు వేయకపోతే బయట నుంచి వచ్చిన వారు ఇష్టానుసారంగా వాడుతూ అపరిశుభ్రం చేస్తున్నారు. ఎవరికైనా అవసరమైతే అక్కడే ఉన్న సిబ్బందిని అడిగి వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నారు. వసతి గృహాల్లో నిర్మించిన మరుగుదొడ్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి.

# పట్టు తప్పిన మగ్గం..



తిరుపతి : జిల్లాలో చేనేత రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం కళాకారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. విపరీతంగా పెరిగిన ముడిసరకు ధరలు, బ్యాంకుల నుంచి రుణాలు అందక పోవడం, కుటుంబమంతా కష్టపడినా అరకొర ఆదాయమే మిగలడం వంటి సమస్యలు నేతన్నల బతుకులను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

**ఇదే జీవనోపాధిగా**

జిల్లాలో వెంకటగిరి, శ్రీకాళహస్తి, నారాయణవరం, సత్యవేడు చేనేతకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. వెంకటగిరిలో ప్రత్యేకంగా జాంధానీ రకాన్ని నేసే నిష్ణాతులైన కళాకారులు ఒక వీధిలోనే సుమారు 30 మంది వరకు ఉండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,000 మంది క్రియాశీలక నేతన్నలు, 2,400 మంది అనుబంధ వృత్తిదారులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.

**అంతకంతకూ పెరిగి..**

గతంలో కిలో పట్టు ధర రూ.4,500 నుంచి రూ.5,000 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.8 వేలకు చేరింది. వెండి ధరల పెరుగుదలతో చీరలకు వాడే 'జరి' ధరలూ రెట్టింపయ్యాయి. ముడిసరకుల పెరుగుదలతో ఒక్కో చీర తయారీ వ్యయం రూ.1,200 నుంచి రూ.1,500 వరకు అదనంగా పెరిగింది. రూ.7,000 పలికే సాధారణ డిజైన్ చీర ధర ఇప్పుడు రూ.8,500 దాటడంతో ట్రేడర్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

**సాయం గోరంతే..**

చేనేతకారులకు తక్కువ వడ్డీతో పెట్టుబడి సాయం అందించాల్సిన 'ముద్ర' రుణాలు ఆశించిన స్థాయిలో మంజూరు కావడం లేదు. జిల్లాలో 613 మందికి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 145 మందికి మాత్రమే అందాయి. నేతన్నలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనికి సంబంధించిన విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదని అధికారులే చెబుతున్నారు. జిల్లాలో సుమారు 48 సొసైటీలు ఉండగా, అందులో 28 మాత్రమే పనిచేస్తున్నాయి. వాటికి కూడా పాలకవర్గాలు లేవు, ఎన్నికలు జరగలేదు.

**కూలి పనులకు వెళ్తూ..**

ప్రస్తుతం చేనేతల్లో ఎక్కువ మంది 50 ఏళ్లు పైబడిన వారే. పెట్టుబడి పెరగడం, మార్కెటింగ్ లేకపోవడంతో ఇప్పటికే వెంకటగిరి ప్రాంతంలో 30 శాతం పనులు నిలిచిపోయాయి. దీనిపైనే ఆధారపడ్డ దాదాపు 2,400 కుటుంబాల పరిస్థితి దారుణంగా మారింది. నిపుణులైన కళాకారులు పొట్టకూటి కోసం టీ కొట్టుల్లో, కూలి పనుల్లో చేరుతున్నారు.

**పరిశ్రమ మనుగడే కష్టం**రోజురోజుకి పట్టు, జరీ ధరలు ఆకాశాన్ని అంటడం వల్ల కార్మికులకు పని తగ్గుతుంది. ఇదే పరిస్థితి నెలకొంటే భవిష్యత్తులో కార్మికులకు పని కూడా దొరకదు. నా చిన్నతనం నుంచి మగ్గం వేస్తున్న, ప్రస్తుతం ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు.శ్రీనివాసులు, బంగారుపేట, వెంకటగిరి

# హంద్రీ-నీవాకు మంచి తరుణం



చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లా వరప్రదాయినిగా ఉన్న హంద్రీ– నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కుప్పం బ్రాంచి కాలువ (కేబీసీ) పెండింగ్ పనులు పూర్తి చేసి కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని చెరువులను నింపుతున్నారు. అనంతరం పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని జలవనరులకూ నీరందించనున్నారు. ఇదేక్రమంలో మిగిలిన ప్రధాన, నీవా బ్రాంచి కాలువలనూ పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నిధుల కొరత ఉన్నా ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుని పనులు చేపట్టాలని నిర్ణయించారు.

**వైకాపా హయాంలో పట్టించుకోక**

2014– 19 మధ్య తెదేపా హయాంలో ప్రధాన కాలువ, నీవా కాలువలను దాదాపు 80 శాతం పూర్తి చేశారు. వైకాపా ప్రభుత్వం ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పానికి తామే కృష్ణా జలాలు అందిస్తున్నట్టు చెప్పుకోవడానికి అంతంతమాత్రంగానే చేసిన కేబీసీలోకి నీరు వదిలారు. రామకుప్పం మండలంలో సీఎం హోదాలో జగన్ నీళ్లు వదిలిన తర్వాత 10– 15 రోజులే పంప్హౌస్లు పనిచేశాయి. ఆపై ప్రస్తుత ప్రభుత్వం కేబీసీ పనులు పూర్తి చేసింది. పీలేరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలు, పుంగనూరులోని పులిచెర్ల, సదుం మండలాలకు ప్రధాన, నీవా కాలువలపైనా శ్రద్ధ తీసుకోనున్నారు.

**ఇప్పటికే శంకుస్థాపన**

నీవా బ్రాంచి కాలువ పూర్తయితేనే తిరుమలకు నీరందించే కల్యాణి జలాశయానికి కృష్ణా జలాలు చేరుకుంటాయి. చంద్రగిరి మండలం మూలపల్లి వద్ద సీఎం చంద్రబాబు ఈనెల 13న ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇందుకు రూ.126 కోట్ల వ్యయమవుతుందని పేర్కొన్నారు. తద్వారా తిరుమల, తిరుపతిలో 5 లక్షల మందికి తాగునీరుతోపాటు 1,154 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

**డిస్ట్రిబ్యూటరీలపైనా దృష్టి పెడితే**

ప్రధాన, నీవా బ్రాంచి కాలువలు పూర్తి చేస్తే చెరువుల్లోకి కృష్ణా జలాలు వెళతాయి. అదే చివరి ఆయకట్టుకు నీరందాలంటే డిస్ట్రిబ్యూటరీలనూ అందుబాటులోకి తేవాలి. అప్పుడే హంద్రీ– నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఏర్పాటుకు సార్థకత చేకూరుతుంది.

**రెండింటికి రూ.925 కోట్లు**

ప్రధాన కాలువలో పెండింగ్ పనులకు రూ.420 కోట్లు, నీవా కింద రూ.505 కోట్ల అవసరమని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు నిధులు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సమాలోచనలు చేశారు. ఈనేపథ్యంలోనే హెచ్ఎన్ఎస్ఎస్కు అటవీ భూమి సేకరణ, పునరావాసం లాంటి సమస్యలు లేనందున ఆ సంస్థ కూడా సానుకూలంగా స్పందించే అవకాశముంది. ఒక్కసారి నిధులు మంజూరైతే 10 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తద్వారా 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

# వస్తాయ్.. మరిన్ని బోగీలు

విశాఖపట్నం: కొత్త రైల్వే లైన్ల నిర్మాణంతో వాల్తేరు డివిజన్కు మహర్దశ కలగనుంది. ప్రధాన రైల్వే స్టేషన్ను 14 ప్లాట్ఫాంలకు విస్తరించనున్నారు. ప్లాట్ఫాంల కొరత వల్ల ఇప్పటి వరకు దువ్వాడ, అనకాపల్లికే పరిమితమవుతున్న ప్రత్యేక రైళ్లు... ఈ పనులు పూర్తయితే నేరుగా విశాఖ స్టేషన్కు చేరుకుంటాయి. ఫలితంగా ఎంతో మందికి ప్రయోజనం కలగనుంది.

**అలా సమస్య తీరినట్లే..**

కొత్త లైన్లు లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి విశాఖ రైల్వేస్టేషన్కు వచ్చే రైళ్లు గమ్యానికి చేరుకోవడంలో ఆలస్యమవుతోంది. కొన్ని పాసింజర్ రైళ్లను పెందుర్తి, గోపాలపట్నం, సింహాచలం స్టేషన్లలో చాలా సమయం నిలిపేస్తున్నారు. సరకు రవాణా రైళ్లకూ జాప్యం తప్పడం లేదు. అందుకే కొత్త లైన్లపై దృష్టిసారించారు. భూ సేకరణ కొలిక్కి రావడంతో పనులు ఊపందుకున్నాయి.

దువ్వాడ–ఉత్తర సింహాచలం : ఈ మార్గంలో 20.5 కిలోమీటర్లలో మూడు, నాలుగో లైన్ను రూ.302.25 కోట్లతో నిర్మిస్తారు. విజయవాడ వైపు రాకపోకలు వేగవంతమవుతాయి. ఇది అత్యంత ప్రయోజనకర మార్గం.

విశాఖ–గోపాలపట్నం: ఈ రెండు స్టేషన్ల మధ్య 15.31 కి.మీ.లలో మూడు, నాలుగో లైన్లు రూ.159.47 కోట్లతో నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో కొన్ని రైళ్లను అవుటర్లో నిలిపేస్తున్నారు. ఒకేసారి రెండు, మూడు రైళ్లు రాలేకపోతున్నాయి. కొత్త లైన్లతో ఆ సమస్య తీరుతుంది.

**పెందుర్తి– ఉత్తర సింహాచలం :** ఈ మార్గంలో 7.13 కి.మీ.లలో ఒక భారీ 'పైవంతెన మార్గం' నిర్మించనున్నారు. దీనికి సంబంధించి



సర్వే పనులు పూర్తయ్యాయి. భూసేకరణ దాదాపు పూర్తయింది. ఉత్తర సింహాచలం నుంచి దువ్వాడ వెళ్లే సరకు రవాణా రైళ్లను ఆపకుండా పంపొచ్చు. దీన్ని రూ.183.65 కోట్లతో నిర్మిస్తారు.

వడ్లపూడి– గేట్ కేబిన్ కూడలి: గంగవరం పోర్టు, విశాఖ స్టీల్ప్లాంట్ మీదుగా ఈ మార్గంలో మూడు, నాలుగో లైన్లను రూ.154.28 కోట్లతో నిర్మిస్తున్నారు. 12.5 కి.మీ. పరిధిలోని ఈ కొత్త లైన్లతో పోర్టు, స్టీల్ప్లాంట్, రైల్వే మెకానికల్ డిపోలకు ప్రయోజనం చేకూరనుంది.

8 నుంచి 14కు: ప్రస్తుతం విశాఖ స్టేషన్లో 8 ప్లాట్ఫాంలు మాత్రమే ఉన్నాయి. ఇవి ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. ఇటీవల రైల్వే బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో రైల్వేస్టేషన్ను తనిఖీ చేసి 8 ప్లాట్ఫాంలను 14కు పెంచాలని నిర్ణయించారు. రెండు రైల్వే ట్రాక్లు అదనంగా నిర్మించనున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ప్రహరీ వైపు 13, 14 నంబరు ప్లాట్ఫాంల నిర్మాణానికి మార్కింగ్ వేశారు.

# ఇనాం.. వినం..!

కోరుకొండ: ఏళ్లు గడుస్తున్నాయి.. నేతలు మారుతున్నారు.. మారిన ప్రతిసారి తమ భూముల సమస్య తీరుతుందని అనుకుంటున్నారు.. కానీ అదే కథ.. తీరని వ్యథ. ఇదీ కోరుకొండ ఆలయం పేరుతో ఉన్న ఇనాం భూముల సమస్య. భూముల క్రయవిక్రయాల నిషేధం సమస్య 12 ఏళ్లు అవుతున్నా నేటికీ తీరలేదు.

**చట్టం పరిధిలోకి రావని**

దేవస్థానం భూముల చట్టం పరిధిలోకి ఈ నిషేధిత భూములు రావనే వాదన కూడా ఉంది. నౌకరీలకు ఇచ్చిన ఇనాం భూములకు రైతువారీ పట్టాలు ఇచ్చి 1956లోనే విక్రయించుకోవచ్చని చట్టం అమల్లోకి రావడంతో క్రయవిక్రయాలు జరిగాయి. ఆ తర్వాత 2013లో సవరణ చట్టం అమల్లోకి వచ్చిన క్రమంలో కోరుకొండ భూములను నిషేధిత జాబితాలోకి తీసుకొచ్చారు. ఈ భూములు చట్టం పరిధిలోకి రావని బాధితులు కోర్టును ఆశ్రయించారు.

**గ్రామమంతా చేర్చడంతో..**



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం పరిధిలో సుమారు 1,200 ఎకరాల భూమి 2015లో నిషేధిత జాబితాలోకి చేర్చారు. ఇనాం కింద ఇచ్చిన భూములు దేవస్థానానికి చెందినవిగా నిర్ణయించి క్రయ, విక్రయాల నిషేధిత జాబితా 22ఏ రికార్డుల్లో ఎక్కించారు. అప్పటి నుంచి ఇవి రైతులు దగ్గరే ఉన్నా, వాటిని విక్రయించే హక్కు కోల్పోయారు. నిషేధిత జాబితాలోకి పంట భూములే కాకుండా కోరుకొండ గ్రామం అంతా చేర్చారు. అక్కడ నివాసం ఉంటున్న ఇళు ,, స్థలాలపై నిషేధం విధించడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అధికారికంగా క్రయ, విక్రయాలు ఆగిపోయాయి.

**వస్తే తరిమేశారు** కోరుకొండ ఆలయ భూములను పరిశీలించడానికి ఇటీవల అధికారుల బృందం వచ్చింది. తమ భూములను స్వాధీనం చేసుకోవడానికి మీరెవ రు అంటూ రైతులు అధికారులను నిలదీశారు. తమ భూముల్లోకి అడుగు పెట్టనివ్వబోమని తరిమేశారు. దీనిపై రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను సంప్రదించగా సమస్య పరిష్కారానికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే ఓ కొలిక్కి రానున్నట్లు చెప్పారు.

# దుకాణాలపై పెత్తనం.. వసూళ్ల పర్వం

కర్నూలు : శ్రీశైలంలో దుకాణాల వేలానికి కొందరు అడ్డుపడుతున్నారు. పలువురు వ్యాపారులు సిండికేట్గా మారి అతి తక్కువ ధరకు దుకాణాలు సొంతం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు వేలంలో పాల్గొనాలని భావిస్తున్నప్పటికీ వారికి ఓ స్థానిక నేత నుంచి తీవ్రమైన బెదిరింపులు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాము చెప్పినట్లు వింటే తక్కువ ధరకు దుకాణాలు ఇప్పిస్తామని సదరు నేత పలువురు వ్యాపారుల నుంచి రూ.కోటికి పైగా మామూళ్లు వసూలు చేసినట్లు చర్చ సాగుతోంది.

**ఎవరూ ముందుకు రాక..**

శ్రీశైలం ఆలయానికి అత్యంత సమీపంలో ఉన్న శ్రీలలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్లోని 127 దుకాణాలు, సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్లోని 12 దుకాణాలతో పాటు శిఖరం దగ్గరున్న ఒక దుకాణాన్ని లీజుకు ఇచ్చేందుకు ఈనెల 19, 20 తేదీల్లో వేలం నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు ఈనెల 1న ప్రకటన ఇచ్చారు. మొత్తం 140 దుకాణాల్లో మూడింటిని సొంతం చేసుకొనేందుకు వ్యాపారులు ముందుకు రాగా మిగిలిన వాటిని పాడుకోవడానికి ఒక్కరూ ముందుకు రాలేదు.

**నెలకు రూ.45 వేల అద్దె**

శ్రీశైలానికి సాధారణ రోజుల్లో 30 వేలు, సెలవులు, పర్వదినాల్లో 50 వేలు, ఉగాది, బ్రహ్మోత్సవాల సమయాల్లో లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయానికి అత్యంత సమీపంలో ఉండే శ్రీ లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్లోని దుకాణాల్లో ఎక్కువ వ్యాపారం జరుగుతుంది. దీంతో ఇక్కడి దుకాణాలకు వ్యాపారులు నెలకు రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. కాసుల వర్షం కురిపిస్తున్న ఆయా దుకాణాలను మళ్లీ సొంతం చేసుకొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఓ స్థానిక నేత ఆధ్వర్యంలో జరుగుతున్న సిండికేట్ రాజకీయం, బెదిరింపులే ప్రధాన కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భయపడి.. వెనకడుగు**

ప్రస్తుతం ఆయా దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్నవారు తమ లీజును పొడిగించుకోవాలంటే 30 శాతం అదనపు అద్దె చెల్లించడానికి అంగీకరిస్తే సరిపోతుంది. లేకుంటే ఖాళీ చేయాల్సి ఉంటుంది. కాగా స్థానిక నేతను కాదని అధిక అద్దె చెల్లించేందుకు ముందుకొస్తే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందేమోనని భయపడి మిన్నకుంటున్నారు. మరోపక్క ఆయా దుకాణాలను దక్కించుకొనేందుకు సుమారు 300 మంది డీడీలు తీశారు. వేలంలో పాల్గొందామని రూ.లక్ష చొప్పున డీడీలు తీసినవారు ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన వేలంలో ఎందుకు పాల్గొనలేదన్నది మిస్టరీగా మారింది.

**ఏటా రూ.2 కోట్ల నష్టం**

దుకాణాల అద్దె పెంచకుండా.. ప్రస్తుతమున్న అద్దెకన్నా తక్కువకు కేటాయిస్తే శ్రీశైలం దేవస్థానానికి ఏటా రూ.2 కోట్లకు పైగా నష్టం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని స్వేచ్ఛగా వేలంలో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

కొందరు నేతల నుంచి వ్యాపారులకు బెదిరింపులు ఉండటంతోనే వేలం పాటల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదని వీహెచ్పీ శ్రీశైలం ప్రఖండ్ కాశయ్య తెలిపారు.

**తక్కువకే కట్టబెట్టేలా..**బహిరంగ వేలంలో ఎవరూ ముందుకు రాలేదన్న సాకు చూపి ప్రస్తుతం ఆయా దుకాణాల్లో వ్యాపారం చేసుకుంటున్న వారికే వాటిని ఇప్పించేలా స్థానిక నేత చక్రం తిప్పుతున్నారు. ఇలా చేస్తే అందరికీ తక్కువ ధరకే దుకాణాలు వస్తాయని వ్యాపారులకు ఆశచూపారు. లేకుంటే ప్రస్తుతం చెల్లిస్తున్న అద్దెను 30 శాతం పెంచి తీసుకోవాల్సి ఉంటుందని, తాము చెప్పినట్లు చేస్తే ప్రతినెలా రూ.15 వేల వరకు తక్కువ ధరకే దుకాణం వస్తుందని చెప్పి వ్యాపారులు దుకాణాలు పాడుకోకుండా అడ్డుపడుతు న్నారు. తక్కువ అద్దెకు దుకాణం వచ్చేలా చేసేందుకు వీలుగా ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.లక్ష వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## నాయకుల ధనదాహం.. వ్యర్థాలతో ప్రాణసంకటం

పుట్టపర్తి : ఎవరేమైతే మాకేంటి.. తాము బాగుంటే చాలన్నట్లుంది పెనుకొండ మండలంలోని కొందరు నాయకుల పరిస్థితి. కియా అనుబంధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకుండా.. చెక్‌డ్యామ్‌లలో పడేస్తున్నారు. అంతేకాదు.. కాల్చివేస్తుండటంతో జల, వాయు కాలుష్యం కారణంగా ఆ ప్రాంత ప్రజలతోపాటు జీవాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యర్థాలను విభజించి ఎవరికీ హాని లేకుండా నిర్వహించాలి. ఇందుకోసం పెనుకొండ శివారులోని రొద్దం రోడ్డులో కొంత భూమిని కేటాయించారు. ఈ వ్యర్థాలు సదరు ప్రాంతానికి చేరడం లేదు.

పారిశుద్ధ్య సామగ్రి, వ్యర్థాల తరలింపు పనిని స్థానిక నాయకులు దక్కించుకుంటున్నారు. తొలి నుంచి ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే చేజిక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఆయా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను బయటకు తరలించేందుకు నెలకు రూ.6 లక్షల వరకు అందుతోంది. ఇనుము, ప్లాస్టిక్ తదితర పనికివచ్చే



వస్తువులను వేరుచేసి విక్రయించగా మరో రూ.4 లక్షల వరకు వస్తోంది.

**పర్యావరణానికి హాని** వృథ రబ్బరు, రెగ్జిన్ ముక్కలు, అట్టలు, రంగుల ఖాళీ డబ్బాలు తదితర వాటిని పెనుకొండ మండలం గొందిపల్లి సమీపాన నాగిరెడ్డికొండ, చాకలగుట్ట మధ్య ఉన్న రెండు చెక్‌డ్యామ్ లలోకి వేస్తున్నారు. వాటికి నిప్పంటిస్తుండటంతో ఆ ప్రాంతమంతా నిత్యం పొగచూరి దుర్వాసన వెదజల్లుతుంటుంది. వర్షాలు భారీగా కురిసినప్పుడు కొండవాలుల నుంచి వరద చెక్‌డ్యామ్‌లలోకి చేరి అక్కడి నుంచి కిందనున్న చెరువులోకి కలుస్తాయి. ఈ విషయంగా ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ నగకుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎంచక్కా.. ఎత్తేస్తున్నారు..!

రోలుగుంట : రోలుగుంట మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోయింది. ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి తరలించుకుపోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తాజాగా ఎం.పట్నం రెవెన్యూ పరిధిలో మట్టి మాఫియా అక్రమ తవ్వకాలకు తెరలేపారు. స్థానిక రెవెన్యూ సర్వే నం. 121-3లో వరహా నదిని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకు భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. గైరంపేట, బి.బి.పట్నం తదితర ప్రాంతాలకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థిరాస్తి వెంచర్లు, ఇళ్ల స్థలాలను చదును చేయడం, ఇంటి నిర్మాణాలకు వంటి పనుల కోసం యజమానులతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకొని పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. రెవెన్యూ



రికార్డుల్లో సర్వే నం. 121-3లోని భూమి గెడ్డ పోరంబోకుగా నమోదైంది. దీంతో ఎవరూ అడిగేవారు లేకపోవడంతో కొందరు యంత్రాలతో పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపి మట్టిని ట్రాక్టర్లకు ఎత్తుతున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే గనులశాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రాంతాన్ని పరిశీలించి ఆపై అనుమతులు జారీ చేస్తారు. ఇలాంటివేమీ ఇక్కడ కనిపించట్లేదు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 700 నుంచి రూ.800 వరకు మట్టి మాఫియా జేబుల్లో వెళుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలు ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు.

అక్రమ తవ్వకాలపై వీఆర్వో రాజులమ్మను వివరణ కోరగా ఎం..పట్నం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతం గెడ్డ పోరంబోకు పరిధిలోకి వస్తుందన్నారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

## నీటి నాణ్యత ఎంత..?

విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థకు విస్కో (విశాఖపట్నం పరిశ్రమల నీటి సరఫరా సంస్థ) ఆధ్వర్యంలో కొత్తగా 'మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీ'ని సమకూర్చారు. ఈ సంచార ప్రయోగశాల ద్వారా క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ నీటి పరీక్షలు జరిపి, నాణ్యత వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిత్యం నగర ప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు వివిధ జిల్లాల పరిధిలోని నీటి వనరుల నుంచి కిలోమీటర్ల మేర పైపులైన్లు, కాలువలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నగరానికి చేరుకునే నీటిని ముందుగా నీటి శుద్ధి కేంద్రాల్లో శుభ్రం చేస్తారు. తర్వాత అగనంపూడి, నరవ, టీఎస్సార్‌లో ఉన్న ప్రయోగశాలల్లో పరీక్షలు చేసి, రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

ప్రజారోగ్యం దృష్ట్యా: నీటిలో బురదశాతం ఎక్కువగా ఉన్నా, ఈ-కోలి బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు ఉన్నా.. నగర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నీటి శుద్ధి కేంద్రాల్లో బ్యాక్టీరియాను పూర్తిగా సంహరించి, తర్వాత రిజర్వాయర్లకు వెళ్లేటప్పుడు, అక్కడ నుంచి కుళాయిలకు విడుదల చేసే సమయంలో మరోసారి నీటి నాణ్యత పరీక్షలు చేస్తారు. అలా రోజూ 700 వరకు నీటి నమూనాలను పరిశీలించిన తర్వాతే పంపిణీ చేస్తారు. టర్బిడిటీ శాతం, పీహెచ్ స్థాయితో పాటు ఈ-కోలి తదితర బ్యాక్టీరియాలు ఏమైనా ఉన్నాయోనని పరిశీలిస్తారు.

**సునిశిత పరిశీలన..!**

మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ వాహనంలో టర్బిడిటీ (నీటిలో మట్టి), బయోలాజికల్ (సూక్ష్మజీవులు), డీఎల్ఎస్ (నీటిలో కరిగి ఉన్న రసాయనాలు) పరీక్షలు చేస్తారు. పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్- నీటిలో ఉన్న సూక్ష్మజీవులు) శాతం 0.5 నుంచి 2 మధ్యలో ఉంటే సురక్షితమని, లేని పక్షంలో నీరు కలుషితం అయిందని నిర్ధారిస్తారు. ఆ మేరకు అవసరమైన చర్యలు చేపడతారు. ఇలా నగరంలో వివిధ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, ఆ నివేదికలను పర్యవేక్షక ఇంజినీర్ పల్లంరాజుకు అందిస్తామని నిర్వహణ సిబ్బంది తెలిపారు. శుద్ధజలం ప్రజలకు అందేలా చూడడమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు.

## మెగా సామూహిక బిందుసేద్యానికి అడుగులు



ఉరవకొండ : దేశంలో ఎక్కడా లేని విధంగా శాస్త్ర సాంకేతికతతో ప్రయోగాత్మకంగా చేపట్టిన మెగా సామూహిక బిందు సేద్య పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వేలాది ఎకరాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో 2018లో తెదేపా ప్రభుత్వం రూ.890 కోట్లతో పథకాన్ని చేపట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పథకాన్ని ఆపేసింది. పథకం పూర్తయితే ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని 50వేల ఎకరాలకు బిందుసేద్య విధానంలో సాగునీరు అందనుంది. దీని కోసం హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ నుంచి 1.67 టీఎంసీలు వినియోగించుకోనున్నారు. పీఏబీఆర్ కుడివైపు కూడేరు మండలంలో 12,982 ఎకరాలు, ఎడమవైపు ఉరవకొండ, కూడేరు మండలాల్లో 12,732 ఎకరాలు, జీడిపల్లి జలాశయం నుంచి బెళుగుప్ప మండలంలో 12,605 ఎకరాలు, ఎంపీఆర్ జలాశయం నుంచి ఉరవకొండ మండలానికి 12,185 ఎకరాలకు సాగునీటిని అందించాలన్నది లక్ష్యం.

ఒక జోన్‌లో 400 ఎకరాలు ఉండే విధంగా 30 జోన్లను ఏర్పాటు చేశారు. కాలువ ద్వారా నీళ్లు సంపులోకి, అక్కడి నుంచి ఫిల్టర్లు ఉన్న కంట్రోల్ గదికి చేరిన తరువాత నెట్‌వర్క్ ద్వారా నీటిని పంపు చేసే విధంగా డిజైన్ చేశారు. పథకం ద్వారా 13వేల మంది రైతులు లబ్ధి పొందనున్నారు.

**40శాతం మేర పూర్తి** పథకం పనులను 2019లో ప్రారంభించారు. తొలి దశ కింద దాదాపు రూ.90 కోట్లతో 25వేల ఎకరాలకు సరిపడేలా బిందుసేద్య సామగ్రిని కొనుగోలు చేశారు. దీన్ని ఉరవకొండ మండలం ఆమిద్యాల వద్ద భద్రపరిచారు. కూడేరు మండలం కొర్రకోడు, ముద్దలాపురం, జల్లిపల్లి, చోళసముద్రం గ్రామాల్లో పైపులైన్లు, పంపింగ్ గదుల నిర్మాణాలను చేపట్టారు. దాదాపు 40శాతం మేర పనులు పూర్తయ్యాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లు పనులను చేపట్టకపోవడంతో పొలాల్లోని సామగ్రి చోరీకి గురైన సందర్భాలు ఉన్నాయి. ఆమిద్యాల వద్ద నిల్వ ఉన్న 80వేల కిలోమీటర్ల పైపులు, ఇతర సామగ్రి నిల్వ ఉన్నాయి. ప్రస్తుతం ఉపయోగించవచ్చా.. లేదా? నాణ్యత ఉందా? అన్నది తేలాల్సి ఉంది. నిర్ధారణ కోసం నమూనాలను పరీక్షలకు పంపారు. ఫలితాలు వస్తే పథకాన్ని ప్రభుత్వ అనుమతితో తిరిగి ప్రారంభించేందుకు హంద్రీనీవా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ మాట్లాడుతూ... సామగ్రి నాణ్యత నిర్ధారణ కాగానే మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో వీలైనంత త్వరగా పథకం పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు.

## తనిఖీలు తూచ్..!



కుప్పం : కుప్పం-కేజీఎఫ్ అంతర్రాష్ట్ర మార్గంలో.. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని పాపురం వద్ద మూతపడిన చెక్‌పోస్టు ఇది. శాంతిపురం మండలంలో రాళ్లబూదుగూరు.. కుప్పం నుంచి గెసికపల్లె మీదుగా కర్ణాటకకు ఉన్న డబుల్‌రోడ్డు కూడలిలోని తనిఖీ కేంద్రం అలంకారప్రాయంగా మిగిలింది. సదరు రహదారి అక్రమ రవాణాకు రాచమార్గంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో వైకాపా ప్రభుత్వం ప్రచార్భాటంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. త్రిరాష్ట్ర కూడలి కావడంతో.. అంతరాష్ట్ర మార్గాలతోపాటు గ్రామీణ రహదారుల్లోనూ తనిఖీ కేంద్రాలను నెలకొల్పారు. దాదాపు 50 చోట్ల చెక్‌పోస్టులు. సీసీ కెమెరాలకు రూ.లక్షల్లో ప్రభుత్వ నిధులను ఖర్చు చేశారు. సిబ్బందికి నెలనెలా రూ.లక్షల్లో వేతనాలు చెల్లించారు. దాదాపు రెండేళ్ల పాటు కొనసాగిన చెక్‌పోస్టులు నిర్వహణ లేమితో మూతపడ్డాయి. సీసీ కెమెరాలు చోరుల పాలయ్యాయి. ఇనుప షెడ్లు తుప్పు పడుతున్నాయి.

రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గ్రానైట్‌తో పాటు కలప, ఇసుక తదితర సహజ వనరులతో పాటు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడని స్థితి ఏర్పడింది. అటవీశాఖ, మార్కెట్ కమిటీల తరఫున తనిఖీ కేంద్రాలు కూడా లేకపోవడం అక్రమార్కులకు వరంలా మారింది. పొగాకుకు సంబంధించి రూ.లక్షల విలువైన గుట్కా ఉత్పత్తులను దర్జాగా తీసుకొస్తున్నా.. పట్టించుకునే నాథుడు కరవయ్యాడని స్థానికులు అంటున్నారు.

**అక్కడ నిరంతర నిఘా**

తమిళనాడు, కర్ణాటక పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వం ఎక్సైజ్, అటవీ, వాణిజ్య, ఆర్టీఏ శాఖల తరఫున తనిఖీ కేంద్రాల నిర్వహణను పటిష్ఠంగా కొనసాగిస్తోంది. నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పలమనేరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో కుప్పం సమీపంలోని.. తమిళనాడు పరిధి గొరివినాయనిపల్లె వద్ద తనిఖీ కేంద్రం ఉంది. పలమనేరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర మార్గంలో సామచేను మిట్ట, వి.కోట-పేర్నంబట్టు రహదారిలో బత్తలపల్లె వద్ద తమిళనాడు చెక్‌పోస్టులున్నాయి.

## కలల సౌధం.. ఎట్టకేలకు సాకారం!



విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపీఈ) విద్యార్థుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో శాశ్వత ప్రాంగణంలో అడుగుపెట్టారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి సమీపంలోని శాశ్వత ప్రాంగణంలో సోమవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. పచ్చటి ప్రకృతి నడుమ, ప్రశాంత వాతావరణంలో యూనివర్సిటీ భవనాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునిక విద్య, పరిశోధన సౌకర్యాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల నిర్వహణకు వసతులు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై పూర్తిగా శాశ్వత ప్రాంగణంలోనే తరగతులు జరుగుతాయి. విద్యా కార్యక్రమాలకు అవసరమైన భవన నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ భవనం, ఉద్యోగుల కోసం కేటాయించిన నివాస సముదాయం నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది.

2016 నుంచి తాత్కాలిక ప్రాంగణంలో: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 2016లో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐఐపీఈని స్థాపించారు. ఇప్పటి వరకు విశాఖ నగరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక క్యాంపస్‌లో తరగతులు నిర్వహించారు. పెట్రోలియం, ఎనర్జీ రంగాల్లో నాణ్యతతో కూడిన విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. వంగలి గ్రామంలో ఈ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా 201.80 ఎకరాలను కేటాయించింది. భూమికి సంబంధించి న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో నిర్మాణం ఆలస్యమైంది. వీటిపై ఏపీ హైకోర్టు నిర్ణయం వెలువరించిన తర్వాత 2023 మార్చిలో ఈ భూమి ఐఐపీఈ చేతుల్లోకి వచ్చింది. అప్పటి నుంచి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

2016: స్థాపించిన సంవత్సరం

విస్తీర్ణం: 201 ఎకరాలు

విద్యార్థులు: 600కు పైగాఅంచనా వ్యయం: రూ.855 కోట్లు

ఖర్చు చేసింది: దాదాపు రూ.400 కోట్లు

అదనంగా మరో రూ.150 కోట్లు ప్రయోగశాలలు, ఫర్నీచర్, మౌలిక సదుపాయాలకు ఖర్చు చేశారు.

## అప్పుడు ప్రాజెక్టులా.. ఇప్పుడు అడవిలా..

హిందూపురం :ఉమ్మడి మైసూరు రాష్ట్రం ఉన్నప్పుడు హిందూపురం సమీపంలో 1952లో పెన్నార్ కుముద్వతీ ప్రాజెక్టు నిర్మించారు. కర్ణాటక ప్రాంతం నుంచి పెన్నానది, కుముద్వతీ నదులు వర్షాకాలంలో ప్రవహిస్తున్నందున ఈ రెండు నదుల పేర్లు కలిసేలా ప్రాజెక్టు నిర్మించారు. వీటి నుంచి చెరువులకు నీరు చేరేలా కుడి, ఎడమ కాలువలు తవ్వించారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉండేది. 25 సంవత్సరాలుగా పాలక ప్రభుత్వాలు చాలీచాలని నిధులు మంజూరుచేస్తూ అడపదడపా మరమ్మతులు చేసినా శాశ్వత పరిష్కారం లేనందున ప్రాజెక్టు లోపల, బయట ఉన్న కాలువల్లో కంపచెట్లు పెరిగి ప్రాజెక్టు నిజస్వరూపాన్నే కోల్పోయి అటవీ ప్రాంతం ఛాయలు అలుముకున్నాయి. పునరుద్ధరణకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. చిన్ననీటిపారుదలశాఖ డీఈ శైలేశ్వర్ మాట్లాడుతూ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం, ఏప్రిల్‌లో మంజూరయ్యే ఆస్కారముందన్నారు.

## 'అ'క్షరం.. 'ఆ'మెకు తోడు..!

విశాఖపట్నం : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అవుతుంది. కాని ఇప్పటికీ చాలా మంది మహిళలకు చదవడం, రాయడం రాదు. అలాంటి వారికి అక్షర జ్ఞానం అందించేందుకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పర్యవేక్షణలో వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్యవర్మ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాలు నేర్పించే కసరత్తు జరుగుతుంది.

**ప్రాథమిక అవగాహన**

మహిళలు కనీసం చదవడం, రాయడంతో పాటు, నగదు లెక్కలు, డిజిటల్ లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం



ఆధ్వర్యంలో గత సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా 'ఉల్లాస్' పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించారు. ఆ కార్యక్రమాన్ని రాష్ట్రంలో 'అక్షరాంధ్ర' పేరిట అమలు చేస్తున్నారు.

**వాలంటీర్లతో శిక్షణ**

ముందుగా డీఆర్‌డీఏ, మెప్మా శాఖల ద్వారా పథకాలు పొందుతున్న మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించారు. రోజూ ఓ గంటసేపు చొప్పున, మొత్తం వంద గంటలు బోధన కొనసాగిస్తారు. కొందరు వాలంటీర్లకు బోధన విధానాలపై అవగాహన కల్పించి, ఇప్పుడు వారి ఆధ్వర్యంలోనే శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు ఎన్‌సీఈఆర్‌టీ ముద్రించిన మెటీరియల్ అందించారు. కోర్సులు పూర్తి చేసిన వారికి పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

## వారధి పూర్తి.. అవస్థలకు స్వస్తి

పాలకొండ : ఎట్టకేలకు చీపురుపల్లి వద్ద రైల్వే వంతెన నిర్మాణం పూర్తయింది. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో నాలుగేళ్ల క్రితం రాకపోకలు నిలిపేశారు. పాలకొండ డిపో నుంచి విశాఖ, విజయనగరం వెళ్లే బస్సులు చాలా వరకు రద్దు చేశారు. రాజాం, చిలకపాలెం మీదుగా విశాఖకు ప్రత్యామ్నాయంగా నడుపుతున్నారు. దీంతో విజయనగరం వెళ్లాలంటే మూడు బస్సులు మారాలి. కూటమి రాకతో పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి తాత్కాలికంగా రాకపోకలకు అనుమతిలిచ్చారు. త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**నిలిపివేతతో ఆర్టీసీకి నష్టం..**

గతంలో పాలకొండ ఆర్టీసీ డిపో పరిధిలో నైట్ హాల్ట్‌లతో కలిపి విశాఖకు 49 బస్సులు నడిచేవి. రోజూ రూ.14 లక్షల మేర ఆదాయం వచ్చేది. గతంలో వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 10 వరకు విశాఖకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉండేది. ఇప్పుడు గంటకు ఒకటి వస్తోంది. దీనివల్ల సమయానికి గమ్యస్థానం చేరలేక పోతున్నారు.



ప్రస్తుతం కొన్ని రద్దు చేసి, 18 మాత్రమే ప్రత్యామ్నాయ మార్గంలో నడుపుతుండడంతో ఆదరణ తగ్గింది. ఫలితంగా రూ.12 లక్షల వరకు ఆదాయమే సమకూరుతోంది. రోజూ రూ.2 లక్షల మేర కోల్పోయింది. ఇలా ఈ నాలుగేళ్లలో రూ.కోట్లమేర నష్టపోయింది.

**సంక్రాంతికి ఊరట**

పాలకొండ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం నివాసం ఉంటున్నవారు అధికంగా ఉన్నారు. వీరంతా సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారు. వంతెన పూర్తై తాత్కాలికంగా రాకపోకలు చేస్తుండడంతో ఈ ఏడాది ఇక్కట్లు తప్పనున్నాయి.

**పూర్తిస్థాయిలో నడుపుతాం..**

చీపురుపల్లి వంతెన ప్రారంభమైన తక్షణమే విశాఖకు యధావిధిగా సర్వీసులు పునరుద్ధరిస్తాం. ఈ మార్గంలో ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తుంది. అందువల్ల ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం. పి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

## చెయ్యేరులో పాపాల భైరవులు

కడప: చిత్రంలో కనిపిస్తున్నవి పొలాలనుకుంటే పొరపాటు. చెయ్యేరు నదిలోని బాలరాజుపల్లె రేవు ప్రాంతం. రాజంపేట మండల పరిధిలోని ఈ రేవు ఇసుకాసురుల పాలిట స్వర్గధామంగా మారింది. ఓ వైపు వరద నీటి ప్రవాహం సాగుతున్నప్పటికీ సమీపంలోని కొండలో మట్టి తవ్వి తెచ్చి నదిలో ఏకంగా రహదారే నిర్మించారు. భారీ వంతెనకు సమీపంలోనే యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. రాయచోటి-రాజంపేట ప్రధాన రహదారిపై ఉన్న వంతెన కింద యథేచ్ఛగా ఇసుక తవ్వేస్తున్నారు. సమీపంలోనే రాయచోటికి తాగునీటి పంపింగ్ కేంద్రంతో పాటు రోళ్లమడుగు ప్రాజెక్ట్ ఉంది. అయినా సాగిస్తున్న ఇసుక తవ్వకాలతో పథకాలకు ముప్పు పొంచి ఉంది.

రాజంపేట నియోజకవర్గంలోని బాలరాజుపల్లె రేవులో గుంటూరుకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపట్టారు. అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తులు తమ చేతికి మట్టి అంటుకోకుండా ఈ దందాను పొరుగువారితో సాగిస్తున్నారు. ఈ రేవు నుంచి నిత్యం చెన్నై, బెంగళూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. మార్గమధ్యంలో పలుమార్లు పట్టుబడినా రవాణా ఆగడం లేదు. ఇది వరకు అన్నమయ్య జిల్లా పర్యవేక్షణలో ఉన్న ఈ రేవుకు ఆ జిల్లాకు చెందిన కొందరు అధికారులు అన్ని రకాలుగా సహకరించి అక్రమాల్లో భాగస్వాములయ్యారనే ఆరోపణలున్నాయి. జిల్లా పునర్విభజన నేపథ్యంలో వైఎస్సార్ కడపలోకి ఇటీవల బాలరాజుపల్లె రేవు చేరింది. జిల్లా మారిపోయినా అక్రమార్కులు తమ పంథలోనే ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తవ్వి తరలించి జేబులు నింపుకొంటున్నారు. రేవుకు సమీపంలోని భారీ వంతెనకు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. సమీపంలోని రైతుల పొలాలకు నష్టం వాటిల్లుతున్నా., రాయచోటి తాగునీటి ప్రాజెక్ట్‌కు ముప్పు వాటిల్లేలా తవ్వేస్తూనే ఉన్నారు.

**మాకు సమాచారం లేదు**

అక్రమ తవ్వకాలపై బాలరాజుపల్లె రేవులో ఇసుక తవ్వకాలపై మాకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో తవ్వకాలు చేస్తున్న వ్యక్తులతో డిసెంబరులో మాట్లాడగా చేయడం లేదని చెప్పారు. ఇప్పుడు మరలా తవ్వకాలు సాగిస్తున్న విషయ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జయచంద్రారెడ్డి, ఈఈ, జల వనరుల శాఖ

చురకలు



## ఏడేళ్లు.. కలగానే సొంతిల్లు..!

కవిటి : హుద్‌హుద్ ఇళ్లు నిర్మించి ఏడేళ్లు దాటినా ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు కేటాయింపు జరగని దుస్థితి. నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకున్న వారే లేరు. 2014లో హుద్‌హుద్ తుపాను బాధితుల కోసం ఎన్టీఆర్ ప్రత్యేక గృహ నిర్మాణ పథకం ద్వారా 448 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి పనులను అప్పటి ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శ్యాంసుందర శివాజీ, రాష్ట్ర మంత్రి .అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కింద భాగం, మొదటి అంతస్తు భవనాలతో ఒక్కో ఇల్లు రూ.4 లక్షల వ్యయంతో రెండేళ్ల లో పూర్తి చేశారు. 2019లో ఎన్నికలు రావడం, అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని



వదిలేశారు. ఫలితంగా ఇళ్లు వృథగా మిగిలిపోయాయి.

**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు**

గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఆ కట్టడాలు దయనీయంగా తయారయ్యాయి. భవనాల తలుపులు, కిటికీలు, విద్యుత్తు పరికరాలు చోరీకి గురయ్యాయి. పరిసరాలు పనికిరాని మొక్కలు, పొదలతో దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రహదారులు, కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. ఇతర గృహ నిర్మాణ పథకాలు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారు.పాలకులు చొరవ తీసుకుంటేనే న్యాయం జరుగుతుందని వారంతా పేర్కొంటున్నారు. 'నిర్మాణాలు పలుచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం' అని గృహ నిర్మాణ సంస్థ డీఈ వీవీ సత్యజీ తెలిపారు.

## పల్లె 'గొంతు'తడపాలని..!

కవిటి : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని పలు గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా నిమిత్తం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రణాళిక చేశారు. మార్కాపురం జిల్లాలోని పలు మండలాల్లో జనవరి నెలాఖరు నుంచే తాగునీటి సమస్య తలెత్తనుంది. ఇప్పటికే బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. నీటి వనరుల లభ్యత లేక కొన్ని ఆవాస ప్రాంతాల్లోని రక్షత తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారాయి. ఏటా దొనకొండ మండలంతో పాటు మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ మండలాల్లోని గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది యర్రగొండపాలెం ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతోపాటు ఎన్ఎస్‌పీ కాలువ ద్వారా సాగర్ జలాలు సమృద్ధిగా విడుదల చేయడంతో సీపీడబ్ల్యూ పథకాలకు చెందిన చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత వాసులకు మే నెలాఖరులోగా ట్యాంకర్లతో సరఫరా అవసరం ఉండకపోవచ్చునని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది. ఈ ఏడాది మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతోపాటు దొనకొండ మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు



తాగునీటిని సరఫరా చేయనున్నారు. మొత్తం 35 గ్రామాల్లో సరఫరా నిమిత్తం రూ.1.12 కోట్ల నిధులతో అంచనా తయారు చేసి కలెక్టర్ ఆమోదం నిమిత్తం ప్రతిపాదించారు. ఆయా మండలాల్లో వేసవిలో వడగాలుల తీవ్రత పెరిగే కొద్ది మార్చి నెలాఖరుకల్లా తాగునీటి సమస్య మరింత తీవ్రతరం కానుంది

**నిరుపయోగంగా 5,222 బోర్లు**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,345 తాగునీటి బోర్లు ఉండగా నీటి వనరుల లభ్యత లేని కారణంగా అందులో ఇప్పటికే 5,222 బోర్లు ఎండిపోయాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని బోర్ల మరమ్మతులు చేపట్టేందుకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 15వతేదీలోగా క్రాష్ కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళిక చేశారు. జిల్లాలో రక్షత తాగునీటి పథకాలు, మినీ రక్షత తాగునీటి పథకాలు, డైరెక్ట్ పంపింగ్ పథకాల కింద మొత్తం 4,655 ఉండగా, అందులో ప్రస్తుతం 697 తాగునీటి పథకాల నీటి వనరులు పూర్తిగా ఎండిపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రత్యేకించి పశ్చిమ ప్రకాశం మండలాల్లో చేతి పంపులకు పూడికతీత కార్యక్రమం చేపడుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండడంలేదు.

## అరటి రైతు.. 'ధర' హాసం

త్రిపురాంతకం : జిల్లాలోని అరటి రైతుల్లో 'ధర'హాసం నెలకొంటోంది. నెల క్రితం ధరతో పోల్చితే టన్నుకు మూడింతలు పెరగడం, ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోకంటే ఈసారి పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. **పశ్చిమ ప్రకాశంలోనే ఎక్కువ**

ఉమ్మడి ప్రకాశం కింద అరటి సాగు ఎక్కువగా పశ్చిమ ప్రకాశంలోనే ఉంది. మార్కాపురం జిల్లా ఏర్పడిన తరువాత అరటి సాగు లెక్కల్లోకి తీసుకుంటే 2,000 ఎకరాలుగా ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఇక ఉమ్మడి ప్రకాశం కింద చూస్తే ఇంకో 300 ఎకరాలు ఉంటుందన్నారు.

ఉమ్మడి ప్రకాశం కింద ఉన్నప్పుడు రైతులు అరటి రైతులు కొనుగోళ్లు, విక్రయాలకు తప్పనిసరిగా జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్తగా జిల్లా ఏర్పడటంతో స్థానికంగా కొనుగోళ్లకు అవకాశం కలుగుతుందని కొందరు రైతులు పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలంలోని గాంధీనగర్, సోమేపల్లి, మేడపి తదితర గ్రామాలతో పాటు యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్ద దోర్నాల, గిద్దలూరు, కంభం, రాచర్ల, కొమరోలు మండలాల్లో అరటి సాగు ఎక్కువగా ఉంటోంది. ఒక్కో కోతకు 15 నుంచి 30 టన్నుల దిగుబడి అరటి సాగుకు ఎకరానికి రూ.1.5లక్షలు ఖర్చవుతోంది. మొక్కలు నాటిన 11 నెలలకు మొదటి కోత లభిస్తుంది. ఒక్కో కోతకు 15 నుంచి 30 టన్నుల మేర దిగుబడి వస్తుంది. నాలుగు నెలల నుంచి టన్ను రూ.5వేలకు మించి పలక లేదు. డిసెంబరు ఆఖరు నుంచి ధర నెమ్మదిగా పెరుగుతోంది. ప్రస్తుతం టన్ను రూ.18వేల వరకు ఉండగా వ్యాపారులు మార్కెట్ మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ రూ.14వేలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రెండో కోతలు జరుగుతున్నాయి. కొత్తగా నాటిన తోటలు ఫిబ్రవరి నుంచి మొదటి కోతలు ప్రారంభం కానున్నందున పంటకు అధిక ధర లభించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ సమయంలో దళారుల జోక్యం పెరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## చూస్తుంటాం.. తవ్వేసుకోండి.. తోలేసుకోండి



ఏలూరు : ద్వారకాతిరుమల మండలంలో పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని కంకర మాఫియా యథేచ్ఛగా కొల్లగొడుతోంది. భవిష్యత్తులో ఎక్కడైనా గట్టు బలహీనపడితే పునరుద్ధరించటానికి జల వనరుల శాఖ కాలువ పొడవునా ముందస్తుగా సిద్ధం చేసిన మన్నును తినేసి రూ.కోట్లు గడిచింది. ఇంత జరుగుతున్నా యంత్రాంగం చోద్యం చూస్తోంది. వైకాపా హయాంలోనే చాలా వరకు ఆ పార్టీ నేతలు మట్టి గుట్టలను కరిగించి భారీగా సొమ్ము చేసుకున్న సంగతి విదితమే. మిగిలిన కొద్దిపాటిని ప్రస్తుతం తరలిస్తున్నారు. కొందరు కాలువ భూములు చదును చేసుకుని సేద్యం చేసుకుంటున్నా యంత్రాంగం చేష్టలుడిగి కూర్చోవటంపై విమర్శలొస్తున్నాయి.

**కన్నెత్తి చూడని యంత్రాంగం..**

గుణ్ణంపల్లి, నారాయణపురం, ఎం.నాగులపల్లి పంచాయతీల పరిధిలో గట్టు వెంబడి ఉన్న గుట్టల వద్ద జరిపిన లోతైన తవ్వకాలను పరిశీలిస్తే కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల మేర తరలిపోయిందనేది స్పష్టమవుతోంది. దీనికి రాయల్టీ, సీనరేజీ, అపరాధ రుసుములు విధిస్తే ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ఆ విషయం తెలిసినా గనుల శాఖ స్పందించడం లేదు. జల వనరుల శాఖ మొక్కుబడి ఫిర్యాదులతో సరిపుచ్చుతోంది. ఒకవేళ ఫిర్యాదు చేసినా పోలీసులు యంత్రాలు, లారీలను స్వాధీనం చేసుకునే పరిస్థితి లేదంటున్నారు. కారణం మట్టి మాఫియాకు ఓ ప్రజాప్రతినిధి అండగా నిలవడమేనని వినికిడి.

**కళ్ల ముందే లారీలు పోతున్నా..**

నిత్యం రాత్రి పూట ప్లొయిన్లు పెట్టి పదుల సంఖ్యలో లారీల్లో మట్టి నింపి నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమహేంద్రవరం తరలిస్తుంటే ఏ ఒక్క లారీని ఆపి అపరాధ రుసుంలు విధించిన పాపాన పోలేదు. స్థానికులు ఎవరైనా సొంత అవసరాల కోసం ఓ ట్రాక్టర్ మట్టి తెచ్చుకుంటే అనుమతులు లేకుండా ఎలా తీస్తుళతారని ప్రశ్నించి ఇబ్బంది పెడుతున్నారు. మట్టి తరలించే లారీలతో కాలువ గట్టు మీదుగా ఆయా గ్రామాలకు రాకపోకలు కష్టంగా ఉంటున్నాయని స్థానికులు అంటున్నారు.

మట్టి తరలింపుపై ఆ ప్రాంత జల వనరుల శాఖ ఏఈ బాబాజీని వివరణ కోరగా 'మట్టి తరలిస్తున్న మాట వాస్తవం. ఇంతకు ముందే గుర్తించి గనుల శాఖకు తెలియజేశాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. తవ్వకాలు చేస్తున్న ప్లొయిన్లను ఒకసారి స్వాధీనం చేసుకుంటే వాటి నిర్వాహకులు జీవనోపాధి దెబ్బతీశారని నాపైనే ఫిర్యాదు చేశారు' అని చెప్పారు. బాధ్యులైన అన్ని శాఖలతో కలిసి మట్టి తరలింపును నిలువరిస్తామన్నారు.

## ముక్క తగ్గనంటోంది.. ముద్ద దిగనంటోంది




తణుకు : మాంసాహార ప్రియులకు కోడి మాంసం ధర చుక్కలు చూపిస్తోంది. కొన్ని నెలలుగా పెరుగుతూ కొత్త సంవత్సరంలో కిలో రూ.300 దాటింది. కార్తిక మాసంలో బ్రాయిలర్ స్కిన్‌లెస్ రూ.240 ఉండగా క్రిస్మస్ నాటికి రూ.280కు చేరుకుంది. ప్రస్తుతం రూ.320 పలుకుతోంది. లైవ్ అయితే రూ.180 వరకు అమ్ముతున్నారు. మాంసాహారుల్లో జిల్లాలో అధికం శాతం మంది బ్రాయిలర్ మాంసాన్ని తింటారు. ఇప్పటికే ఓ వైపు గుడ్డు వెల రికార్డులు సృష్టిస్తుంటే మరో పక్క మాంసం ధరకు రెక్కలు రావడంతో మాంసాహార ప్రియులకు ముద్ద దిగడం లేదు.మేత ధరలు పెరుగుదల, వ్యాధులతో రైతులకు గిట్టుబాటు కాక ప్రస్తుతం ఒకటి నుంచి 2 శాతానికి కోళ్ల పెంపకం పడిపోయింది. ప్రస్తుతం లక్ష కోళ్లు పెంచుతున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గిపోయి గిరాకీ పెరగడంతో ఇంటిగ్రేషన్ కంపెనీలు అమాంతంగా ధరలు పెంచేశాయని వ్యాపారులు చెబుతున్నారు.

**పెరిగిన గిరాకీ..**

వరుస పండగలతో కోడి మాంసానికి గిరాకీ పెరిగింది. కార్తిక మాసంలో విక్రయాలు కొంత డీలా పడినప్పటికీ నెల వ్యవధిలో రూ.100 పెరిగి కొండెక్కి కూర్చుంది. ముఖ్యంగా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు నెలలో భారీ స్థాయిలో విక్రయాలు సాగాయి. అనంతరం నూతన సంవత్సరంలో సైతం అదే ఒరవడి కొనసాగింది. ఇంటిగ్రేషన్ కంపెనీల వద్ద కోళ్లు తగ్గిపోవడంతో సరఫరా లేక ధరలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి ఉండడంతో మరింత పెరిగే ఆస్కారం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో గతంలో 20 నుంచి 30 శాతం మంది రైతులు సుమారు 10 లక్షల వరకు బ్రాయిలర్ కోళ్లను పెంచేవారు.

## 'ధర'ణికి దక్కని పరిహారం



కర్నూలు : రెవెన్యూ, రైల్వే అధికారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచారు. ఇచ్చే పరిహారమే తక్కువ.. అదీ చెల్లించకుండా అంతులేని కాలయాపన చేస్తున్నారు. రైల్వే అవసరాల కోసం చిప్పగిరి మండలంలో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సర్వే నంబర్లు 709/3, 711/3, 712/3, 713/ఏ2, 713/బి1, 726/1, 727/1, 729/ఏ1, 730/1లోని 36.42 ఎకరాల భూమిని 2019లో సేకరించారు. ఆయా భూములు గుంతకల్లు పట్టణానికి కిలోమీటరు దూరంలోనే ఉన్నాయి. అప్పట్లోనే అక్కడ ఎకరా రూ.15 లక్షలు పలికింది. ఎకరాకు రూ.3.59 లక్షలే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో రైతులు హతాశులయ్యారు. విధిలేక కొందరు రైతులు పరిహారం తీసుకొన్నారు. మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు.

**న్యాయస్థానం చెప్పినా** పరిహారం నిర్ణయించడంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు.. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయించడంతో భారీగా నష్టపోవాల్సిన దుస్థితి తలెత్తిందని ముగ్గురు రైతులు న్యాయస్థానం మెట్లెక్కారు. రైతులకు న్యాయం చేయాలని కోర్టు తీర్పులు ఇచ్చాయి. దీంతో అధికారులు దిగొచ్చి ఎకరాకు రూ.12 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. పరిహారం చెల్లించడంలో అధికారులు అంతులేని జాప్యం చేస్తుండడంతో బాధితులు 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన సుప్రీంకోర్టు నిర్ణీత కాల వ్యవధిలో రైతులకు న్యాయం చేయాలని 2024 ఏప్రిల్‌లో తీర్పునిస్తూ.. కేసును హైకోర్టుకు రెఫర్ చేసింది. దీంతో హైకోర్టు న్యాయమూర్తి తీర్పునిస్తూ ఆ భూసేకరణకు తాజాగా ప్రకటన ఇచ్చి మెరుగైన పరిహారం చెల్లించాలని అదే ఏడాది నవంబరులో తీర్పునిచ్చారు. ఆ తీర్పు వచ్చి సంవత్సరం గడిచినా నేటికీ అదిగో ఇదిగో అంటూ తాత్సారం చేస్తున్నారు.

**అధికారుల కుమ్మక్కు** చిప్పగిరి గ్రామంలో రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం భూములు సేకరించి రైల్వే అధికారులు ఎకరానికి రూ.22లక్షలు ఇవ్వడం గమనార్హం. ఒకే గ్రామంలో కొందరికి భారీగా పరిహారం ఇచ్చి... మరికొందరికి అతితక్కువగా చెల్లించడమేంటని రైల్వే అధికారులను నిలదీసినా.. అది మీకు వర్తించదంటూ అడ్డగోలుగా వాదిస్తుండటంతో భూములిచ్చిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రెవెన్యూ అధికారులు ఎంత సిఫార్సు చేస్తే అంత మొత్తాన్ని చెల్లిస్తామని రైల్వే అధికారులు చెబుతుండగా.... ఎకరానికి రూ.12 లక్షలకు మించి ఇవ్వొద్దని రైల్వే అధికారులే తమతో పేర్కొంటున్నారని రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు. పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో నష్టపరిహారం నిర్ణయానికి అధికారిక సంప్రదింపులు జరిపినప్పటికీ బాధితులకు చట్టప్రకారం ఆమోదయోగ్యమైన ధరను ఖరారు చేయలేదు. సమీప సర్వే నంబరులో తాజాగా విక్రయమైన ధరను ప్రామాణికంగా తీసుకుని పరిహారం చెల్లించాలని చట్టం స్పష్టంగా చెబుతున్నా.. దానిని అధికారులు పట్టించుకోవడం లేదు.రైతులకు తీవ్ర అన్యాయం పి.ప్రసాద్, చల్లా గీతాదేవి, చల్లా సుబ్బమ్మ, గుంతకల్లు కొట్టాలరైల్వే అధికారులు చిప్పగిరిలోని అత్యంత విలువైన 36.42 ఎకరాల భూమిని సేకరించి మూడేళ్ల కిందటే అదనపు ఎస్.ఎస్.ట్యాంకు నిర్మాణం పూర్తిచేశారు.

## చెక్ పోస్టులు రద్దు.. అక్రమాలదే పొద్దు

మదనపల్లె : ఒక వైపు నిఘా, పర్యవేక్షణ ఉన్నా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నియంత్రించడం కష్టమవుతుంది. అలాంటిది ఈ రెండు లేకపోతే ఇక అక్రమార్కులకు అడ్డూ అదుపు ఉండదు. చట్ట విరుద్ధంగా అక్రమ రవాణాకు పాల్పడే వారిని కట్టడి చేయడానికి రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నేడు అవి మూతపడటంతో అక్రమ రవాణాకు అడ్డులేకుండా పోయింది. రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా ప్రకృతి సంపద, నిషేధిత వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు సరిహద్దులు దాటిపోతున్నాయి. జీరో వ్యాపారం చేసుకునే వారి ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయల్లా వర్ధిల్లుతోంది.

**ఇసుక తరలింపునకు రాచమార్గం**

చెక్‌పోస్టులు మూతపడటంతో అక్రమ రవాణాతో ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టే వారు పెరిగారు. మరోవైపు జిల్లా నుంచి ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఎర్రచందనం, బియ్యం, గంజాయితో పాటు అనేక నిషేధిత వస్తువులు ఇక్కడి నుంచి రవాణా అవుతున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి పెట్రోలు, డీజిల్‌తో పాటు గుట్కాలు, తంబాకు, ఖైనీ, మద్యం తయారీకి వినియోగించే స్పిరిట్ ఇతర నిషేధిత పదార్థాలను సరిహద్దులు దాటిస్తున్నారు.

మదనపల్లె మండలం చీకలబైలు చెక్‌పోస్టు వద్ద ఆటోల్లో తరలిస్తున్న చౌక బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. చౌడేపల్లె మండలంలోని సింగిరిగుంట చెక్‌పోస్టు మీదుగా పలమనేరు గుడియాత్తంకు అక్రమ రవాణా జరుగుతోంది.

ఏపీ ప్రభుత్వం సరఫరా చేసే రాయితీ ఎరువులను కొందరు కర్ణాటకకు తరలించి ఎక్కువకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

ఎలక్ట్రికల్ సామాన్లు, పెయింట్లు, గృహోపకరణాలు, ఇతర వస్తు సామగ్రి తెచ్చి జీవో వ్యాపారం చేసి ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా రూ.లక్షలు ఆదాయం గడిస్తున్నారు. ఏడాది క్రితం మదనపల్లెలో జేసీబీలు, ట్రాక్టర్ల యజమాని డీజిల్ బ్యారళ్లలో తెచ్చి నిల్వ ఉంచగా రెవెన్యూ అధికారులు సీజ్ చేసి, అతనిపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు.

**ఎక్కడెక్కడంటే...**

జిల్లా కేంద్రం మదనపల్లెకు 10 నుంచి 15 కి.మీల దూరంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. మదనపల్లె, పుంగనూరు, రామసముద్రం, పీటీఎం మండలాల సమీపంలోనూ కర్ణాటక సరిహద్దులో అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రామసముద్రం మండలంలో అనప్పల్లె, ఆల్చేపల్లె, చుక్కాండ్లపల్లె, బేడపల్లె, గజ్జిగంగనపల్లె సమీపంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది.



పీటీఎం మండలంలో మారుగానిపల్లె, చెన్నరాయునిపల్లె, అంకాల మడుగు, మల్లెల గ్రామాల సమీపంలో నాలుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. పుంగనూరు మండలం బెంగళూరు రోడ్డులోని సింగరిగుంట, మాగాండ్లపల్లె, చౌడేపల్లె మండలం సింగరిగుంట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మదనపల్లె మండలం బెంగళూరు రోడ్డు చీకలబైలు సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.

**పనిచేస్తున్నదొక్కటే**

పుంగనూరు మండలంలో ఒకటి, మదనపల్లె మండలంలోని చీకలబైలు వద్ద ఉన్న చెక్‌పోస్టులు మాత్రమే పనిచేస్తుండగా మిగిలినవన్నీ మూతపడ్డాయి.

**వైకాపాదే ఈ పాపం**

వైకాపా ప్రభుత్వంలో చెక్‌పోస్టుల్లో పనిచేయడానికి సిబ్బందిని ఏజెన్సీల ద్వారా నియమించుకుని ఆ పార్టీ నాయకులు అక్రమ వ్యాపారాలు, రవాణా యథేచ్ఛగా సాగించారు. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు చెక్‌పోస్టులన్నింటినీ మూసేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని తెరిపించినా, కొన్ని నెలల వ్యవధిలోనే మళ్లీ మూతపడ్డాయి.

## లేఅవుట్‌నే లేపేశారు!

ఒంగోలు: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 ఎకరాల భూమిని అక్రమార్కులు ఆక్రమించుకుని పంటల సాగు చేపట్టారు. ఎక్కడో మారుమూల పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ఎవరూ చూడనిచోట అనుకుంటే పొరపడినట్లే. జిల్లా కేంద్రమైన ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో పెద్దఎత్తున ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం రంగంలోకి దిగి భూముల స్వాధీనానికి అడుగులు వేసింది. ఒంగోలు నగర పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల మధ్య 170 ఎకరాల మేర భూమిని సేకరించి లేఅవుట్ (జగనన్న కాలనీ) ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ఎకరాకు ధర నిర్ణయించి రైతులకు పరిహారం సైతం అందజేశారు. కోర్టు కేసులు, అనర్హులకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టడం తదితర కారణాలతో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యం చోటుచేసుకుంది. ఖాళీగా ఉన్న ఆ భూములపై కొంతమంది అక్రమార్కులు కన్ను పడింది.

వెంగముక్కపాలెం పరిధిలోని సర్వే నంబరు 170, 171, 172లలో భూములను అక్రమార్కులు కబ్జా చేసి పంటల సాగు చేయడం మొదలుపెట్టారు. లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్లు సైతం తొలగించి పూర్తిగా దున్నేశారు. దీనిపై పట్టించుకునేవారు లేకపోవడంతో ఆక్రమణదారులు పొగాకు పంటలను వేశారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వారి ఆదేశాల మేరకు రెవెన్యూశాఖాధికారులు పంటలను ట్రాక్టరుతో దున్నించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు.

**రాజకీయ ఒత్తిళ్లు...**

భూ ఆక్రమణదారులు కొంతమంది స్థానిక పెద్దల ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను కలిశారు. ఆక్రమణలు తొలగించకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ భూమి అయినందున, పేదలకు పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తున్నందున సాధ్యం కాదని ఎమ్మెల్యే వారికి తేల్చి చెప్పారు. ఆక్రమణలు తొలగించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. చివరకు రెవెన్యూశాఖ అధికారులు ట్రాక్టరు తీసుల్లి వేసిన పంటలను ధ్వంసం చేశారు. పేదల కాలనీలో పంటలు సాగు చేయొద్దని, ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని, వాళ్లు వినిపించుకోకపోవడంతో పంటలను ధ్వంసం చేసి భూములను స్వాధీనం చేసుకున్నామని రెవెన్యూశాఖాధికారులు చెబుతున్నారు.

## శ్రీనివాస మంగాపురం.. 'మంగ' గా బాలీవుడ్ బ్యూటీ

టాలీవుడ్ లో ప్రస్తుతం కొత్త టాలెంట్ కు కొదవలేదు. వారసత్వంతో వచ్చే వాళ్లే కాకుండా, ఇతర భాషల నుండి క్రేజీ నటీనటులు కూడా మన దగ్గర పాగా వేస్తున్నారు. ఇప్పుడు ఒక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. హీరో డెబ్యూ అప్‌డేట్ తోనే ఈ ప్రాజెక్ట్ పై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. అజయ్ భూపతి అంటేనే ఒక కల్ట్ రోమాంటిక్ యాక్షన్ స్టైల్ గుర్తుకొస్తుంది. ఆయన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు చాలా వెయిటేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమాలో హీరోయిన్ గా ఎవరిని తీసుకుంటారనేది కొంతకాలంగా సస్పెన్స్ గా మారింది. రీసెంట్ గా ఈ విషయంలో చిత్ర బృందం ఒక క్లారిటీ ఇచ్చింది. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని ఈ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాషా, ఇప్పుడు మన టాలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుండి హీరోయిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో రాషా 'మంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు రివీల్ చేశారు. ట్రెడిషనల్ లుక్ లో రాషా




చాలా క్యూట్ గా కనిపిస్తోంది. ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే ఈ సినిమాలో పర్ఫార్మెన్స్ కు స్కోప్ ఉన్న క్యారెక్టర్ లోనే నటిస్తోందని అర్థమవుతోంది. ఇప్పటికే 'ఉయి అమ్మ' గర్ల్ గా నెట్టింట ఫుల్ పాపులారిటీ ఉన్న రాషాకు, ఈ తెలుగు డెబ్యూ సినిమా మరింత మైలేజీని ఇస్తుందని ఫిలిం నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్ లో దాదాపు 30 రోజుల పాటు మొదటి షెడ్యూల్ పూర్తి చేశారు. సినిమాలోని సుమారు 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం రెండో షెడ్యూల్ లో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ తో పాటు సాంగ్స్ ను కూడా చిత్రీకరిస్తున్నారు. 2026 లో ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా తగ్గకుండా టీమ్ మొత్తం పక్కా ప్లానింగ్ తో ముందుకు వెళ్తోంది. లెజెండరీ ప్రొడ్యూసర్ అశ్వినీ దత్ సమర్పణలో, పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ ప్రాజెక్ట్ కు అదిరిపోయే ట్యూన్స్ ఇస్తున్నారట. ఒక మంచి లవ్ స్టోరీకి పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తోడైతే రిజల్ట్ ఎలా ఉంటుందో అజయ్ భూపతి గత సినిమాలతో నిరూపించారు. అదే మ్యాజిక్ ఇక్కడ కూడా రిపీట్ అవుతుందని టీమ్ ధీమాగా ఉంది. జయకృష్ణ, రాషా జంట స్క్రీన్ మీద ఫ్రెష్ గా ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. హీరో, హీరోయిన్ల ఫస్ట్ లుక్ లతోనే సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. రాషా తడాని తన గ్లామర్ తో పాటు యాక్టింగ్ తో తెలుగు ఆడియన్స్ ను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

## ఈషాతో డేటింగ్.. ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్నా - తరుణ్ భాస్కర్

2016లో విజయ్ దేవరకొండను హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కించిన చిత్రం 'పెళ్లి చూపులు'. ఈ సినిమా ద్వారా దర్శకుడుగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు తరుణ్ భాస్కర్ దాస్యం. ఈ సినిమాకి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగానే కాకుండా ఉత్తమ మాటల రచయితగా కూడా ఈయనకు నేషనల్ అవార్డు లభించింది. ఈ సినిమా తర్వాత దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా మంచి పేరు దక్కించుకున్నారు. 2019లో 'మీకు మాత్రమే చెప్తా' అనే సినిమా ద్వారా హీరోగా ఇండస్ట్రీకి పరిచయమైన తరుణ్ భాస్కర్ 'మిడిల్ క్లాస్ మెలోడీస్' అనే చిత్రంలో అతిథి పాత్ర కూడా పోషించారు. చివరిగా 2023లో 'కీడా కోలా' అనే చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా అందులో నటించాడు కూడా. అలాంటి ఈయన 2024లో మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా అనే చిత్రంలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాంటి ఈయన తాజాగా హీరోగా నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'.. మలయాళంలో వచ్చిన సూపర్ హిట్ మూవీ



'జయ జయ జయ జయహే' చిత్రానికి రీమేక్ కావడం గమనార్హం. ఈషా రెబ్బ హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పనిచేస్తున్నారు. కామెడీ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ సినిమా జనవరి 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొంటున్న చిత్ర బృందం సినిమా గురించి పలు విషయాలు పంచుకున్న విషయం తెలిసిందే.మరోవైపు పలు ఇంటర్వ్యూలు ఇస్తూ తెగ సందడి చేస్తున్న తరుణ్ భాస్కర్ గత కొంతకాలంగా ఈషా రెబ్బాతో డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు రాగా దానిపై స్పందించి అందరిని ఆశ్చర్యపరిచారు. ఇంటర్వ్యూలో భాగంగా మీరు ఈ సినిమా మొదలుపెట్టినప్పటి నుంచి ఈషా రెబ్బాతో డేటింగ్ లో ఉన్నట్లు పలు రకాల కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై మీ సమాధానం ఏమిటి ?అంటూ హోస్ట్ ప్రశ్నించగా.. తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. "ఈషా రెబ్బ నాకు ఫ్రెండ్ కంటే చాలా ఎక్కువ. ఆమె నా బెస్ట్ ఫ్రెండ్. గత నాలుగు సంవత్సరాలుగా నాకు అన్ని విషయాలలో తోడుగా నిలిచింది. ఇందులో చెప్పడానికి కానీ దాచడానికి కానీ ఏమీ లేదు. అయితే వ్యక్తిగత విషయం కాబట్టి అనౌన్స్ చేయడానికి సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నాను. అయితే ఇప్పుడు చెబితే అది వేరే వాళ్లను ఎఫెక్ట్ చేసే అవకాశం ఉంది. ఈ టైంలో అనౌన్స్మెంట్ చేసినా నాకేం ప్రాబ్లం లేదు. బర్రె తోలు మీద వాన పడినట్టు మనకేం ఇబ్బంది ఉండదు కానీ ఎదుటి వాళ్లకు ఇబ్బంది కలగకూడదు కదా. కానీ ఖచ్చితంగా దేవుడి దయతో అన్నింటికీ చెక్ పెడుతూ త్వరలోనే క్లారిటీ ఇస్తాను" అంటూ తరుణ్ భాస్కర్ తెలిపారు. అయితే ఇద్దరి రిలేషన్ గురించి కన్ఫర్మ్ చేస్తారా? లేక రూమర్స్ అని కొట్టి పారేస్తారా అన్న విషయంపై క్లారిటీ ఇవ్వలేదు.





## తిరువీర్ 'భగవంతుడు'.. టీజర్ ఎలా ఉందంటే..




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం భగవంతుడు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఆ పీరియడ్ రూరల్ డ్రామాపై మొదటి నుంచే మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా మేకర్స్ మూవీ టీజర్ ను విడుదల చేశారు. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన టీజర్ లో చూపించిన విజువల్స్, భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. టీజర్ ప్రారంభంలో వినిపించే వాయిస్ ఓవర్ కథకు పునాది వేస్తుంది. "ఈ భూమిపై రెండు రకాల కథలు జరుగుతాయి.. ఒకటి మనుషులు దేవుళ్లుగా మారడం, మరొకటి దేవుళ్లు మనుషుల మధ్య జీవించడం" అనే డైలాగ్ తో ఆసక్తి పెంచారు మేకర్స్. ఆ తర్వాత హీరో తిరువీర్ పాత్రను పవర్ ఫుల్ గా పరిచయం చేశారు. గ్రామీణ నేపథ్యానికి తగ్గట్టు ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ ప్రత్యేకంగా నిలిచాయి. హీరో-హీరోయిన్ మధ్య సాగే ప్రేమకథ కూడా టీజర్ లో చూపించారు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా కనిపిస్తూ కథలో ఎమోషన్ ను యాడ్ చేసింది. ఆమె, తిరువీర్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. మరోవైపు విలన్ గా రిషి నాగరాజు ఎంట్రీ ఇస్తూ కథలో ఇంటెన్స్ పెంచారు. హీరో- విలన్ మధ్య సాగే గొడవలు క్రమంగా వయోలెన్స్ కు దారి తీసేలా చూపించడం ఆసక్తిని రెట్టింపు చేసింది. యాక్షన్ సన్నివేశాలు, గ్రామీణ వాతావరణం, న్యాచురల్ సెట్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రతి ఫ్రేమ్ లో రియాలిటీ కనిపించేలా చిత్రీకరించారు. తిరువీర్ ఇప్పటికే మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు భగవంతుడు సినిమాలో మరింత పవర్ ఫుల్, ఎమోషన్స్ తో కూడిన పాత్రలో కనిపించబోతున్నారు.

చిత్రానికి జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ జీవన విధానాన్ని నిజాయితీగా చూపించే ప్రయత్నం చేశారనే భావన టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. నిర్మాతగా బిజినెస్ మ్యాన్ రవి పనస సినీ రంగంలోకి అడుగుపెడుతూ రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. దివంగత పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో సినిమా రూపొందడం ప్రత్యేకతను సంతరించుకుంది. సాంకేతిక విభాగం కూడా సినిమాకి స్ట్రాంగ్ గా నిలుస్తోంది. కేపీ సంగీతం, రాజ్ తోట సినిమాటోగ్రఫీ, నేషనల్ అవార్డ్ విన్ ప్రవీణ్ పూడి ఎడిటింగ్ సినిమాకు మరింత క్వాలిటీ తీసుకువచ్చాయి. కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకసారి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి భగవంతుడు టీజర్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి రేకెత్తిస్తూ సినిమాపై హైప్ పెంచేసిందని చెప్పాలి.

## సూపర్ హిట్ జోడీ.. సీక్వెల్ కాదు కానీ..?



ఒక సూపర్ హిట్ సినిమాలో నటించిన జోడీ అంటే ఆడియన్స్ లో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ఆ ఇద్దరు కలిసి మరోసారి నటిస్తే చూడాలని కోరుకుంటారు. ఈమధ్య కాలంలో అలా ఇద్దరి కలిసి నటించాలని ఆడియన్స్ బాగా కోరుకున్నది మాత్రం సీతారామం జంట అనే చెప్పొచ్చు. దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ తో కలిసి హను రాఘవపూడి తెరకెక్కిన సీతారామం ప్రేక్షకుల మనసులు కదిలించేలా చేసింది. ముఖ్యంగా అప్పటివరకు బాలీవుడ్ లో పెద్దగా గుర్తింపు తెచ్చుకోని మృణాల్ ఠాకూర్ కి సీతారామం ఒక బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత తెలుగుతో పాటు హిందీలో కూడా మృణాల్ ఠాకూర్ బిజీ అయ్యింది.

**దుల్కర్ సల్మాన్ తెలుగులో బిజీ..** దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ ఇద్దరి జోడీ ఆ సినిమాకు మరింత హైలెట్ గా నిలిచింది. సీతారామం వచ్చి 4 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఆ సినిమాలో సాంగ్స్, కొన్ని సీన్స్ ప్రేక్షకులను వెంటాడుతున్నాయి. ఐతే సూపర్ హిట్ కొట్టిన ఈ జంటతోనే మరో సినిమా చేయొచ్చు కదా అని ఆడియన్స్ నుంచి రిక్వెస్ట్ మెసేజ్ లు వస్తున్నాయి. దుల్కర్ సల్మాన్ ఓ పక్క తెలుగులో బిజీ హీరో అయ్యాడు. ఇక్కడ వరుస సినిమాలతో దుల్కర్ సత్తా చాటుతున్నాడు. మృణాల్ ఠాకూర్ తెలుగు కెరీర్ కాస్త స్లోగా ఉన్నా హిందీలో వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తమిళ్ లో కూడా ఒక మూవీ ఓకే చేసింది. ఇదిలా ఉంటే లేటెస్ట్ గా సోషల్ మీడియాలో సీతారామం జంట అదే దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ కలిసి ఉన్న ఒక పోస్టర్ వైరల్ అయ్యింది. ఇద్దరు కలిసి ఏదో సినిమా చేస్తున్నారా అంటూ సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో డిస్కషన్ జరుగుతుంది.

**సల్మాన్, మృణాల్ సీతారామం 2..** రీసెంట్ గా మృణాల్ ఠాకూర్ ఒక తెలుగు సినిమాకు సైన్ చేస్తున్నా అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈలోగా దుల్కర్ తో కలిసి ఉన్న పోస్టర్ వైరల్ అయ్యింది. అది చూసిన ఆడియన్స్ మృణాల్ దుల్కర్ తో మరో సినిమా చేస్తుందని కన్ ఫర్మ్ అయ్యారు. ఐతే సీతారామం జంట ఆ సినిమా సీక్వెల్ చేస్తే చూడాలని ఆడియన్స్ కోరుతున్నారు. ఐతే దుల్కర్ సల్మాన్, మృణాల్ కలిసి ఇప్పుడప్పుడే సీతారామం 2 చేసే ఛాన్స్ లేదు. ఎందుకంటే ఆ డైరెక్టర్ హను ప్రభాస్ తో ఫౌజీ సినిమా బిజీలో ఉన్నాడు. వైజయంతి మూవీస్ కూడా సీతారామం 2 గురించి అసలు కాల్ తీసుకోలేదు. సో ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు కాబట్టి దుల్కర్, మృణాల్ చేసేది సీతారామం సీక్వెల్ అయితే కాదు.

ఐతే ఇద్దరు కలిసి చేస్తున్న కొత్త సినిమా అప్డేట్ కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. మరి ఈ సినిమాపై ఆడియన్స్ లో ఎక్స్ పెక్టేషన్స్ ఒక రేంజ్ లో ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన డీటైల్స్ ఎప్పుడు బయటకు వస్తాయన్నది చూడాలి.

## "ఊ అంటావా మావ" అంటూ ఉర్రూతలూగించిన ఈ బ్యూటీ ఇప్పుడేం చేస్తోందో తెలుసా?

ఇండస్ట్రీలోకి ఎంతోమంది నటీనటులు అడుగు పెడతారు. వారితో పాటు సింగర్స్ కూడా తమ టాలెంట్ ను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయితే ఒక్క సినిమాతో మంచి పాత్ర పడితే నటీనటులు ఎలా అయితే ఒక్క నైట్ లోనే పాపులారిటీ సంపాదించుకుంటారో ఇక సింగర్స్ కూడా అంతే. ఒక్క సాంగ్ వారి కెరియర్ నే మార్చేస్తుంది అనడంలో సందేహం లేదు. అలాంటి నటీనటులు కానీ , సింగర్స్ కానీ ఏదో ఒక సమయంలో అభిమానుల నుంచి.. ఆ తర్వాత తెరమరుగవుతూ ఉంటారు. అయితే సడన్గా సోషల్ మీడియాలో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిస్తే మాత్రం.. ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు అని తెలుసుకోవడానికి అభిమానులు కూడా ఆరా తీస్తూ ఉంటారు. అలాంటి వారిలో "ఉ అంటావా మావా.. ఉఊఅంటావా మావా" అనే పాట తో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఇంద్రావతి చౌహాన్ కూడా ఒకరు. ప్రముఖ జానపద గాయకురాలు.. సినిమా పాటల సింగర్ మంగ్లీ చెల్లిగా 'పుష్ప' సినిమాల్లో "ఉ అంటావా" అనే స్పెషల్ సాంగ్ తో ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. హస్కీ వాయిస్ తో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ ఒక్క పాటతోనే సెన్సేషన్ క్రియేట్ చేసింది ఇంద్రావతి. ఆ తర్వాత తమిళ్లో వచ్చిన 'ఎంజాయ్' అనే చిత్రంలో "చెంగు చక్కెర కన్ను" అనే పాట పాడి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. అలా సినీ పాటలతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకున్న ఇంద్రావతి.. పెద్దగా ఆడియన్స్ దృష్టిలో పడలేదు. ఇకపోతే అలాంటి ఈమె సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోని తాజాగా షేర్ చేసిన ఫోటోలు అభిమానులను సైతం



ఆశ్చర్యపరుస్తున్నాయి. ఎప్పుడూ సాంప్రదాయంగా కనిపించే ఇంద్రావతి సడన్గా గ్లామర్ లుక్ లో దర్శనమిచ్చేసరికి అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.. ఇక ప్రస్తుతం అమ్మడిని చూసిన తర్వాత ఇప్పుడు ఈమె ఎక్కడ ఉంది? ఏం చేస్తోంది అనే కామెంట్లు కూడా వ్యక్తమవుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. 2025లో విడుదలైన 'కుబేర' సినిమా నుండి "పిప్పి డుం డుం" అనే పాటతో పాటు ' బ్యాడ్ గర్ల్స్' సినిమాలోని "లేలియో" అనే పాట పాడారు. ఇక ఇప్పటివరకు తెలుగు, తమిళ్, కన్నడ భాషలో పాటలు పాడి ప్రేక్షకులను అలరించిన ఈమె.. అటు మలయాళ సినీ ఇండస్ట్రీలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. మలయాళం లో కూడా 'అంకం అట్టహాసం' అనే సినిమాలో ఒక పాట పాడి.. అక్కడ కూడా తన గాత్రంతో ప్రేక్షకులను అలరించింది. తన అక్కలాగే శివరాత్రి పాటలతో పాటు ప్రత్యేక ఆల్బమ్స్ ను అలాగే పాటలను విడుదల చేస్తూ బిజీగా మారింది.. ఇక ఇప్పుడు మహాశివరాత్రి దగ్గర్లో ఉన్న నేపథ్యంలో మరో ఆల్బమ్ సాంగ్ కోసం ఆమె సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి అభిమానులు ఇప్పటికే సింగర్లు, మ్యూజిక్ డైరెక్టర్లు హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇంద్రావతి కూడా హీరోయిన్గా ఎంట్రీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. మరి కాలం కలిసి వస్తే.. భవిష్యత్తులో ఇంద్రావతి కూడా హీరోయిన్గా అవతరిస్తుందేమో చూడాలి..

## నేపోకిడ్స్‌తో పెట్టుకుని బుక్కయిన ఒర్రీ?

బాలీవుడ్ స్టార్ కిడ్స్ సారా అలీ ఖాన్, ఇబ్రహీం అలీ ఖాన్ సోషల్ మీడియా ప్రభావశీలి ఒర్రీ మధ్య ఇటీవల జరిగిన గొడవ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వీరి మధ్య ఉన్న స్నేహం ఒక్కసారిగా వికటించడానికి కారణాలు షాకిస్తున్నాయి. అసలు ఈ గొడవకు కారణం ఏమిటో ఆరా తీస్తే తెలిసిన సంగతులివి. వీరి మధ్య గొడవ ఏదో పెద్ద వ్యక్తిగత కారణం వల్ల కాకుండా, ఒక చిన్న వాట్సాప్ మెసేజ్ వల్ల మొదలైందని ఒర్రీ స్వయంగా వెల్లడించారు. ఒర్రీ తన ఇన్?స్టాగ్రామ్ స్టోరీస్‌లో సారా అలీ ఖాన్‌తో జరిగిన చాట్‌ను షేర్ చేస్తూ ఆమెను దురంహకారి (రూడ్) అని కామెంట్ చేసాడు. ఒక ఈవెంట్ గురించి సారా పంపిన మెసేజ్‌కు ఒర్రీ స్పందిస్తూ, ఆమె తనను చాలా చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. -చీప్-, -ఫేక్- అంటూ అతడు కామెంట్ చేసాడు. ఒర్రీ ఆరోపణల ప్రకారం.. సారా అలీ ఖాన్ తనను కేవలం ఫోటోల కోసం, సోషల్ మీడియా అటెన్షన్ కోసమే వాడుకుంటోందని ఆయన ఫీలయ్యారు. నువ్వు నన్ను నీ ఫ్రెండ్ అని చెప్పుకుంటావు కానీ.. నీ ప్రవర్తన మాత్రం చాలా దారుణంగా ఉంటుందిఅని ఒర్రీ సారాను ఉద్దేశించి బహిరంగంగా



వ్యాఖ్యానించారు. ఆ తర్వాత సీన్ లోకి ఇబ్రహీం వచ్చాడు. ఒర్రీ - ఇబ్రహీం అలీఖాన్ ఒకప్పుడు చాలా క్లోజ్ ఫ్రెండ్స్. అయితే సారా-ఒర్రీ గొడవలో ఇబ్రహీం తన సోదరి సారా పక్షాన నిలబడటంతో ఒర్రీకి, ఇబ్రహీంకి మధ్య కూడా దూరం పెరిగింది. వీరిద్దరూ కలిసి ఉన్న పాత ఫోటోలను ఒర్రీ తన ప్రొఫైల్ నుండి తొలగించడం లేదా ఆర్కైవ్ చేయడంతో వారి మధ్య చెడిందని స్పష్టమైన సంకేతం వచ్చింది. బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం.. వీరు ప్రస్తుతం ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఒర్రీ తన ఇంటర్వ్యూలలో మాట్లాడుతూ, నేను ఎవరికైనా గౌరవం ఇస్తాను.. కానీ తిరిగి అది రానప్పుడు అక్కడ ఉండను అని స్పష్టం చేశారు. మరోవైపు సారా అలీ ఖాన్ ఈ వివాదంపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఒకప్పుడు ప్రతి పార్టీలో కలిసి కనిపించిన ఈ ముగ్గురు, ఇప్పుడు ఒకరి ముఖం ఒకరు చూసుకోవడానికి కూడా ఇష్టపడటం లేదు. బాలీవుడ్‌లో ఇలాంటి ఫ్రెండ్‌షిప్ బ్రేకప్స్ సర్వసాధారణమే అయినా, ఒర్రీ బహిరంగంగా చాట్స్ షేర్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సారా వర్సెస్ ఒర్రీ సోషల్ మీడియా వార్ ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. ఒర్రీ తనపై చేసిన బహిరంగ విమర్శలకు సారా నేరుగా స్పందించకుండా, ఒక పాట ద్వారా చాలా తెలివిగా, పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. ఒర్రీ తన వాట్సాప్ చాట్‌లను లీక్ చేస్తూ సారాను -రూడ్- అని కామెంట్ చేసాక, సారా తన ఇన్‌స్టాలో ఒక ఫోటోను షేర్ చేస్తూ దానికి ఒక బాలీవుడ్ పాటను జత చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536